
# " గురు పథం - గురు వాణి "

మొదటి భాగం



## " ఆనాపానసతి ధ్యానం చేసే పద్ధతి "


సుఖాసనంలో .. హాయిగా .. కూర్చుని .. చేతులు రెండూ కలిపి .. కళ్ళు రెండూ మూసుకుని.. ప్రకృతిసహజంగా జరుగుతూన్న ఉచ్ఛ్వాస, నిశ్వాస లనే .. ఏకధారగా.. గమనిస్తూ వుండాలి ! ఏ దేవతారూపాన్నీ, ఏ గురు రూపాన్నీ ప్రత్యేకంగా ఊహించుకోరాదు! ఏ దైవ నామస్మరణా వుండరాదు! మామూలుగా జరుగుతూన్న ఉచ్ఛ్వాస నిశ్వాసలనే ఆహ్లాదంగా గమనిస్తూ వుండాలి.

మధ్య మధ్యలో అనేకానేక ఆలోచనలు వస్తున్నా వాటిని ఎప్పటికప్పుడు ' కట్ ' చేస్తూ.. మళ్ళీ మళ్ళీ శ్వాస మీదకే.. ధ్యాసను మరల్చుతూ వుంటే.. క్రమక్రమంగా .. ఆలోచనా-రహిత-స్థితి కలుగుతుంది .. మనస్సు నిర్విషయం, పరిశూన్యం అయిపోతుంది.. ఇదే ధ్యానస్థితి.



ఈ విధమైన ఆలోచనా-రహిత-స్థితిలో కలిగే అనేకానేక శారీరక, నాడీమండల, ఆత్మానుభవాలను శ్రద్ధగా గమనిస్తూ వుండాలి. ఆ స్థితిలో శరీరం వెలుపల వున్న విశ్వమయ ప్రాణశక్తి .. అపారంగా శరీరంలోకి ప్రవేశించి నాడీమండలాన్ని శుద్ధి చేస్తూ వుంటుంది.

మరి ఎవరి వయస్సు ఎంత వుంటుందో .. కనీసం అన్ని నిమిషాలు .. తప్పనిసరిగా.. రోజుకి రెండుసార్లుగా.. ధ్యానం చేయాలి. ఈ విధంగా ప్రతిరోజూ నియమబద్ధంగా ధ్యాన అభ్యాసాన్ని అలవాటు చేసుకోవాలి.



" మహాశక్తి పిరమిడ్ ధ్యాన కేంద్రం " దువ్వాడ, విశాఖపట్టణం



# " ధ్యాన జగత్ "

" ధ్యాన జగత్ " విశేష అభివృద్ధి కోసం
మీ విరాళాలను క్రింది అకౌంట్‌లో జమచేయగలరు

## " Dhyana Jagat "

Google Pay | Phone Pe | Paytm | WhatsApp

No.: 70754 99799

Union Bank of India A/c No 244711100001194

IFSC CODE : UBIN0824470

GREEN HILLS COLONY BRANCH, HYDERABAD

వివరాలకు : D. కేశవరాజు - 70754 99799

మీ Payment Receipt, పూర్తిచిరునామా, పిన్‌కోడ్
మరి సెల్ నెంబర్‌తో సహా WhatsApp కు పంపగలరు

www.dhyanajagat.com | e-mail : dhyanajagat2020@gmail.com

**నవ్యయుగ ధ్యానయోగ మాసపత్రిక " ధ్యాన జగత్ " .. చందాదారులు కండి .. చదవండి .. చదివించండి!**

| | | | |
|---|---|---|---|
| ☐ సంవత్సర చందా రూ.500 /- | ☐ రెండు సంవత్సరాల చందా రూ.1000 /- | ☐ ప్యాట్రన్ రూ॥ 10,000/- | ☐ పోషకులు రూ॥ 25,000/- |
| రిజిష్టర్డ్ పోస్ట్ : ☐ 1 సంవత్సరం రూ.700 /- | ☐ 2 సంవత్సరాలు రూ.1400 /- | ☐ ప్యాట్రన్ రూ॥15,000/- | ☐ పోషకులు రూ॥30,000/- |

# " నెట్టింట్లో ధ్యాన జగత్ " For e-copy/digital copy

year Subscription - Rs.450/- | 2 years Subscription - Rs.900/-

భారతదేశంలో ఉన్నవారికోసం : **www.dhyanajagat.com**

విదేశాలలో ఉన్నవారికోసం : **global.dhyanajagat.com**

**e-copy/ digital copy** ని
వెబ్‌సైట్ ద్వారా గత సంచికలతో పాటు సరిక్రొత్త సంచికను కూడా
మీ సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ మరి డెస్క్‌టాప్‌లో చదువుకోవచ్చు!


ఈ అవకాశాన్ని ప్రతి తెలుగువారు సద్వినియోగం చేసుకోగలరు!

**గత సంచికలు ఉచితం ..**

వివరాలకు : ధ్యానరత్న కేశవరాజు : 70754 99799

# “ గురు పథం - గురు వాణి ”

మొదటి భాగం



# " గురు పథం - గురు వాణి "

## మొదటి భాగం


| | | |
|---|---|---|
| మొదటి ముద్రణ | : | జూలై 2019 |
| ప్రతులు | : | 1000 కాపీలు |
| వెల | : | అమూల్యం |
| ప్రతులకు | : | **మహాశక్తి పిరమిడ్ ధ్యాన కేంద్రం**<br>మాతృశ్రీ నగర్, దువ్వాడ<br>విశాఖపట్టణం - 530 046<br>ఫోన్ : |
| సంకలనం & ఎడిటింగ్ | : | T. వాణి |
| టైప్‌సెట్టింగ్ & డిజైన్ | : | M. మధుసూదన రావు |
| ముద్రణ | : | **శ్రీ సాయికిరణ్ గ్రాఫిక్స్**<br>రోడ్ నెం. 3, N.B.R. కాలనీ<br>మీర్‌పేట, హైదరాబాద్ - 500 097<br>ఫోన్ : 80196 78817 |

# " గురుదేవో భవ "

" గురువు " అంటే " బరువు అయినవాడు " అని అర్థం
" గురువు " అన్నదానికి విపరీత పదం " లఘువు "
" లఘువు " అంటే " తేలికయినవాడు " అని అర్థం
ఒకానొక లఘువు .. ఒకానొక గురువు కావడానికి
ఎంతో దీక్ష .. మరెంతో అభ్యాసం అవసరం
సంగీతంలో లఘువులు .. సంగీతంలో గురువులు కావడం కోసం
ఊర్రూతలూగుతూ ఉంటారు
ఆటలలో లఘువులు .. ఆటలలో గురువులు కావడం కోసం
నిరంతరం అభ్యాసం చేస్తూ ఉంటారు
అలాగే " జీవన విజ్ఞాన శాస్త్రం " తెలియని ప్రాపంచిక లఘువులు
ఆధ్యాత్మిక గురువులుగా ఎదగడం కోసం అనేకానేక ధ్యాన-జ్ఞాన సాధనలు చేస్తూంటారు
" ఆధ్యాత్మిక గురువు " అంటే ఆత్మానుభవంతో .. పరలోకజ్ఞానంతో సుసంపన్నుడయినవాడు

ఏ విద్యలో అయినా .. ఏ కళలో అయినా
గురువులుగా అయిన వాళ్ళ వాక్కులనే .. " గురు బోధ " అంటాం
లఘువు సంసిద్ధంగా ఉంటే గురువు లభించి తీరుతాడు .. మరి గురు బోధ జరిగి తీరుతుంది
గురువుల వాక్కులే " గురు వాణి "
" గురు వాణి " ని పదే పదే స్మరించుకుంటూ గురువు చూపిన పథంలో
అగ్రగామి కావడమే సరియైన లఘువు యొక్క లక్ష్యం!
" గురు పథం - గురు వాణి "
ఈ గ్రంథంలో కొంతమంది మహా గురువుల యొక్క బోధనలను మరొక్కసారి జ్ఞప్తికి తెచ్చుకుంటాం!
నా స్వంత గురువు గారయిన " శ్రీ సద్గురు సదానంద యోగి " గారికి నా ప్రణామాలు
ఈ గ్రంథం పిరమిడ్ మాస్టర్లందరికీ కరదీపిక అవ్వుగాక!

బ్రహ్మర్షి పితామహ పత్రీజీ

# " గురు వందనం "

మానవులందరినీ మహానుభావులుగా .. జనులందరినీ దైవస్వరూపులుగా .. జీవులన్నింటినీ మిత్రులుగా తీర్చిదిద్దడానికి కంకణం కట్టుకుని ఈ భువిపై జన్మించి .. వసుధైక కుటుంబం నిర్మాణమే మహా ఆశయంగా .. అనుక్షణం తపించి .. శోధించి .. ఆ యొక్క సత్యాన్ని సాధించిన ఎందరెందరో అమృత మూర్తులకు మరి గురు స్వరూపులకు పాదాభివందనాలు!

***" గురు పథం – గురు వాణి "*** పేరుతో పరమగురు జాడలను అతి సులభంగా తెలుగువారు అందరూ తెలుసుకునే మహద్భాగ్యం మన ముందుకు రావడం మహదానందం. అది మన ధ్యాన యోగ ఫలం మరి మన జన్మజన్మల సౌభాగ్యఫలం!

విశాఖపట్టణం, దువ్వాడ, మాతృశ్రీ నగర్, ***" మహాశక్తి పిరమిడ్ ధ్యాన కేంద్రం "*** వారు గత ఆరు సంవత్సరాలుగా ప్రతి నిత్యం ***" బ్రహ్మ భావన – ధ్యాన సత్సంగం "*** నిర్వహిస్తూ .. ఎందరెందరో మహానుభావుల జీవిత చరిత్రలను పుస్తకరూపంలో ప్రచురిస్తూ .. విశేష ఆత్మ విజ్ఞాన ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు.

2019 గురుపౌర్ణమి సందర్భంగా వీరు చేస్తున్న ***" మహా గురుసేవ "*** తో ఎందరో పూజ్య గురు సందేశాలను .. ***" గురు పథం – గురు వాణి "*** గా .. పుస్తక రూపంలో అందించడానికి పూనుకోవడం అభినందనీయం. ఈ పుస్తక ప్రచురణకు స్ఫూర్తిని ఇచ్చిన ***" బ్రహ్మం అమ్మ "*** ***" శ్రీమతి అల్లూరి సూర్యవతి "*** గారికి కృతజ్ఞతలు.

ఈ పుస్తక ప్రచురణకు సహకరించిన పిరమిడ్ మాస్టర్లకూ .. ***" ధ్యానజగత్ "*** బృందానికీ ముఖ్యంగా ఎడిటర్ ***" T. వాణి "*** మేడమ్‌కూ వందనాలు.

***" ధ్యానజగత్ ", " శాకాహారజగత్ "*** ల సాధనలకు ఉద్యమించిన ***" బ్రహ్మర్షి పితామహ పత్రీజీ "*** యొక్క అకుంఠిత కృషికి గురుదక్షిణగా ఈ ***" గురుపథం – గురు వాణి "*** ని ప్రజలందరికీ ఉచితంగా అందజేయడం గురుకృపకు ప్రత్యక్ష నిదర్శనం.

***" గురుదేవోభవ "***

అభినందనలతో ..

**ధ్యానరత్న నందప్రసాద రావు**
M.D. & CEO, PSSM Media Ltd.
PSSM కార్యనిర్వాహక కార్యదర్శి
Cell : 92466 36854

# " శ్రీ గురుభ్యోన్నమః "

ఈ భూమి మీద జన్మ తీసుకున్న ప్రతి ఒక్కరికీ .. ఆనందంగా మరి సుఖంగా బ్రతికేందుకు .. **" సరియైన జ్ఞానం "** తప్ప ఇంకొకటి అవసరం లేదు. అలాంటి సరియైన జ్ఞానాన్ని మనం **" సరియైన గురువు "** ద్వారానే పొందుతాం!

అందుకే .. సరియైన గురువు ఎదురైనప్పుడు .. ఆత్మ సంస్కారం, అర్హత మరి ఆధ్యాత్మికంగా ఎదగడానికి సంసిద్ధంగా ఉన్న మనం .. చిన్నప్పుడెప్పుడో తిరునాళ్ళల్లో తప్పిపోయినప్పుడు వదిలి పెట్టేసిన అమ్మ చేయి పెద్దయ్యాక మళ్ళీ దొరికినట్లుగా సంబరపడిపోతాం! అణకువతో, విధేయతతో, శ్రద్ధతో మరి ఆత్మసమర్పణాభావంతో వారిని సేవించుకుంటాం! వారి అడుగులో అడుగులు వేస్తూ మన బ్రతుకులను పండించుకుంటాం!

అప్పుడే ఆ సద్గురువు మనలో ఉన్న దేహధ్యాస రూపమైన మాలిన్యాన్ని కడిగి .. స్వచ్ఛమైన బ్రహ్మధ్యాస పథంలో మనల్ని కూర్చోబెడతారు. మనకు తెలియదగింది ఏదో .. మనం తెలుసుకోవలసింది ఏదో కూడా తెలియని అజ్ఞానపు దశనుంచి మనల్ని .. సదా సత్యవీధులలో విహరించే ఆత్మజ్ఞాన దశకు చేరుస్తారు!

అలాంటి గొప్ప గొప్ప గురువుల జీవిత విశేషాలను సంకలనం చేసి .. 2019 **" గురుపౌర్ణమి "** సందర్భంగా **" గురు పథం – గురు వాణి "** రూపంలో అందించడం నా మహద్భాగ్యంగా భావిస్తున్నాను! ఇంత గొప్ప వరాన్ని నాకు అందించిన గురుదేవులు **" బ్రహ్మర్షి పితామహ పత్రీజీ "** పాదపద్మాలకు వినమ్రతతో నమస్కరిస్తూ ..

**T. వాణి**
ఎడిటర్, **" ధ్యానజగత్ "** మాసపత్రిక
ఛైర్మన్, తెలుగు భాషా విభాగం
**PSSM Media Ltd.**
Cell : 97040 27924

# విషయసూచిక



| | | |
|---|---|---|
| 1. | " శ్రీ సద్గురు సదానందయోగి " | 7 |
| 2. | " సనారీ విశ్వనాథావధూత " | 13 |
| 3. | " శ్రీ నారాయణ గురు " | 17 |
| 4. | " శ్రీశ్రీశ్రీ మలయాళస్వామి " | 23 |
| 5. | ' శ్రీ శ్యామాచరణ లాహిరీ " | 33 |
| 6. | " జ్ఞానావతార్ శ్రీ యుక్తేశ్వర్ గిరి " | 42 |
| 7. | " శ్రీ పరమహంస యోగానంద " | 49 |
| 8. | " భగవాన్ శ్రీ సత్యసాయి " | 69 |
| 9. | " ముమ్మడివరం పెద్దబాలయోగి " (1930-1985) | 73 |
| 10. | " కొత్తలంక .. సయ్యద్ అహ్మదలీ షా ఖాదర్‌వలీ " | 77 |
| 11. | " H.P. బ్లవాట్‌స్కీ " | 82 |
| 12. | " హజ్రత్ తాజుద్దీన్ బాబా " | 90 |
| 13. | " జిల్లెళ్ళమూడి అమ్మ .. అనసూయమ్మ " | 94 |
| 14. | " గ్రాండ్ మాస్టర్ చింగ్ హాయ్ " | 101 |


## సేకరణ

" ఆంధ్రయోగులు ", ప్రొఫెసర్ B. రామరాజు
" Women of Power and Grace ", Timothy Conway
Life and Teachings of Narayana Guru, Sri Nataraja
" శ్రీ మలయాళస్వామి జీవితచరిత్ర ", శ్రీవ్యాసాశ్రమం, ఏర్పేడు
God's Direct Contact, Supreme Master Ching Hai
www.ts-adayar.org
www srisatyasai.org.in
www lahiri-mahasaya.org
" ఒక యోగి ఆత్మకథ " - శ్రీ పరమహంస యోగానంద
" విశ్వదర్శనం " - శ్రీ నందూరి రామమోహన రావు

# " శ్రీ సద్గురు సదానంద యోగి "

PSSM కు ఆదిదేవులు మరి ***" బ్రహ్మర్షి పితామహ పత్రీజీ "*** యొక్క మహా గురువు అయిన ***" శ్రీ సదానందయోగి "*** గారు .. అనేక శతాబ్దాల క్రితమే అరేబియా దేశం నుంచి భారతదేశం వచ్చి .. 1975 సంవత్సరంలో కర్నూలుకు చేరుకున్నారు. అక్కడ తమను కలిసిన తమ ప్రియశిష్యులు **" సుభాష్ "** కి .. కొన్ని వందల సంవత్సరాలుగా తమలో నిక్షిప్తం చేసుకుని ఉన్న ఆధ్యాత్మిక శక్తులన్నింటినీ .. తదుపరి ధ్యాన విద్యా ప్రచారార్థం .. ధారపోశారు. ***" మాంసపిండాన్ని మంత్రపిండంగా చెయ్యి "*** అని ఆదేశించి .. ఈ లోకంనుంచి నిష్క్రమించారు.



***" శ్రీ సదానందయోగి "*** గారు ఎన్నో శతాబ్దాల క్రింద ***అరేబియా దేశం*** లో పుట్టారు. అరేబియా దేశంలోని ఒకానొక చిన్ని గ్రామంలో వారు ఆరు ఏళ్ళ కుర్రవాడిగా వున్నప్పుడు వారి దగ్గరికి ఒక మహాయోగి వచ్చి ***" నాతో పాటు వస్తావా?! "*** అన్నారు ..

క్షణం కూడా ఆలస్యం లేకుండా .. చిన్నారి ***" సదానంద "*** తల ఊపుతూ తన అంగీకారం తెలిపిన వెంటనే ఆ యోగి ***" కుర్ర సదానంద "*** కాళ్ళకు ఒక పాదలేపనం పూసారు. కళ్ళు మూసి తెరిచేంతలో ఇద్దరూ కలిసి భూటాన్ అడవులలో వున్నారు!!

ఆ అడవులలో ఆ యోగి ఎప్పుడూ ధ్యానం చేస్తూనే వుండేవారు!! సదానందకు ఆరు ఏళ్ళ వయస్సు నుంచి అతడికి పదహారేళ్ళ వయస్సు వచ్చేవరకూ ఆ యోగి ఏమీ మాట్లాడకుండా ఎప్పుడూ అలా ధ్యానం చేస్తూనే వుండేవారు. ఈ కుర్రవాడు, పది సంవత్సరాలపాటు ఆయనకు సపర్యలు చేస్తూనే వుండేవాడు.

పదేళ్ళపాటు ఎంతో వినయంతో తనకు సపర్యలు చేసిన శిష్యుడి గురుభక్తికి ముగ్ధుడయిన ఆ మహాయోగి .. ***" పదహారేళ్ళ సదానంద "*** ను తన చెంత కూర్చుండ బెట్టుకుని .. ***" ఇక నేను శరీరం వదిలిపెడ్తున్నాను "*** అని తమ నిర్ణయం తెలియజేసి వెంటనే దేహత్యాగం చేసారు.

***" ఇదేమిటయ్యా బాబు! ఇన్ని రోజులు సేవచేస్తే నాకు ఒక్కమాట కూడా చెప్పలేదు! పైగా మాటవిప్పిన ఈ రోజే ' నేను వెళ్ళిపోతాను ' అంటున్నారు! "*** అంటూ ఆ పదహారేళ్ళ సదానంద భోరున ఏడుస్తూ .. గురువు గారి సమాధి దగ్గరే కూర్చుని వుండిపోయాడు!

***కొన్ని రోజుల తర్వాత సమాధి నుంచి గురువుగారి గొంతువినబడి .. " ఇక నువ్వు ఉత్తరం వైపు వున్న హిమాలయాలకు వెళ్ళిపో .. ఇది నా ఆజ్ఞ! "*** అని చెప్పారు.

***" నేను వెళ్ళను గాక వెళ్ళను "*** అని ***సదానంద*** వలవలా ఏడ్వగా ***" నీవు వెళ్ళాలి గాక వెళ్ళాలి "*** అంటూ మళ్ళీ గురువు గారి ఆజ్ఞ సమాధి నుంచి వినవచ్చింది!

ఇక వెంటనే ***సదానంద*** గురువుగారి సమాధిని వదిలి హిమాలయాలకు వెళ్ళాడు. అక్కడ చక్కటి గుహలు, చక్కటి వనాలు, చక్కటి ఫలవృక్షాలు, ఎంతోమంది యోగులు, తాపసికులు, సిద్ధులు వున్నారు! వారితో కూడి ***సదానంద*** ఒకానొక గుహలో అనేకానేక సంవత్సరాలపాటు ధ్యానం చేసారు.

కొన్ని వందల సంవత్సరాల తరువాత అక్కడి వారంతా ***" నువ్వు ఇక్కడ నేర్చుకోవాల్సింది అంతా అయిపోయింది! భారతదేశం అంతా తిరుగుతూ నువ్వు నేర్చుకున్నదంతా సాధకులకు బోధించు "*** అన్నారట.

ఆ హిమాలయయోగుల వద్ద సెలవు తీసుకుని శ్రీ సదానంద యోగి గారు .. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు భారతదేశం అంతా తిరుగుతూ ఎందరెందరో మహారాజుల నుంచి సామాన్యుల వరకు తమ బోధనలను అందజేస్తూ .. ఆంధ్రరాష్ట్రంలోని పాపికొండలు, నెల్లూరు, నంద్యాల, రేగడిగూడూరు ద్వారా ***1975*** లో కర్నూలుకు వచ్చారు. అక్కడే .. ***1981*** లో .. వారిని PSSM వ్యవస్థాపకులు ***బ్రహ్మర్షి పితామహ పత్రీజీ*** ప్రప్రథమంగా కలవడం జరిగింది.

వందల సంవత్సరాలుగా తమ శిష్యుడికోసం వేచి చూస్తోన్న ఆ మహాగురువు వెంటనే తమలో నిక్షిప్తం చేసుకుని ఉన్న ఆధ్యాత్మిక శక్తులనన్నింటినీ రెండున్నర సంవత్సరాల పాటు పత్రీజీకి ధారపోశారు!

***" మాంస పిండాన్ని మంత్ర పిండంగా చెయ్యి "*** .. ***" Do or Die "*** అంటూ తమ శిష్యునికి మార్గ నిర్దేశనం చేసి .. ఇక తమ పని ముగిసిపోయిందని చెప్పి .. ఈ లోకం నుంచి నిష్క్రమించారు.

❈ ❈ ❈

2017లో కర్నూలు మరి తాడిపత్రి పిరమిడ్ మాస్టర్ల సహకారంతో నందవరంలో ఆ మహాగురువు గారి సమాధి ప్రాంగణంలో ***" సద్గురు శ్రీ సదానంద స్వామి "*** ఆశ్రమం నిర్మించడం జరిగింది. ప్రతి సంవత్సరం గురుపౌర్ణమి సందర్భంగా అశేష పిరమిడ్ కుటుంబం అందరూ కలిసి ***" శ్రీ సద్గురు సదానంద స్వామి "*** ఆశ్రమంలో ***బ్రహ్మర్షి పితామహ పత్రీజీ*** ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలను అత్యంత వైభవంగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా అఖండ పౌర్ణమి ధ్యానం మరి సాంస్కృతిక కార్యక్రమాలు అక్కడ నిర్వహించబడతాయి.

❈ ❈ ❈

***" పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ "*** కు ఆదిదేవులు అయిన ***" శ్రీ సదానంద యోగి "*** గారి దివ్య సాంగత్యం గురించి ***బ్రహ్మర్షి పితామహ పత్రీజీ*** గారి స్వంత మాటలలో ..

" ***1975లో*** నేను ఉద్యోగరీత్యా కర్నూలుకు వచ్చాను. సరిగ్గా అదే సంవత్సరంలోనే, స్వామిజీ కూడా కర్నూలుకు వచ్చారు. కానీ నేను మాత్రం 1981లోనే స్వామీజీని కలుసుకోవడం జరిగింది.

" ***శ్రీ సదానంద యోగి*** గారి పరిచయం నాకు నా స్నేహితులు ***శ్రీ రామచెన్నారెడ్డి*** గారి ద్వారా లభించింది! నేను కోరమాండల్ సంస్థలోనూ, శ్రీ రామచెన్నారెడ్డి ప్యారీ కంపెనీలోనూ వున్నా .. అందరం కలిసి పనిచేస్తూండే వాళ్ళం.

" నంద్యాల సమీపంలోని ఆత్మకూరు దగ్గరలోని ***' రేగడి గూడూరు '*** అనే గ్రామానికి దగ్గర వున్న ఒక పల్లెకు రామచెన్నారెడ్డి ఉద్యోగరీత్యా వెళ్ళినప్పుడు .. అక్కడ అప్పటికే 90 ఏళ్ళ వయస్సు వున్న శ్రీ సదానందయోగి గారి శిష్యుడు ***" శ్రీ యోగి రామిరెడ్డి "*** గారిని కలిసారట. వారి ద్వారా శ్రీ సదానందయోగి గారి వివరాలన్నీ తెలుసుకుని కర్నూలులో వారు వుండే అడ్రస్ తీసుకుని అందరం కలిసి వారి దగ్గరికి వెళ్ళాం!

***" శిష్యుడు ఎదురుగానే వుండొచ్చు .. గురువు ప్రక్కనే వుండచ్చు .. కానీ గురు శిష్యుల కలయిక జరగడం మాత్రం .. శిష్యుడు సంసిద్ధుడిగా వున్న తరువాతే జరుగుతుంది.*** ఆ రోజు నేను సంసిద్ధుడిగా వున్నాను కాబట్టే నాకు వారి దర్శనం లభించింది! వారి గంభీరమైన వదనం నేను తిలకించిన వెంటనే .. నాకు నేనుగా ఆ మహాస్వామికి సమర్పణ అయిపోయాను!

" వారు మమ్మల్ని ***' కూర్చోండి '*** అని చెప్పేసి ***' చేతులలో చేతులు పెట్టండి; కళ్ళు రెండూ మూసుకోండి; శ్వాస మీద ధ్యాస పెట్టండి '*** అన్నారు.

" ఇంతే మాకు వారు చెప్పింది! ఏ మంత్రమూ లేదు! ఏ తంత్రమూ లేదు!! ఏ యంత్రమూ లేదు!!!

" అయితే అప్పటికే నేను ధ్యానజ్ఞానిని! అయినా .. ఈ ***' శ్వాస మీద ధ్యాస '*** ధ్యాన విధానం అన్నది మొట్టమొదటిసారిగా ఈ జన్మలో మరొక యోగీశ్వరుడి నోటి నుంచి విన్నాను! అప్పటి నుంచి ***శ్రీ సదానంద యోగి*** గారి దగ్గర నా ఆధ్యాత్మిక శిష్యరికం మొదలయ్యింది!

" ఆ తర్వాత అనర్గళంగా శ్లోకం తర్వాత శ్లోకం అరబిక్ భాషలో, తెలుగులో, అప్పుడప్పుడూ ఇంగ్లీషు ముక్కలతో కలిపి అరగంట సేపు నయాగరా జలపాతంలా తన బ్రహ్మజ్ఞానాన్ని అంతా మా మీద వర్షించారు! అది విన్న నేను .. నా ఈ జీవితంలో మొట్టమొదటిసారిగా ***' పర–వశుడను '*** అయ్యాను!

" ఆ తరువాత ***' రేపు ఉదయం 4.30 గంటలకు రండి! ధ్యానం నేర్పిస్తా! '*** అన్నారు! "

(ఒకానొక జన్మలో వారు ***జీసస్ క్రైస్టు*** యొక్క గురువు గారైన ***" జాన్ ది బాప్టిస్ట్ "*** అని నేను తరువాతి క్రమంలో తెలుసుకున్నాను.)

❀ ❀ ❀

***కోరమాండల్ ఫర్టిలైజర్స్ కంపెనీలో రీజనల్ సేల్స్ ఆఫీసర్‌గా*** నా ఉద్యోగరీత్యా నేను మహబూబ్‌నగర్, కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు, నెల్లూరు .. ఇలా మొత్తం ఆరు జిల్లాలు తిరుగుతూండేవాడిని. నెలకు 25 రోజులు టూర్ లోనే ఉంటూ 5,6 రోజులు మాత్రం కర్నూలులో వుండేవాడిని.

అంతకు మునుపు కర్నూలులో వున్నన్ని రోజులు ***" అగ్రిఫ్రెండ్స్ క్లబ్ "*** కు వెళ్ళి పేకాడేవాడిని. ఇక సదానంద యోగిగారిని కలిసిన తరువాత నుంచి ఈ క్లబ్ బంద్!!! పేకాట బంద్!! అన్నీ బంద్!!! ఎంతో ఆర్తిగా వెళ్ళి వారి దగ్గర కూర్చునేవాళ్ళం .. ఎన్నెన్నో అద్భుతమైన విషయాలు తెలుసుకునేవాళ్ళం.

శ్రీ సదానంద యోగిగారు సిగరెట్ మీద సిగరెట్ కాలుస్తూండేవారు! మేము ఆయనకు ప్రతిరోజూ రెండు సిగరెట్ ప్యాకెట్స్ తీసుకుని వెళ్ళి ఇచ్చేవాళ్ళం! **' చాయ్ '** త్రాగుతూ .. సిగరెట్ పీలుస్తూ వారు ఎన్నెన్నో ఆధ్యాత్మిక జీవిత సత్యాలను మాకు అనర్గళంగా చెబుతూనే ఉండేవారు.

❀ ❀ ❀

వారిది సంపూర్ణ ***అచల సిద్ధాంతం! " శ్రీ శివరామ దీక్షితులు "*** అంటే వారికి ఎంతో మక్కువ! ఎప్పుడూ వారు దీక్షితులు గారి పద్యాలను విశేషంగా చెప్పేవారు. వారికి **అరబిక్ భాష** అనర్గళంగా వచ్చు! ఆ భాష వారి నోటి ద్వారా ఎంతో వినసొంపుగా వుండేది! వారి నోటి నుంచి వచ్చే **" సుభాష్ "** అన్న పిలుపు నాకు ఎంత మధురంగా వుండేదో చెప్పనలవి కాదు!!

స్వామివారు స్వయంగా చెప్పిన ఒక సందేశం :

***" అన్నములారగించిననూ, అంబర భూషణాదులు దాల్చిననూ, కన్యతోడి కూడిననూ, కన్న తనూజను ముద్దు చేసిననూ, సకల బంధునాప్తులను దాపుచేర్చి నటించిననూ, ఏ న్యూనమూ లేదు బ్రహ్మవేత్తలకిలన్! "***

మా ధ్యానజ్ఞానసాధనలు ఇలా జరుగుతూ వుండగా .. 1982వ సంవత్సరంలో హెడ్ ఆఫీసు నుంచి ***" నువ్వు సీనియర్ మోస్టువి; హెడ్‌ఆఫీసుకు రావాలి; కనుక నిన్ను హైదరాబాద్‌కు ట్రాన్స్‌ఫర్ చేస్తున్నాం "*** అని పిలుపు వచ్చింది.

***" నా గురువుగారు ఇక్కడ వుంటే నాకు హైదరాబాద్‌లో ఏం పని? నేను రాను! "*** అని వారికి ఖచ్చితంగా చెప్పాను.

హైదరాబాద్‌లో మా తల్లిగారు వున్నారు; తండ్రిగారు వున్నారు; సొంత ఇల్లు వుంది. నిజానికి అక్కడికి వెళ్తే నాకు ఎంతో సుఖంగా వుంటుంది .. మరి నెలకు రెండు వేల రూపాయలు కూడా మిగులుతాయి. కానీ వీటన్నింటినీ మించిన పెన్నిధి .. నా గురువుగారు ఇక్కడ వున్నారు కనుక ***" నేను కర్నూలు వదలను "*** అని నిశ్చయించుకుని ***" నాకు మీ ప్రమోషనూ వద్దు .. ఏమీ వద్దు! నేను కర్నూలులోనే వుంటాను ! "*** అని మా ఆఫీసువాళ్ళకు తేల్చిచెప్పాను.

***" సరే "*** అన్నారు మా ఆఫీసు వాళ్ళు.

❊ ❊ ❊

***1983 .. ఏప్రిల్ 16వ తేదీన*** నా గురువు ***శ్రీ సదానంద యోగి గారు*** నన్ను పిలిచి ***" సుభాష్! నేను శరీరం వదిలివేయాలని నిశ్చయించుకున్నాను; నువ్వు నా కోసం సమాధిని సిద్ధం చెయ్యి "*** అని ఆదేశం ఇచ్చారు.

***" సరే స్వామీ "*** అని చెప్పి .. కర్నూలు పట్టణం చుట్టూ స్థలం కోసం వెతికాను. ఎక్కడా నాకు సంతృప్తికరమైన స్థలం దొరకలేదు! చివరికి ***" చెన్నారెడ్డి "*** అనే ఆయన భక్తుడు ఒకరు .. ***" బనగానపల్లి దగ్గర వున్న ' నందవరం ' గ్రామంలో వున్న నా పొలంలో గురువుగారికి సమాధి ఏర్పాటుచేస్తే బాగుంటుంది "*** అన్నాడు.

వెంటనే చెన్నారెడ్డి, నేను కలిసి ***నందవరం*** వెళ్ళాం! అక్కడ నాకు బాగా అనిపించిన .. ఒక స్థలాన్ని ఎంపిక చేసి .. ఆ స్థలాన్ని అంతా త్రవ్వి చదునుచేసి .. గురువు గారి ఆజ్ఞమేరకు సమాధిని సిద్ధం చేసాం.

***స్వామీజీ*** తాము చెప్పిన సమయం ప్రకారం తమ శరీరాన్ని వదిలిపెట్టేస్తే .. మరి పోలీసులతో ఏం ఇబ్బంది వస్తుందో అని నేను నా సంగీత గురువు మరి గొప్ప డాక్టర్ అయిన ***డా॥ శ్రీపాద పినాకపాణి*** గారిని కలిసి .. ***" శ్రీ సదానందయోగిగారు తమ శరీరాన్ని వదలి పెట్టేస్తున్నారు; మీరు వచ్చి ఆయనను పరీక్షించి వారి ఆఖరి శ్వాస చూసి ' ఇక శ్వాస లేదు ' అని రికార్డు చేయాలి "*** అని కోరాను.

డాక్టర్ శ్రీపాద వారు వచ్చి అలాగే రికార్డు చేయగా నిబంధనల ప్రకారం అంతా సజావుగా జరిగిపోయింది.

తర్వాత శ్రీ సదానంద యోగిగారి పార్థివ శరీరాన్ని ***నందవరం*** తీసుకెళ్ళి అక్కడ మేము సిద్ధం చేసి వుంచిన సమాధిలో పెట్టి .. పై నుంచి ఒక రాయిని కప్పాం! ఇలా ***1983 మే 22వ తేదీన*** వారు తమ తనువును చాలించారు.

వారు తమ సమాధిని **నందవరం** లో ఏర్పాటు చేయమని మాకు సూచించిన తరువాత తమ తనువును చాలించడానికి ముందు మధ్యలో రెండు మూడు సార్లు సశరీరంగా ఆ గ్రామంలో ఒక రైతుకు దర్శనం ఇచ్చారట! పోల్చి చూసుకుంటే సరిగ్గా ఆ రైతు చెప్పిన సమయాలలో వారు కర్నూలులోని **" రాఘవేంద్ర లాడ్జి "** లోనే మాలో ఎవరో ఒకరి సమక్షంలోనే వున్నారు. అంత గొప్ప సిద్ధ పురుషులు వారు!

పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ కు ఆదిదేవులు ***శ్రీ సదానంద యోగి గారు!*** సుమారు రెండున్నర సంవత్సరాల పాటు వారి సేవాభాగ్యం చేసుకున్న నేను నిజంగా ధన్యుడనే!



# " సనారీ విశ్వనాథావధూత " (1856-1914)

సాక్షాత్తు కాశీ విశ్వేశ్వరుని ప్రతిరూపంగా ఈ భూమి మీద అవతరించిన ***" సనారీ విశ్వనాథావధూత "*** గారు లౌకిక వాసనా లంపటులకు జ్ఞాన యోగ వైరాగ్య మార్గాలను బోధిస్తూ వారి ఆత్మోన్నతికి ఎంతగానో కృషి చేశారు. ఇప్పటికీ నమ్మిన భక్తులకు సజీవ దర్శనాన్ని అందిస్తోన్న సిద్ధపురుషులు విశ్వనాథావధూత గారి చరిత్ర మొత్తం అడుగడుగునా అద్భుతాల పుట్ట. వీరు అందించిన **" కాలజ్ఞానం "** అనే గ్రంథం ఈనాటికీ భక్తకోటికి దివ్య మార్గదర్శనం చేస్తోంది.



శ్రీకాకుళం జిల్లా నాగావళి నదీతీరాన ***" పాలకొండ "*** గ్రామంలో ***సింహాద్రి వీరాచారి, గౌరీదేవి*** అనే సాత్త్విక సంపన్నులూ మరి భక్తులూ అయిన విశ్వబ్రాహ్మణ దంపతులు ఉండేవారు. వారు సంతానార్థులై యావద్భారతంలోని పుణ్యక్షేత్రాలు దర్శించి ఆ యా దేవతలను కొలిచి కందిమల్లాయపల్లెలోని పోతులూరి వారి సమాధిని సేవించి శ్రీశైలంలో భ్రమరాంబా మల్లికార్జునులను అర్చించారు. తత్ఫలితంగా ఆ సంవత్సరం కార్తీక శుద్ధ పంచమి సోమవారం నాడు వారికి మగశిశువు జన్మించాడు. ఆ శిశువే ***" సనారీ విశ్వనాథావధూత "***.

సాక్షాత్తూ కాశీవిశ్వేశ్వరుడే విశ్వనాథావదూతయై జన్మిస్తాడని .. అంతకు రెండు వందల సంవత్సరాల ముందే ***శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి*** తమ కాలజ్ఞానంలోని గోవిందవాక్యాలలో ప్రస్తావించిన ఈ అవధూత చరిత్ర మొత్తం .. అడుగడుగునా అద్భుతాల పుట్ట. వారు జన్మించిన శుభముహూర్తాన దేవాలయంలో గంటలు తామై మ్రోగాయి.

❀ ❀ ❀

చిన్న వయస్సులోనే ఏకసంథాగ్రాహియై వేదశాస్త్రాలు, కావ్యేతిహాసాలు ఔపోశనం పట్టిన విశ్వనాథంగారు అనువంశికంగా వస్తూన్న రసవిద్యలో కూడా ఆరితేరారు. 12 వ యేట తల్లి, 16 వ యేట తండ్రి చనిపోవడంతో తమ అన్న నీలయ్యాచారి గారి సంరక్షణలోకి వచ్చారు. విశ్వనాథయ్య 20 యేండ్ల వాడైన తరువాత అతని అన్న .. తమ్మునికి పెండ్లి చేయ నిశ్చయించినప్పుడు విశ్వనాథయ్య .. ***" నాకు ఉద్దేశింపబడిన అమ్మాయి వేరొక చోట పెరుగుతున్నది కనుక కన్యాన్వేషణకై మీరు పోవద్దు "*** అని చెప్పి .. ఒకానొక శుభ ముహూర్తాన నాగావళీ తీరస్థ పుణ్యక్షేత్రాలు దర్శించటానికి బయలుదేరారు.

పాలకొండకు సమీపంలోని **" ఉత్తరావల్లి "** అనే గ్రామంలో **దైవజ్ఞాచారి, జ్ఞానప్రసూనాంబ** దంపతులకు అన్నపూర్ణా పరమేశ్వరి వరప్రసాదంగా పుట్టిన బిడ్డ **అన్నపూర్ణ** పెరుగుతున్నది. తరుణ శిశునివలె ఆ గ్రామ వీథిలో తారసిల్లిన విశ్వనాథయ్యను దైవజ్ఞాచారి తన ఇంటికి తీసుకుపోయి అతిథ్యమిచ్చాడు. అన్నపూర్ణ విశ్వనాథయ్యను కాశీవిశ్వేశ్వరుని అవతారంగా గుర్తించి ***" అతడే నా భర్త "*** అని తల్లిదండ్రులకు చెప్పింది.

వారికి శ్రీముఖ సంవత్సరం (1873) వైశాఖ శుద్ధ ఏకాదశి శుక్రవారం ఉత్తరా నక్షత్రయుక్త కర్కాటక లగ్నంలో పెళ్ళి జరిగింది. అత్తవారింట అన్నపూర్ణ భర్తను పరమశివునిగా ఆరాధిస్తూ సంసారం దిద్దుతున్నది.

విశ్వనాథయ్య తన భార్య అన్నపూర్ణకు అజపాగాయత్రి బోధించి తాను రాజయోగిగా గృహస్థాశ్రమం పాలించాడు. ఇలా ఉండగా ఆ గ్రామంలోని ఒకానొక రైతు కొడుకు పొలం దున్ని ఇంటికి వస్తూండగా పాము కరచి చనిపోయాడు. రైతు దంపతులు పుత్రుని శవంతో సహా విశ్వనాథయ్య ఇంటికి వచ్చి .. ఏడ్చి ప్రాణభిక్షకై యాచించారు. స్వామి ముద్రయోగంలో ఆ పామును చూచి ***" రా "*** అని ఆజ్ఞాపించారు. పాము వచ్చి కరచిన తావున తాకి వెళ్ళిపోయింది. మృతుడు లేచి కూర్చున్నాడు. తల్లిదండ్రులు మరి గ్రామప్రజలు .. ***" విశ్వనాథయ్య సాక్షాత్తు కాశీవిశ్వేశ్వరుడే "*** అని జేజేలు పలికారు.

❀ ❀ ❀

ఒకానొకనాడు ఉదయం విశ్వనాథయ్య గ్రామం వెలుపల ఉన్న చెఱువుకు స్నానానికి వెళ్ళాడు. వేరొక ప్రక్కన వీరయ్య అనే వైశ్యుడు, సోములు అనే రజకుడు కూడా స్నానం చేస్తున్నారు. విశ్వనాథయ్య తమ అంగవస్త్రం చెఱువు నీటిపై పరచి దానిపైన పద్మాసనస్థుడయ్యాడు. ఆ వస్త్రం తెప్పవలె చెఱువు మధ్యకు తనంతతానే తరలిపోయింది. విశ్వనాథయ్య నడి చెఱువులో మునిగి చాలా సేపుండి పైకి లేచి నీళ్ళపై నిలుచుండి సూర్యభగవానునికి పుష్పాంజలి సమర్పించి నీళ్ళపై నడుచుకుంటూ చెఱువు గట్టుకు వచ్చాడు.

అంతసేపు ఈ అద్భుతదృశ్యం చూస్తూన్న వీరయ్య, సోములు పరుగెత్తి వచ్చి విశ్వనాథయ్య కాళ్ళపైన పడ్డారు. ఇంతకాలం పిచ్చివాడనీ, కట్టుబోతు విద్యలవాడనీ అనుకున్న విశ్వనాథయ్యను సాక్షాత్తు పరమేశ్వరుడే అని పొగిడి .. ప్రదక్షిణం చేసి తమను శిష్యులుగా స్వీకరించవలసిందని ప్రార్థించారు.

వీరయ్య, సోములు తమ గురువు విశ్వనాథయ్య కారణజన్ములనీ .. అఘటనా ఘటన సమర్థులనీ .. ఆయన బోధలు సుజ్ఞానపథములనీ .. ప్రచారం చేయటంతో కొందరు పండితులకు అసూయా రోగం పుట్టింది. వాళ్ళు స్వామిని పరీక్షించటానికి ఒక ఉపాయం పన్నారు. ఒక బాలకుణ్ణి

చచ్చిపోయినట్లు నటించమని చెప్పి వాని పాడెను విశ్వనాథయ్య ఇంటి ముందు నుంచి మోసుకుపోతూ ఆ చనిపోయిన పిల్లవాణ్ణి బ్రతికిస్తే .. విశ్వనాథయ్య కారణజన్ములనీ .. భగవదవతారమనీ ఒప్పుకుంటామన్నారు. విశ్వనాథయ్య ***" నేను కూడా మీ వలె సాధారణ మానవుణ్ణే! నా వల్ల ఆ పనికాదు పొండి "*** అన్నారు.

వాళ్ళు కొంతదూరం పోయి పాడె దించి ఆ పిల్లవాణ్ణి లేపితే వాడు లేవలేదు. వాడు నిజంగానే చచ్చిపోయాడు! స్వామిని పరీక్షింపదలచిన పండితులు తాము తవ్విన గోతిలో తామే పడ్డారు. దాంతో పిల్లవాని తల్లిదండ్రులు వచ్చి ఏడిస్తే .. స్వామి కమండలోదకం మంత్రించి చల్లారు. నిద్రలోంచి మేల్కొన్నట్లు ఆ బాలుడు లేచాడు.

పాలకొండలోని అధికసంఖ్యాకులు లౌకికవాసనాలంపటులు. విశ్వనాథయ్య బోధించే భక్తి జ్ఞాన యోగ వైరాగ్య మార్గాలు వారికి నచ్చలేదు. స్వామికేమో వారి పై జాలి. స్వామి వీరయ్యకూ, సోములుకూ వేదాంతబోధ చేసేవారు. అన్నపూర్ణమ్మ కూడా వాళ్ళతో పాటూ గోష్ఠిలో పాల్గొంటూ యోగ నిష్ఠా గరిష్ఠ అయింది. కొన్నిదినాలకు ఆమె యోగనిష్ఠలోనే కపాల భేదనం చేసుకుని శరీరం చాలించింది.

❀ ❀ ❀

విశ్వనాథావధూత దేశ సంచారం చేస్తూండగా వారి దివ్యజ్ఞానం మరి మహిమలు విన్న ఆ యా గ్రామాల వాళ్ళు వారిని దర్శించి, సేవించి తమ తమ బాధలూ, కోరికలూ, కష్టాలూ, నష్టాలూ చెప్పుకుని పరిష్కారం పొందే వారు. స్వామి బొబ్బిలి, సాలూరు, మందసా, బారువా, శ్రీకూర్మం, శ్రీకాకుళం, అరసవిల్లి మొదలైన గ్రామాలు చుట్టి విజయనగరం చేరి కంటోన్మెంటులో ఒక పర్ణశాల నిర్మించుకుని అందులో నివసించారు.

అక్కడ స్వామివారు నవవిధ భక్తిమార్గాలు మరి అర్చనా విధానాలు ప్రవచనం చేస్తూండేవారు. వారి బోధలు విన్న సైనికులు, సైనికాధికారులు చాలా మంది స్వామి భక్తులైనారు. ఆ విషయం తెలిసి విజయనగరం పాలకులు ఆనంద గజపతి మహారాజు (1850-1897) ఒకనాడు వచ్చి స్వామివారి దివ్యోపన్యాసం విని ఆనందించి వారిని తమ ఆస్థాన ఆచార్యులుగా నియుక్తి చేసి గౌరవించారు.

ఆ కాలంలోనే గోదావరీ పుష్కరాలు వచ్చాయి. ఆనంద గజపతి మహారాజు రాజమహేంద్రవరం వచ్చి స్వామివారు చెప్పగా పుష్కరస్నానఫలం విని, స్వామివారు చూపించిన పుష్కరజలాలను దర్శించారు. స్వామివారు ఆ పుష్కర జలధారను తమ కమండలంలోకి తీసుకుని రాజుగారి పై చల్లి పవిత్రుణ్ణి చేసారు.

రాజమహేంద్రవరం తహసీల్దారు దురహంకారి. అతడు స్వామివారిని కొట్టటానికి చెయ్యెత్తితే అతణ్ణి పన్నెండు గంటలు అట్లాగే స్తంభింపజేసి ఆయన గర్వం అణిచారు.

అక్కడి స్వర్ణకారులంతా వచ్చి తమకు స్వర్ణయోగం నేర్పించవలసిందిగా ప్రార్థిస్తే నవవిధ పాషాణాలు తెప్పించి పప్పు బెల్లం వలె తిని జీర్ణించుకుని రాగిరేకుపై మంత్రించి దానిని బంగారు రేకుగా మార్చారు. నవపాషాణాలు జీర్ణించుకునే శక్తి గలవారికే స్వర్ణయోగం అబ్బుతుందని చెప్పారు. గౌరిపల్లి గ్రామవాసి చిలకలపూడి రాజలింగాచారికి ***" విశ్వబ్రాహ్మణ గోత్రాధ్యాయ " మనే*** గ్రంథం అనుగ్రహించారు. ***" సనారీ విశ్వేశ్వర సంవాదం "*** గ్రంథరచన పూర్తి చేసి 12 ఏళ్ళ తరువాత రాజమహేంద్రవరం విడిచి ఆ గ్రంథ ముద్రణ కోసం చెన్నపట్నం బయలుదేరారు.

❋ ❋ ❋

అవధూతస్వామి బెజవాడలో 15 రోజులు ఉండి కనకదుర్గను కొలిచారు. అప్పుడొక అనాథ విశ్వబ్రాహ్మణ స్త్రీ స్వామికి వంట చేసి పెట్టేది. బెజవాడ విడిచిపోయే ముందు స్వామి ఆమె దైన్యానికి జాలిపడి తమకు వండిపెట్టిన పొయ్యి క్రింద త్రవ్వమన్నారు. అక్కడ ఆమెకు ఒక కంచు చెంబునిండా వరహాలు లభించాయి. వాటితో ఆమె జీవితం అంతా సుఖంగా గడిచింది.


శృంగేరీ భక్తులు స్వామిని .. ఫాలాక్షం చూపమంటే .. సముద్ర తీరాన గడ్డికుప్పలు వేయించి తమ మూడవకన్ను తెరచారు. ఆ గడ్డికుప్పలు స్వామి మూడవకంటి మంటలకు భస్మమైపోయాయి. అప్పుడు జగద్గురువులు, వారి అనుయాయులు విశ్వనాథావధూత స్వామివారి గొప్పతనం అంగీకరించారు. భక్తుల కోరిక మేరకు స్వామి గురువుల లక్షణాలు వివరించారు. పోతులూరి వీరబ్రహ్మం గారి కాలజ్ఞానాలతో పాటు, తాము రచించిన కాలజ్ఞానాలు వినిపించారు. చెన్నపట్నం భక్తులందరూ స్వామిని ఘనంగా పూజించారు.

స్వామి చెన్నపట్టణం నుంచి బయలుదేరి త్రోవలో బ్రహ్మంగారి మఠం దర్శించి, తమ దండకమండలాలు అక్కడ విడిచారు. అక్కడి నుంచి బయలుదేరి శ్రీశైలం చేరి ఆనంద సంవత్సర కార్తీక శుద్ధపంచమి శుక్రవారం 23-10-1914 నాడు ***బదరికావనం*** గుహలో అంతర్హితులైనారు. వారు ఇప్పటికీ అక్కడ సజీవంగా ఉన్నారట! తమను నమ్మి కొలిచే భక్తులకు అప్పుడప్పుడు శుక్రవారం నాడు దర్శనం ఇస్తుంటారట!

PYRAMID SPIRITUAL SOCIETIES MOVEMENT
ENERGY WISDOM CONSCIOUSNESS
INDIA
BE A LIGHT UNTO YOURSELF

# " శ్రీ నారాయణ గురు "

అద్వైత వేదాంత ప్రవక్త శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్యుల వారు జన్మించిన కేరళ రాష్ట్రంలోనే జన్మించిన ***" శ్రీ నారాయణ గురు "*** గారు ఆదిశంకరాచార్యుల వారి అద్వైతానికి అధునాతన భాష్యం చెప్పారు. జనహితం కోసం, మరి సమాజ శ్రేయస్సు కోసం కుల భేదాలను నిర్మూలించడానికి వీరు వర్ణాశ్రమ ధర్మంపై మహాయుద్ధమే చేసారు! కొన్ని వేల సంవత్సరాలుగా గిరి శిఖరాలపైనే ఉన్న అద్వైతాన్ని .. జన పథాలకు మళ్ళించారు.



***" శ్రీ నారాయణ గురు "*** 1855 ఆగస్టు 28వ తేదీన తిరువనంతపురం సమీపంలోని ***" చెంపళంతి "*** గ్రామంలో జన్మించారు; వీరి తల్లిదండ్రులు **" కుట్టియమ్మ ", " మదనాశన్ "** .. గొప్ప సంపన్నులు. **నారాయణ** పుట్టినప్పుడే ఒక విడ్డూరం జరిగింది. శిశువు జన్మించగానే ఏడవడం సహజం. అలాగే శిశువు ఏడ్చిన సమయం బట్టే సాధారణంగా ఆ శిశువు యొక్క జాతకచక్రం వేస్తారు.

అయితే **నారాయణ** పుట్టినప్పుడే కాదు.. జీవితంలో కూడా ఎప్పుడూ ఏడ్చింది కానీ, విచారించింది కానీ మరి కంటతడి పెట్టింది కానీ లేదు. స్నానం చేయిస్తూన్నా, ఆకలైనా, నిద్రరాకపోయినా ఆ బాలుడు ఎప్పుడూ ఏడ్చేవాడు కాదు! ఆ ఇంట అంతకు ముందు అయిదుగురు మహాత్ములు జన్మించారు కాబట్టే .. జన్మతః **నారాయణ** లో ఆ యోగ సంస్కారం వచ్చి వుంటుంది.

❊ ❊ ❊

***" నారాయణ "*** ఏకసంథాగ్రహి. ఏదైనా సరే .. ఒక్కసారి చదివినా, విన్నా మరచిపోడు. చిన్న వయస్సులోనే మలయాళం, తమిళం, సంస్కృతం భాషలు నేర్చాడు. ***" మనుష్యులంతా ఒక్కటే; హెచ్చుతగ్గులు లేవు, పెద్దకులం, చిన్నకులం అనడం అన్యాయం "*** అనే భావం అతని మనస్సులో చిన్న నాటనే ముద్రపడిపోయింది. అలాగే .. దేవుడు కంటికి కనిపించకపోయినా.. ***" దేవుడు ఒక్కడే "*** అన్న నమ్మకంతో వుండేవాడు. ఒకసారి ఎవరో బంధువు చనిపోగా, అందరూ గగ్గోలుగా ఏడుస్తూంటే, తాను మాత్రం దూరంగా ఒక చెట్టుక్రింద కూర్చుని, ***" మరణం అంటే ఏమిటి? మనిషికి ఏది శాశ్వతం? "*** అని ఆలోచించాడు.

❊ ❊ ❊

**నారాయణ** ను వాళ్ళ అమ్మ **" నామా "** అంటూ ముద్దుగా పిలుచుకునేది. ఉదయమే స్నానం చేసి, భక్తిగా గుడికి వెళ్ళే అతనికి **" భక్తనామా "** అని పేరు వచ్చింది. ఎక్కువగా ఒంటరిగా వుండడం ఇష్టపడుతూ .. ఒంటరిగానే తిరిగేవాడు **" నామా "**! ఉదయం వెళ్ళి రాత్రి ఎప్పటికో ఇల్లు చేరేవాడు. 18వ ఏట ఒకసారి అలా వెళ్ళినవాడు .. పద్దెనిమిది రోజుల తర్వాత ఇంటికి తిరిగి వచ్చాడు. ఒంటినిండా దద్దుర్లు మరి నీరసంతో చిక్కిపోయాడు.

అన్ని రోజులూ ఒక పాడుబడిన దేవాలయంలో గడిపాడు! దాంతో అతడికి మశూచి సోకింది. వివరాలు అడిగితే ***" అంతా ఆ గుడిలోని దేవుడే చూసుకున్నాడు "*** అని సమాధానం చెప్పారు. ఆ తర్వాత అతనిలో కృష్ణభక్తి పెరిగి .. ఎక్కడ ఎవరిని చూసినా వారిలో కృష్ణరూపమే అతనికి కనిపిస్తూండేది!

ఆ పరిస్థితిలో అతనికి పెళ్ళి చేయాలని ఇంట్లో వాళ్ళంతా ప్రయత్నించి కేరళ సంప్రదాయం ప్రకారం .. **" కాళీ అమ్మ "** అనే అమ్మాయిని ఎంపిక చేసి పెళ్ళికి సిద్ధం చేశారు. ఆ విషయం తెలిసిన **నారాయణ** ఇంట్లోంచి పారిపోయి దేశం అంతా తిరిగాడు.

అప్పుడే అతడు క్రైస్తవ, ఇస్లాం, శైవ సిద్ధాంతాలను విస్తారంగా అధ్యయనం చేసాడు. బెస్తవారి ఇళ్ళలో తలదాచుకునేవాడు. ఈ క్రమంలో **" కుంజన్ పిళ్ళై "** అనే వ్యక్తి అతనికి తోడై .. అతనితో కలిసి **" తాయ్‌కట్టుఅయ్యన్ "** అనే యోగి దగ్గర .. యోగ విద్య కూడా నేర్చుకున్నాడు. అప్పుడే శివాద్వైతం పట్ల అతనికి అభిరుచి ఏర్పడింది. ప్రత్యేకంగా శివుడిని మరి సుబ్రహ్మణ్యస్వామిని ఆరాధించసాగిన **నారాయణ** ఆ దైవాలను అనేకసార్లు దర్శించాడు.

ఇలా పాతిక సంవత్సరాల వయస్సులో సన్యసించిన నారాయణ .. కన్యాకుమారి సమీపంలోని ***" మరుత్తమలై "*** అడవుల్లో తపస్సు చేసి తన ముప్పయ్యవ ఏట జ్ఞానం పొంది, ***" నారాయణ గురు "*** గా తిరిగి **" అరువిప్పురం "** చేరుకున్నాడు.

❊ ❊ ❊

ప్రతి మనిషికీ రెండు ముఖాలుంటాయి .. అవి ఒకటి భౌతికం, రెండవది ఆధ్యాత్మికం. భౌతికంగా పూజలూ, ఆరాధనలూ చేస్తున్నా .. ***" అంతర్యామి ఆరాధన చాలా ముఖ్యం "*** అని గ్రహించారు నారాయణ. ప్రతి మతంలోనూ బాహ్యారాధనలు వుంటాయి కానీ మరి ప్రతి మతం యొక్క పరమగమ్యం ఆధ్యాత్మికమే. ఆనాడు కేరళలో దళితులను హీనంగా చూసేవారు .. మరి వారికి దేవాలయ ప్రవేశం కూడా ఉండేది కాదు. అయితే ***నారాయణ గురు*** ఇలాంటి అంటరానివారి కోసం ప్రత్యేక దేవాలయాలు నిర్మించాలనుకున్నారు.

అంతవరకు దళితులు ***" ఛానత్ "***, ***" కాళీ "*** అనే దేవతల పూజలు మాత్రమే చేసేవారు. వారికి మిగతా దేవుళ్ళను ఆరాధించే అవకాశం లేదు. అ లోపాన్ని సవరించాలని **" అరువిప్పురం "** లో దళితుల కోసం ఒక దేవాలయం కట్టించారు ***"నారాయణ గురు "***. అయితే ఆచారం ప్రకారం

విగ్రహ ప్రతిష్ఠాపన బ్రహ్మణులే చేయాలి కానీ .. దళిత దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ కనుక ఎవ్వరూ అంగీకరించలేదు.

దాంతో **నారాయణ** .. తానే నదీ ప్రవాహంలోకి దూకి, ఒక బండరాయిని తన గుండెలకు హత్తుకుని .. మూడుగంటలపాటు ధ్యానం చేసి, దానిని తెచ్చి దేవాలయంలో ప్రతిష్టించారు. ఒక ముహూర్తం అనీ, మంచి రోజు అనీ, మంత్రం అనీ లేకుండా .. తన మనస్సుకు తోచినట్లు చేస్తూ .. అగ్రవర్ణాల వారొచ్చి అభ్యంతరం చెప్పగా ***" మా దేవుడు దళిత దేవుడు; మీ దేవుడు మైలపడలేదుగా "*** అంటూ వ్యంగ్యంగా వారికి వాతపెట్టి మరీ పంపేవారు.

❋ ❋ ❋

మహత్తులు చూపిన వారినే జనం మహాత్ములుగా గుర్తిస్తారు కానీ ఆధ్యాత్మిక శక్తి ఎంత ఉన్నా సామాన్యులు పట్టించుకోరు .. అది సహజం. అయితే ***" శక్తుల్ని ప్రదర్శించడం అనవసరం .. జ్ఞానం ఏదయినా జనంలోకి ప్రవేశించాలి మరి వారిని చైతన్యపరచాలి; అతీంద్రియ శక్తులూ, సిద్ధులూ పొందడానికి తపస్సు అవసరం లేదు .. ఎందుకంటే అవి సహజంగానే యోగికి లభిస్తూంటాయి "*** అంటారు **నారాయణ**.

***నారాయణ గురు*** ఆరు సంవత్సరాల వయస్సులో వున్నప్పుడు ఒకసారి .. వాళ్ళ గ్రామంలో నీటి కరువు ఏర్పడింది. బావులు, చెరువులు వట్టిపోయాయి. ఎక్కడా నీటి చుక్క లభించలేదు. చెట్లు ఎండిపోయాయి, మరి పక్షులు చచ్చిపోసాగాయి. బ్రాహ్మణులు ఎన్ని పూజలు చేసినా, యాగాలు చేసినా .. వరుణదేవుడు కరుణించలేదు.

అది గమనిస్తున్న ***" నామా "*** తల్లితో ***" నేను మనక్కళ్ ఆలయంలో జపం చేస్తాను; వర్షం వస్తుంది "*** అని చెప్పి తల్లి అనుమతి తీసుకుని గుడి లోపలికి వెళ్ళి తలుపులు బిగించి, లోపల కూర్చుని ***" నామ జపం "*** చేయసాగాడు. గంటలో కుండపోత వర్షం కురిసింది! అయినా అది **నారాయణ** పూజా మహిమ అని పెద్దలు నమ్మలేదు. ***" ఆరేళ్ళ కుర్రవాడు జపం చేస్తే వర్షం వస్తుందా ? మా వంటి పండితులు చేస్తేనే రాలేదు గదా "*** అంటూ అహంకారంతో చిన్నపిల్లవాడి యోగశక్తిని వాళ్ళు నమ్మలేదు.

దాంతో వాళ్ళు **నారాయణ** కు ఒక పరీక్ష పెట్టారు. ఆ ఊరిలో ఒక కొబ్బరి చెట్టు ఉంది. అది పెరిగింది కానీ కాయలు కాయడం లేదు. ***" దానికి కాయలు కాయిస్తే నీ శక్తిని నమ్ముతాము "*** అని సవాలు చేశారు. ***" నామా "*** వెళ్ళి ఆ చెట్టును తన రెండు చేతులతో ఆలింగనం చేసుకున్నాడు. ఇక ఆ సంవత్సరం ఆ చెట్టు విరగకాసింది .. మరి దాంతో ఊరి జనానికి నారాయణ మహత్తు నమ్మక తప్పలేదు.

❋ ❋ ❋

**నారాయణ** దేశాటన ముగించి వచ్చేసరికి.. ఆయనకు 35 ఏళ్ళు నిండాయి. ఆయన **" అరువిప్పురం "** లో ఆశ్రమం ఏర్పరుచుకున్నాడు. అప్పుడు మళ్ళీ గ్రామానికి గొప్ప నీటి ఎద్దడి ఏర్పడింది. గ్రామస్థులంతా వచ్చి మళ్ళీ వర్షం వచ్చేట్లు చేసి ఊరిని కాపాడమని **నారాయణ** ను అర్థించారు. ***" నేను రమ్మంటే వర్షం వస్తుందా? మీ పిచ్చిగానీ! "*** అంటూ ఉపేక్ష వహించారు నారాయణ. అయితే అందరూ బలవంతం చేయడంలో ***" నాపైన పూర్తి విశ్వాసం వుందా? "*** అంటూ గట్టిగా అడిగారు.

***" ఉంది "*** అని అందరూ చెప్పిన తర్వాత .. అర్థనారీశ్వరస్తవం శ్లోకాలు వ్రాసి అందరిచేత ముక్త కంఠంతో పారాయణ చేయించారు. పారాయణ జరుగుతూండగానే .. ఆకాశం మేఘావృతమై .. కుంభవృష్టి కురిసింది. ఆ వర్షానికి .. వాళ్ళ ఊరి ప్రక్కనే వున్న ***" నెయ్యార్ నది "*** పొంగి ప్రవహించింది.

❋ ❋ ❋

ఒకసారి తిరువాన్కూరు రాజోద్యోగి తన అయిదేళ్ళ పాపను ఆశ్రమానికి తీసుకు వచ్చాడు. ఆ పాపకు కళ్ళు కనిపించవు.. చూపు అనుగ్రహించమని గురుదేవుని అర్థించాడు! ***నారాయణ గురుదేవులు*** ఆ పాప తలపైన ఇంత నూనెపోసి మర్దన చేసి నెయ్యార్‌నదిలో స్నానం చేయించి తీసుకురమ్మని ఆదేశించారు. తిరిగిరాగానే గురుదేవులు పాప తలనిమిరి, కనురెప్పలు స్పృశించి, కళ్ళు తెరవమన్నారు. అంతే! పాపకు చూపు వచ్చింది! ఆ సంఘటనతో గురుదేవుని పేరు తమిళ ప్రాంతంలో మార్మోగి పోయింది.

మరొకమారు ఒక అంధురాలైన వృద్ధమహిళ.. ***" అరువిప్పురం ఆశ్రమానికి "*** వచ్చి తమ ఆశ్రమంలో భజన కార్యక్రమం చేయాలని కోరింది. అప్పుడు ***నారాయణ గురుదేవులు " అలువ "*** లోని అద్వైతాశ్రమంలో ఉండి ఆ కార్యక్రమాన్ని నిర్వహించమని తమ శిష్యుడైన భైరవస్వామిని **అరువిప్పురం** పంపారు. భజన మధ్యలో ఆ వృద్ధ మహిళ పరవశంతో లేచి నృత్యం చేయసాగింది. మరి నృత్యం చేస్తూండగా ఆమెకు చూపు వచ్చింది. ఎవరో ఒకస్వామి వచ్చి తనకు చూపు అనుగ్రహించారని చెప్పింది. భైరవస్వామి.. అక్కడ వున్న స్వాముల ఫోటోలు చూపిస్తే ***నారాయణ గురు*** ఫోటో చూసి ***" ఆయనే నాకు దర్శనం ఇచ్చి చూపు ప్రసాదించింది "*** అని చెప్పింది.

అది జరిగిన సమయంలో గురుదేవులు ***" అలువ ఆశ్రమం "*** లో చైతన్య స్వామి వారితో సంభాషిస్తూ ఆకస్మాత్తుగా కళ్ళు మూసుకుని కొద్దిసేపు సమాధిలోకి వెళ్ళారు. తర్వాత ***" ఎవరో వృద్ధ మహిళ నన్ను స్మరించింది .. అందుకే నేను వెళ్ళి ఆమెకు సహాయం చేసి వచ్చాను "*** అని చైతన్యస్వామితో చెప్పారు. ఆమే అరువిప్పురంలోని అంధురాలని తర్వాత నిర్ధారణ అయ్యింది.

❋ ❋ ❋

తిరువనంతపురం జిల్లా **" అన్చుతెంగు "** లో జ్ఞానేశ్వరం ఆలయం ఏర్పాటు చేసి అందులో శివుని విగ్రహం ప్రతిష్టించారు ***నారాయణ గురుదేవులు***. ***" దేవాలయం సముద్రం దగ్గరగా వుండడం వల్ల అభిషేకానికి మంచినీరు దొరకటం లేదు "*** అంటూ భక్తులు వాపోవడంతో ***నారాయణ గురు*** .. గుడి ఆవరణలో ఒకచోట గిరిగీసి .. అక్కడ బావి తవ్వమన్నారు. అమృతం లాంటి మంచినీరు  ఆ బావిలో పడటంతో భక్తులంతా ఎంతో సంతోషించారు. ఇప్పటికీ ఆ మంచినీటి బావి అక్కడ ఉంది.

1918 లో ***గురుదేవులు*** శ్రీలంక పర్యటించారు. శ్రీలంకలో బౌద్ధుల ప్రాబల్యం ఎక్కువ. ***" నారాయణ గురు బోధలు, సేవలు అన్నీ కూడా గౌతమ బుద్ధుని బోధల వంటివే "*** అని గుర్తించిన బౌద్ధులు .. ఆయనకు ఘనస్వాగతం చెప్పి బౌద్ధ విహారాలలో ఆయనను సన్మానించారు. 1926 లో రెండవ సారి గురుదేవులు శ్రీలంక వెళ్ళినప్పుడు .. అక్కడ **" కందస్వామి "** అనే ఒక భక్తుడు గురుదేవులకు ఎంతో సేవ చేశాడు.

అంతకు ముందు గురుదేవులు శ్రీలంక వచ్చినప్పుడు **" ఖాదిర్ "** అనే ఆ ముస్లిం యువకుడు వారి  బోధనలు విని ప్రభావితుడై .. మతం మార్చుకుని ***' ఖాదిర్ '*** పేరును **' కందస్వామి '** గా చేసుకున్నాడు. గురుదేవులు నవ్వి ***" నాకు ' ఖాదిర్ ' మాత్రమే తెలుసు .. ' కందస్వామి ' ఎవరో తెలియదు! మతం మార్చడం తప్పు "*** అని నొక్కిచెప్పారు. అవసరం కొద్దీ మతాన్ని మార్చుకోవడం అన్నది ***శ్రీ నారాయణ గురు*** అంగీకరించేవారు కాదు.

అలాగే అద్వైతాశ్రమంలో కూడా **" చాకో "** అనే ఒక క్రిస్టియన్ విద్యార్థి .. గుండు గీయించుకుని, నుదుట విభూతి రేఖలు దిద్దుకుని, పసుపు బట్టలు కట్టి, గురుదేవుని సమీపించి తనను శిష్యునిగా అంగీకరించమని అర్థించాడు. గురుదేవులు ***" చాకో! నువ్వు 'చాకో' వేగానీ, 'నారాయణ దాసు' వి కావు; మతం మార్పిడి అన్నది సమస్యకు పరిష్కారం కాదు. నువ్వు నువ్వుగానే జీవించు. సత్యసాధన నాకు ముఖ్యం. జ్ఞానం సంపాదించడం మరి సంపాదించిన జ్ఞానం పదిమందికి పంచిపెట్టడం మంచిది మరి .. ఇందుకు ఏ మతమైనా ఒక్కటే "*** అన్నారు.

❊ ❊ ❊

ఆదిశంకరులు అద్వైతాన్ని జ్ఞానశిఖరాలపైన నిలిపితే .. ***శ్రీ నారాయణ గురు*** ఆ అద్వైతానికి క్రొత్తభాష్యం చెప్పి దానికి జనపథాలకు తెచ్చారు మరి జనహితానికి ఉపయోగించారు. జ్ఞానం సామాన్యునికి అందుబాటులో ఉండాలన్నది గురుదేవుల ఆశయం.

1916 నాటికి ***" అలువ అద్వైతాశ్రమం "*** ఎంతో ప్రసిద్ధి చెందింది .. మరి అనేక ప్రాంతాల నుంచి విశిష్టవ్యక్తులు .. ***శ్రీ నారాయణ గురుదేవుల*** దర్శనానికి అక్కడికి రాసాగారు. నారాయణ గురుదేవులు తన మొదటి శిష్యుడు అయిన ***" శివలింగదాసు "*** కు ***" శివగిరి "*** మఠాన్ని అప్పగించి

తాను అలువలోని అద్వైతాశ్రమానికి చేరుకున్నారు. శివలింగదాసు శిష్యుడైన ***" బ్రహ్మచారి వేలప్పన్"***.. ఆ తర్వాత శ్రీకాళహస్తి దగ్గరవున్న ఏర్పేడు వ్యాసాశ్రమంలోని ***"మలయాళ స్వామి "*** గా ప్రసిద్ధులయ్యారు!

❀ ❀ ❀

***శ్రీ నారాయణ గురు*** ను దర్శించిన వారిలో గురుదేవులు రవీంద్రనాథ్ ఠాగూర్, మహాత్మాగాంధీ, C. రాజగోపాలచారి, వినోభా బావే, స్వామి శ్రద్ధానంద, E.V. రామస్వామి నాయకర్ ప్రధానులు. నారాయణ గురు బోధనల స్ఫూర్తితోనే తమిళనాడులో రామస్వామి నాయకర్ ***" ద్రవిడ కజగం "*** ఉద్యమం ప్రారంభించారు! డా॥B.R. అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలేలపై నారాయణగురు ప్రభావం ఎంతగానో ఉండింది.


1922లో శ్రీ రవీంద్రనాథ్ ఠాగూర్, 1925 లో మహాత్మాగాంధీ అద్వైతాశ్రమం దర్శించి .. శ్రీ నారాయణ గురుతో అనేక సామాజిక విషయాలు చర్చించారు! గురుదేవుల అద్వైతసిద్ధాంతం రవీంద్రనాథ్ ఠాగూర్‌కి ఎంతగానో నచ్చింది!

***" ఆత్మోపదేశ శతకం "***, ***" అద్వైతదీపిక "***, ***" బ్రహ్మవిద్యాపంచకం "***, ***" మునికార్య పంచకం "***, ***" అరివు "***, ***" దర్శనమాల "***.. అనే అద్భుతమైన ఆధ్యాత్మిక సాహిత్యంతో పాటుగా ఎన్నెన్నో అష్టకాలూ, దశకాలూ, కీర్తనలూ వంటి సుప్రసిద్ధ రచనలను చేసారు శ్రీ నారాయణ గురు. ప్రపంచవ్యాప్తంగా వున్న ***నారాయణ గురు*** శిష్యులందరూ కలిసి వారి 73 వ జన్మదినాన్ని 1928 లో ***" జెనీవా "*** నగరంలో అత్యంత వైభవంగా జరిపారు!

వేదాల కాలం నుంచి సమాజంలో వ్రేళ్ళూనుకుని వున్న వర్ణాశ్రమ ధర్మానికి పట్టిన ***అంటరానితనం*** అనే జాడ్యాన్ని వదిలించడానికి ఎంతో కృషిచేసిన ***శ్రీ నారాయణ గురుదేవులు*** .. 1928 సెప్టెంబర్ 20 వ తేదీన ***" అలువ ఆశ్రమం "*** లో మహాసమాధి చెందారు.

# " శ్రీశ్రీశ్రీ మలయాళస్వామి "

తెలుగు లోగిళ్ళలో జ్ఞానదీపాలు వెలిగించిన మహర్షి **" శ్రీ మలయాళస్వామి "** గురించీ .. **" ఏర్పేడు-వ్యాసాశ్రమం "** గురించీ, వినని తెలుగువారు లేరనడం అతిశయోక్తి కాదు! **" శ్రీ మలయాళ స్వామి "** జన్మించింది కేరళ మరి వారి మాతృబాష మలయాళం అయినా .. కేరళనూ, మలయాళ భాషనూ మరచిపోయి, తెలుగు భాషను ఆస్వాదించి దానిని ఆరాధించి మరి తెలుగు వారికి ఆత్మీయుడయ్యారు!



కేరళలోని గురువాయూర్ సమీపంలోని నదీ-సాగర సంగమమైన **" ఎన్గండ్యూర్ "** లో జన్మించిన **" వేలప్పన్ "** కాలక్రమంలో తిరుమల చేరి శ్రీ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో **" మలయాళ స్వామి "** గా మారడం దైవికం.

**" వేలప్పన్ "** తల్లిదండ్రులు నొట్టియమ్మ, కరియప్పలది మధ్యతరగతి వ్యవసాయ కుటుంబం! దైవభక్తి పుష్కలంగా వున్న నొట్టియమ్మ గురువాయూరప్ప భక్తురాలు కావడంతో తనకు బహు సంతానం కావాలని చిన్నికృష్ణయ్యను ఆమె ప్రార్థిస్తూండేది. 1885 మార్చి 27న ఆమెకు మూడవ కొడుకుగా జన్మించాడు వేలప్పన్.

మొగ్గ దశలోనే పూవు సుగంధం వెదజల్లినట్లు .. రెండేళ్ళ వయస్సులోనే **" వేలప్పన్ "** లోని వైరాగ్య లక్షణాలు బయటపడ్డాయి. మెత్తటి పరుపు పైన నిద్ర పుచ్చితే .. ఏడ్చి క్రిందికి దొర్లి, కటికనేల మీద సుఖంగా నిద్రపోయేవాడు.

పిల్లవాని వింతచర్యలకు భయపడి తల్లి ఒక సాధువును అడిగితే .. ఆయన కళ్ళు మూసుకుని ధ్యానించి " అతనొక మహర్షి అయ్యే లక్షణాలు కనిపిస్తున్నాయి ; పైగా గొప్ప సంఘసంస్కర్త, విప్లవభావుకుడు అవుతాడు " అన్నాడు. జ్యోతిష్కులను సంప్రదించగా .. అతనికి సంసార జీవితమే లేదని తేల్చి చెప్పారు. తల్లిదండ్రులకు ఒక వైపు విచారం, మరొక వైపు ఆనందం కలిగాయి.

**" వేలప్పన్ "** ప్రవర్తన రోజురోజుకీ మరీ విచిత్రంగా, విడ్డూరంగా మారింది. ఆకలి అవుతున్నా అన్నం పెట్టమని అడగడు. ఒంటరిగా ఉంటూ తిండి ధ్యాస లేకపోగా .. సదా భగవద్ధ్యాస అనే గుణాలు మూడేళ్ళవయస్సుకే అలవడ్డాయి.

అయిదవ ఏట ***" ఓం నమశ్శివాయ "*** తో అక్షరాభ్యాసం చేయించి బడికి పంపారు. అదే ఆయనకు పంచాక్షరీ మంత్రోపదేశమైంది. మాతృభాషతో పాటు సంస్కృతం నేర్చాడు. రాత్రింబవళ్ళు నిర్విరామంగా చదివేవాడు. బడికి వెళ్తూ, తిరిగి వస్తూ కూడా చదువుతూండేవాడు. ఊళ్ళో పురాణ కాలక్షేపం జరిగితే తప్పక హాజరయ్యేవాడు .. మరి యోగుల, మహర్షుల జీవితచరిత్రలు చదువుతూ పరవశించేవాడు. వారిలో తనను చూసుకునేవాడు.

చిన్న వయస్సులోనే గంటల తరబడి ధ్యానం చేస్తూండేవాడు. తల్లి భోజనానికి పిలిచినా వినిపించుకునేవాడు కాదు. పైగా ఏ రోజు పాఠాలు ఆ రోజే కంఠస్థం చేసే వరకు భోజనం చేసేవాడు కాదు. అంతటి నిష్ఠ, నియమం! జీవితంలో రాణించడానికి పట్టుదల, కఠోరదీక్ష అవసరం అని ఏకాదశి ఉపవాసాలు, భజనలు, జాగారం, మహాశివరాత్రి, ప్రతి సోమవారం ఉపవాసం .. చిన్నతనం నుంచే అలవాటు చేసుకున్నాడు.

***" వేలప్పన్ "*** లో జీవకారుణ్యం ఎక్కువగా వుండేది. ఒకానొకరోజు **వేలప్పన్** తన ఈడు పిల్లలతో కలిసి బడి నుంచి వస్తూండగా ఒక బోయవాడు రెండు పావురాళ్ళను అమ్ముతూండడం చూసాడు. ***" వాటిని కొన్నవారు వాటిని చంపి వండుకు తింటారు "*** అన్న ఆలోచన రాగానే అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి. హృదయం బాధ పడింది. పరుగున ఇంటికి వెళ్ళి, తల్లినడిగి డబ్బు తెచ్చి ఆ పావురాళ్ళను కొని ఆకాశంలోకి ఎగురవేశాడు.

ఆ విషయం తెలిసి నొట్టియమ్మ కొడుకును గుండెలకు హత్తుకుని ఆశీర్వదించి మరీ ఆనందించింది. **" వేలప్పన్ "** తన సాటిపిల్లలకు జీవకారుణ్యం గురించీ, అహింస గురించీ నీతి పాఠాలు చెప్పేవాడు: ***" దయగల హృదయమే దేవాలయం "*** అని బోధించేవాడు! **వేలప్పన్** కు పెద్దలంటే గౌరవం మరి సాధుసన్యాసులంటే అమితభక్తి. వీధిలో ఏ సాధువు కనిపించినా, బైరాగి కనిపించినా ఇంటికి తీసుకువెళ్ళి భోజనం పెట్టేవాడు.

❀ ❀ ❀

ఒకసారి ఎన్గండ్యూర్‌కు ఒక కపట సన్యాసి వచ్చాడు. అతని పెరిగిన జుట్టు, గడ్డం, వేసుకున్న రుద్రాక్షమాలలు, విభూతి పట్టెలు చూచి గ్రామస్థులు ఆదరించారు. తాను హిమాలయాల నుంచి వస్తున్నాననీ, తన దగ్గర ఎన్నో మహిమలు ఉన్నాయనీ నమ్మించి ఊళ్ళో జ్ఞానబోధ చేయసాగాడు. తన దగ్గర మహిమ గల రుద్రాక్షలు వున్నాయనీ, వాటిలోంచి పవిత్ర గంగాజలం బొట్లు బొట్లుగా రాలుతుందనీ, ఆ తీర్థం సేవిస్తే అదృష్టం వరిస్తుందనీ ప్రచారం చేస్తూ **" తీర్థం వెల ఒక్క రూపాయి "** అంటూ రూపాయలు దండుకోసాగాడు.

ఒకరోజున అతను స్నానానికి నదికి వెళ్ళిన సమయంలో వేలప్పన్ అతని సంచి వెతకగా .. అందులో బూరుగుకర్రతో చేసి, రంగు వేసిన రుద్రాక్షలు కనిపించాయి. ఆ రహస్యం గ్రామస్థుల ముందు బయటపెట్టగా వాళ్ళు కపట సన్యాసికి దేహశుద్ధి చేసి ఊరి నుంచి తరిమివేశారు. ఆనాటి నుంచి దొంగసన్యాసుల పట్ల వేలప్పన్‌కు ఏవగింపు ఏర్పడింది.

**" వేలప్పన్ "** ఇంటి ఆవరణలో ఒక పర్ణశాల ఉండేది. అందులో తాను ఒంటరిగా ధ్యానం చేసుకునేవాడు. ఒకరోజు రాత్రి శరీరస్పృహ లేకుండా ఉన్న వేలప్పన్‌ను అతని అన్న కొట్టి బయటకు ఈడ్చుకువచ్చాడు. పాపం వేలప్పన్ కిక్కురుమనలేదు. మరొకసారి అలాగే అన్నగారు కోపంతో పర్ణశాల దగ్గరకు వెళ్ళగా గుమ్మంలో ఒక నంది అడ్డంగా కనిపించింది. తల్లి కూడా ***" నీ తంబి సామాన్యుడు కాదురా! వాడి జోలికి వెళ్ళకు! "*** అని పెద్ద కొడుకును మందలించింది. తర్వాత ఎవ్వరూ వేలప్పన్ విషయం పట్టించుకోలేదు.

ఇంగ్లీషు స్కూలుకు పంపడానికి ప్రయత్నిస్తే ససేమిరా అంగీకరించకుండా .. సంస్కృతం చదివితే తప్ప వేదాలూ, ఉపనిషత్తులూ అర్థం కావని.. వేలప్పన్ సిద్ధలింగ గురుస్వామి ఆశ్రమానికి వెళ్ళి, అక్కడ సంస్కృతం, యోగం నేర్చుకున్నాడు.

❀ ❀ ❀

ఎంతటి మేధావికైనా, విద్యావంతునికైనా ఆత్మజ్ఞానం పొందడానికి ఒక సద్గురువు అవసరం. ***" గురుకృప లేనిదే ఆత్మవిద్య పట్టు పడదు "*** అని అప్పట్లో కేరళలో సుప్రసిద్ధులైన ***" శ్రీ నారాయణ గురు "*** గారి ముఖ్య శిష్యులైన **" శివలింగస్వామి "** దగ్గర శిష్యులుగా చేరాడు వేలప్పన్.

***" శబ్దమంజరి "*** తో సంస్కృత విద్యాభ్యాసం మొదలుపెట్టి పదమూడు రోజులలోనే ***" శబ్దమంజరి "*** మొత్తం కంఠతా పట్టాడు. ఎవరికైనా శబ్దమంజరి పాఠం చెప్పుకోవడానికే ఒక ఏడాది కాలం పడుతుంది. వేలప్పన్ ప్రతిభకు గురుస్వామి ముగ్ధుడయ్యాడు! ఆశ్రమంలో అందరూ అతనిని ***' భక్తా '*** అని పిలిచేవారు. ***" విగ్రహపూజ కన్నా ఆత్మారాధన మిన్న "*** అనే రహస్యం అప్పుడే గ్రహించాడు వేలప్పన్. రోజూ ధ్యానం పూర్తిచేసి కానీ భోజనం చేసేవాడు కాదు.

**" వేలప్పన్ "** నియమపాలనకు ముగ్ధుడైన శివలింగస్వామి ఒకనాడు పిలిచి .. తానుగా మంత్రోపదేశం చేశాడు. అష్టాంగయోగ సాధన నేర్పించాడు. పద్మాసనంలో, స్థిరాసనంలో జపం చేసి, ప్రాణాయామం చేస్తూండేవాడు. తపస్సుతో పాటు పుస్తకాలు చదవడం వల్ల మనస్సు నిష్కల్మషమై చక్కని ఆలోచన ఏర్పడుతుంది. ***" పతంజలి యోగం ", " హఠయోగ ప్రదీపిక ", " ఘోరాండ సంహిత ", " యోగశిక్షోపనిషత్తు ", " యోగ కుండలి ఉపనిషత్తు "*** .. మొదలైన గ్రంథాలు అధ్యయనం చేశాడు. ***" ఘెరాండసంహిత "*** విగ్రహారాధనను అంగీకరించదు. ***" మలయాళ స్వామి "*** గా మారిన తర్వాత గోగర్భక్షేత్రంలో ఆయన అనేక ప్రయోగాలు చేసి సిద్ధి పొందారు.

ఒకానొకరోజు శివలింగస్వామి వేలప్పన్‌ను పిలిచి ***" బిడ్డా! నీ ఆధ్యాత్మిక అభివృద్ధి, దీక్ష అమోఘం. త్వరలోనే నువ్వు లక్ష్యాన్ని చేరగలవు. నా గురువు శ్రీ నారాయణ యతీంద్రుల్ని దర్శించి వారి ఆశీస్సులు పొందు. నీకు మేలు కలుగుతుంది; మరి నీ తపనకు నిష్కృతి, తపస్సుకు మార్గం లభిస్తుంది. ఆధ్యాత్మిక రంగంలో లక్ష్య సాధనకు సద్గురువుల అనుగ్రహం అవసరం "*** అని చెప్పారు.

***నారాయణ గురుదేవు***ని దర్శించాలన్న కోరిక వేలప్పన్‌లో ఎప్పటి నుంచో ఉంది. వెంటనే ***" పరకాల ఆశ్రమం "*** చేరాడు. వేలప్పన్‌ను చూడగానే నిధి దొరికినంతగా ఆనందించారు ***నారాయణ గురుదేవులు!*** ఒక గొప్ప శిష్యుడు దొరకడం ఏ గురువుకైనా ఆనందమే కదా! తనకొక యోగ్యుడైన వారసుడు దొరికినందుకు సంతసించాడు. అక్కడ వేలప్పన్ ఉన్నది కొద్దిరోజులే అయినా ఒక జీవిత కాలానికి సరిపడేంత దివ్యానుగ్రహం పొందగలిగాడు! తిరిగి తన తొలి గురువు శివలింగస్వామిని దర్శించాడు. అప్పటికే ఆయన దేశాటనకు సిద్ధంగా ఉన్నారు.

❊ ❊ ❊

ఇక ఇక్కడ ఇంట్లో .. ***" వేలప్పన్ "*** ఇల్లు వదలిన నాటి నుంచి తల్లి మంచం పట్టింది. ఎన్నో సార్లు రమ్మని ఖబురుచేయడంతో గురువు అనుమతి తీసుకుని వేలప్పన్ ఇంటికి బయలుదేరాడు. వేలప్పన్ బయలుదేరే ముందు శివగురువు అతనికి కొన్ని సూత్రాలు బోధించాడు.

- *" బ్రహ్మచర్యం పాటించు. అహింసా వ్రతం ఆవశ్యకం. "*
- *" అసత్యం ఆడవద్దు; ధనాశ పెంచుకోవద్దు. "*
- *" ' నేనే ఇతరుల కన్న గొప్ప ' అని భావించవద్దు; అందరూ నాతో సమానం అని భావిస్తేనే భగవదనుగ్రహం లభిస్తుంది. "*
- ***" భేషజం బొత్తిగా పనికిరాదు; నిరాడంబరంగా, నిష్కల్మషంగా జీవించు; అప్పుడే పరం స్వాగతిస్తుంది మరి స్వర్గ ద్వారాలు తెరచుకుంటాయి. అలాకాక నీలో అహంకారం కలిగితే, నీ హృదయం తలుపులు వాటంతట అవే మూసుకుంటాయి దాంతో ' పరం ' నిన్ను దూరంగానే ఉంచుతుంది. "***

❊ ❊ ❊

అప్పటికి ***" వేలప్పన్ "*** వయస్సు పాతిక సంవత్సరాలు.

తల్లి తృప్తికోసం ఇంటికి చేరినా, అతనికి ఇంట్లో ఉండబుద్ధి కావడం లేదు. ***" ఎప్పుడెప్పుడు ఈ బంధాలు త్రెంచుకుపోదామా "*** అని ఆరాటంతో పాటు పాదచారిగా దేశాటనం చేయమని అంతరంగం ఉద్బోధ! ***" పారిపో .. వెనుతిరిగిచూడకు. పరుగో పరుగు "*** అంటూ మనస్సు

తొందర చేయసాగింది! ఒకరోజు అర్ధరాత్రి వేళ అందరూ గాఢనిద్రలో ఉండగా నెమ్మదిగా అభినిష్క్రమణం చేశాడు.

ఉదయం పర్ణశాలకు వెళ్ళి చూస్తే **వేలప్పన్** లేడు. చెప్పకుండా వెళ్ళిపోయినందుకు .. కన్నతల్లి గుండెలు బాదుకుని ఏడ్చింది. వేలు ధ్యానం చేసుకునే ప్రదేశంలో ఒక ఉత్తరం దొరికింది.

" దైవసమానులైన అమ్మకూ, నాన్నకూ ..

" నా గురించి దిగులు పడవద్దు, నా కోసం వెతికించవద్దు. నేను ఎవ్వరికోసం విచారించను. మీరు వెతికినా నేను కనిపించను. మీరు దయతో అతిథి అభ్యాగతులను ఆదరించి పట్టెడన్నం పెట్టినంతకాలం నా భుక్తికి ఎలాంటి లోటు రాదు. నేను మీ అందరినీ వదలిపోతున్నది భగవంతుని కోసం."

ఇట్లు
**" వేలప్పన్ "**

ఇక ఎవ్వరు చేయగలిగింది ఏమీ లేదు! ఎవరి కర్మకు ఎవరు బాధ్యులు!?

❊ ❊ ❊

రైలు సాకర్యం ఉన్నా కాలిబాటన నడకసాగించాడు. విజ్ఞాన సముపార్జనకీ, అనుభవానికీ ఆనాడు దేశాటనమే ఏకైక మార్గం. దేశం అంతా తిరుగుతూ, నదుల్లో స్నానం చేస్తూ, పవిత్ర క్షేత్రాలు దర్శిస్తూ ఆశ్రమాలూ, గురువులనూ దర్శిస్తూ .. సాంప్రదాయ జ్ఞానం పొందాడు. తీర్థయాత్రల వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి.

- మహాత్ముల దర్శనం లభిస్తుంది.
- అదృష్టం కలిసొస్తే ఓ మంచి గురువు లభించవచ్చు.
- వివిధ ధ్యాన పద్ధతులు, జీవన విధానాలు తెలుస్తాయి; కష్టాలు పడడం వల్ల మానసిక సంయమనం ఏర్పడి మరి ఓర్పు, సహనం లభిస్తాయి.
- నిరంతర ధ్యానమగ్నత వల్ల మనస్సు శూన్యం అవుతుంది.

వేలప్పన్ ముందుగా కర్నాటకలోని ***" గోకర్ణ క్షేత్రం "*** చేరుకున్నాడు. అక్కడి నుంచి ఉడిపి, మహాబలేశ్వర్, పండరీపురం, ద్వారక, హరిద్వార్, మధుర, బృందావనం, కురుక్షేత్రం, గురుద్వార్ దర్శించాడు. కులమతాలకు అతీతంగా స్త్రీలను సైతం సమాదరించే ***" శ్రీశ్రీశ్రీ దయానంద సరస్వతి "*** గారి ***" ఆర్యసమాజ విధానం "*** ఆయనకు బాగా నచ్చింది. ఆర్యసమాజం వారు వేదాలను ఆదరిస్తారు కానీ మూఢాచారాలతో కూడిన హిందూ విధానాలను మాత్రం వారు హర్షించరు.

బ్రహ్మకపాల తీర్థం నుంచి అయోధ్య మీదుగా కాశీ చేరి కాశీలో ***" చాతుర్మాస దీక్ష "*** చేసి గయ చేరాడు. బుద్ధగయలో కొంతకాలం ధ్యానించి నవద్వీపంలోని కృష్ణచైతన్య ప్రభు జన్మస్థలం దర్శించాడు. కలకత్తా కాళిని దర్శించి, సింహాచలం, శ్రీశైలం, భద్రాచలం మీదుగా తిరుపతి చేరుకున్నాడు.

గోవింద నామస్మరణ చేసే భక్తుల వెంట ఏడుకొండలు ఎక్కి .. పుష్కరిణిలో స్నానం చేసి వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నాడు. ఆ తర్వాత పాపనాశనం, ఆకాశగంగ తీర్థాలు సేవించి, మధ్యలో వున్న ***" గోగర్భం "*** చేరాడు. అది పాండవులు తపస్సు చేసిన పుణ్యక్షేత్రం. ఆ ప్రదేశం ***" వేలప్పన్ "*** కు బాగా నచ్చింది.

ప్రశాంత వాతావరణంతో జనసంచారం లేకుండా ప్రక్కన నీటి ప్రవాహంతోపాటు చుట్టూ పండ్లచెట్లు మరి గుహతో అద్భుతంగా వున్న ఆ ప్రదేశంలో కొంతకాలం ఉంటే బాగుంటుంది అని అనిపించింది. అయితే అంతకంటే ముందుగా దక్షిణదేశ తీర్థయాత్రలు చేయ సంకల్పించాడు.

***" ఉత్తరభారతం నుంచి తెచ్చిన గంగా జలంతో రామేశ్వరంలోని రామలింగేశ్వరుని అభిషేకిస్తే యాత్రా ఫలం దక్కుతుంది "*** అని అరుణాచలం, కాంచీపురం, చిదంబరం, శ్రీరంగం, కుంభకోణం, పళని, మధురై దాటి రామేశ్వరం చేరుకున్నాడు. తిరుగు ప్రయాణంలో ***" వర్కల "*** చేరి, నారాయణ ఆశ్రమంలో ***శివలింగస్వామి*** ని దర్శించి తన యాత్రా వివరాలు అందించాడు.

అక్కడి నుంచి స్వగ్రామం చేరుకుని తాను ఇల్లు వదలిన కొద్ది కాలానికి తండ్రి మరణించిన వార్త అప్పుడు తెలుసుకున్నాడు. తల్లి దిగులుతో మంచం పట్టడంతో .. మనశ్శాంతి కోసం కొంతకాలం నారాయణ ఆశ్రమంలో గడిపాడు. మరి కొంతకాలం తల్లికి సేవలు చేసి తిరిగి ***" గోగర్భం "*** చేరుకున్నాడు.

29 సంవత్సరాలు వయస్సులో .. 1913 డిసెంబర్ మూడవ వారంలో గోగర్భం చేరుకున్న ***" వేలప్పన్ "*** దగ్గర కట్టుబట్టలు తప్ప, డబ్బు, దస్కం ఏమీ లేవు. నిత్యం శ్రీ వేంకటేశ్వరుని దర్శించి, తన లక్ష్యం నేరవేర్చమని ప్రార్థించేవాడు. పాండవ తీర్థం గుహలో తపస్సు, రోజుకు ఒక్కసారి భోజనం కోసం ఉదయం తిరుమల గ్రామంలోకి వెళ్ళి భిక్ష అర్థించేవాడు.

దొరికిన మట్టుకు భుజించేవాడు. తెల్లవారుజామున ధ్యానానికి కూర్చుంటే సాయంత్రం అయినా లేవబుద్ధి అయ్యేది కాదు. కొన్ని రోజులు దేవాలయంలో శ్రీ వేంకటేశ్వరస్వామికి నివేదనలు చేయగా గిన్నెలలో మిగిలిన అడుగుబొడుగు తిని నీళ్ళు త్రాగేవాడు. ఒక్కోసారి రెండు, మూడు రోజులు కూడా మెతుకు దొరికేది కాదు.

గోగర్భం దగ్గర తపస్సు చేసుకుంటున్న ***" వేలప్పన్ "*** .. కేరళీయుడని తిరుమల వాసులకు తెలిసిపోయింది. పేరు తెలియక ***" మలయాళస్వామి "*** అని పిలవడంతో ఇక అదే పేరు

స్థిరపడిపోయింది. తర్వాత శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులు విధిగా గోగర్భం వెళ్ళి మలయాళస్వామిని దర్శించడం అలవాటైంది. శ్రీ వేంకటేశ్వరస్వామి ఆపద మొక్కులవాడే గాని పలకని దేవుడు! కానీ మలయాళస్వామి మాత్రం యాత్రికులందరికీ సందేహాలు తీర్చి, కోర్కెలు తీర్చే దేవుడైనాడు!

చిన్నతనంలో దేవాలయాల్లో పూజలు చేస్తూ దేశంలోని అన్ని క్షేత్రాలు దర్శించినప్పటి ' భక్తి ' ఇప్పుడు లేదు. ఇప్పుడు ఆయనది ఆత్మపూజ! కాలనియమం లేదు; వ్యాకులం లేదు; ఆశ లేదు; నిరాశ లేదు. నిద్రాహారాల పట్టింపు లేదు. అనితర సాధ్యమైన ధ్యానస్థితి! అహింస, ఇంద్రియ నిగ్రహం, ప్రేమ, కరుణ, క్షమ, శాంతి మరి సత్యవచస్సుల కలపోత అయిన మలయాళ మహర్షి.. బొత్తిగా ప్రాపంచిక స్పృహ లేకుండా ఎన్ని రోజులైనా సమాధిలో అలా ఉండిపోయేవారు.

❀ ❀ ❀

ఒకానొకసారి ***" బాలాజీ "*** అనే అభిమాని మినప సున్ని ఉండలు ఒక గిన్నె నిండా తెచ్చి స్వామికి సమర్పించాడు. అవి పది, పదిహేను రోజులు నిల్వ ఉంటాయి. ఆకలైనప్పుడు ఒకటి తిని నీళ్ళు త్రాగినా కడుపు నిండుతుంది. స్వామి ఒకటి తిని, ధ్యానానికి కూర్చున్నారు కానీ మనస్సు మళ్ళీ ఆ సున్ని ఉండల మీదికి పోసాగింది. లేచి మొత్తం ఉండల్ని ఆ ప్రక్కన కనిపించిన పిల్లలకిచ్చి .. గిన్నెను ప్రవాహం నీళ్ళలోకి విసిరివేశాడు. జిహ్వాచాపల్యం చెడ్డది.

రోజూ వేంకటేశ్వరస్వామికి నివేదన చేసి, ప్రసాదాలు పంచేవేళకు దేవాలయం చేరుకునేవారు స్వామి. ఒకసారి వర్షాలు కారణంగా గోగర్భం చుట్టూ నీటి ప్రవాహం ఎక్కువై, మూడు రోజుల పాటు బయటకు రావడానికి వీలైంది కాదు. ఆకలి దహించి వేస్తోంది.

ఆ సమయంలో జగద్గురువు **ఆదిశంకరాచార్యుల వారి** ***" శివానంద లహరి "*** జ్ఞాపకం వచ్చి, ఆ శ్లోకాలు పఠించాడు. అదే సమయంలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం ఉద్యోగి .. సుబ్బరాయశెట్టికి శ్రీ వేంకటేశ్వరస్వామి కనిపించి .. ***" గోగర్భం దగ్గర వుండే స్వామికి ఆహారం తీసుకువెళ్ళు "*** అని ఆదేశించారట ! దాంతో ఆయన వెంటనే ఇద్దరు మనుషులు తోడురాగా వెళ్ళి వెదురుగడకు ఆహారంమూటను కట్టి ప్రవాహం అవతలకి అందేలా చేశారు.

❀ ❀ ❀

ఒకరోజున స్వామి ధ్యానంలో ఉండి ప్రసాదాల వేళకు దేవాలయానికి వెళ్ళలేకపోవడంతో .. ఆలస్యంగా వచ్చినందుకు వంటవాళ్ళు విసుక్కున్నారు. ఆ తర్వాత స్వామి ఎప్పుడూ దేవాలయానికి వెళ్ళి ప్రసాదానికి చేయిచాచలేదు .. మరి దేవాలయ ప్రాంగణంలో అసలు అడుగు కూడా పెట్టలేదు!

కాలక్రమంలో .. గోగర్భం దగ్గర వున్న **" మలయాళస్వామి "** దర్శనానికి జనం రాకపోకలు ఎక్కువయ్యాయి మరి పండితులు, సన్యాసులు సైతం వచ్చి విషయాలు చర్చించసాగారు.

శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చే వారికంటే మలయాళస్వామి దర్శనార్థులు ఎక్కువకావడంతో దేవస్థానం రాబడి తగ్గిపోయి దేవస్థానం అధికారులకు భయం పట్టుకుంది. దాంతో స్వామిపట్ల అసూయ ఏర్పడి అది క్రమంగా ద్వేషంగా మారింది.

***" మలయాళస్వామి "*** తపోశక్తి భక్తుల్ని విపరీతంగా ఆకర్షించడంతో ***" గోగర్భం "*** ఒక యాత్రాస్థలం అయింది. భక్తులు ఆయన్ని అపర వేంకటేశ్వరునిగా కీర్తించసాగారు. ఆయనకు వస్తున్న కీర్తి సనాతనులకు కంటగింపై .. దేవస్థానం వారి తలనొప్పి మరీ ఎక్కువైంది. ఎలాగైనా ఈ అబ్రాహ్మణుని తిరుమల నుంచి తరిమి వేయాలని పథకం వేశారు.

తిరుమల గ్రామంలో గుప్పెడు మెతుకులు అందకుండా కట్టడి చేశారు. పూజారులు దేవాలయం E.O. మహంతుకు స్వామిపైన ఉన్నవీ, లేనివీ కల్పించి చెప్పసాగారు. ***"స్వామిని గోగర్భంలో ఉండనీయడం శ్రీ వేంకటేశ్వరస్వామికి అపచారం చేయడమే "*** అన్నారు.

ఆ విషయం పసికట్టిన **మలయాళస్వామి** తిరుమల వదిలి వెళ్ళడానికి నిర్ణయించుకున్నారు. ఆయన అభిమాన శిష్యులు తిరుపతి చుట్టుప్రక్కల అనేక ప్రదేశాలు పరిశీలించి కోటంబేడులో స్వామి పేరున ఒక ఆశ్రమం ఏర్పాటు చేసారు. రేణిగుంట కాళహస్తి నడుమ ***" ఏర్పేడు "*** వద్ద నందికొండ ప్రాంతంలో ఆశ్రమస్థాపనకు నిర్ణయం జరిగింది. ప్రక్కనే ***" కాశీబుగ్గ "*** అనే జల వనరులు వుండటం వల్ల మంచినీటికి ఇబ్బంది వుండదు.

ఆలోగా స్వామి తీవ్ర తపస్సాధనకోసం గోగర్భం వదలి, ఎవ్వరికీ చెప్పకుండా తుంబురు తీర్థం, సనత్కుమారతీర్థం, కుమారధార, రామకృష్ణ తీర్థం, వైకుంఠ తీర్థాల దగ్గర తపస్సు చేసుకోసాగారు. ఒక వేసవిలో రెండు నెలల పాటు భయంకరారణ్యంలో ఉన్న తరిగొండ వెంగమాంబ తపస్సు చేసిన గుహలో తపస్సు చేసుకున్నారు. అక్కడ చిరుతలు, విషసర్పాలు కూడా స్వామి తపస్సుకు ఎంతగానో సహకరించాయి.

1926 జూన్ 3 నాటికి స్వామి గోగర్భం చేరి పన్నెండు సంవత్సరాలు కావడంతో .. కొండ దిగి వచ్చి దేవాలయం ముందు నిలబడి ఒక టెంకాయ కొట్టి నమస్కారం చేశారు కానీ .. దేవాలయం లోపలకు మాత్రం వెళ్ళలేదు! తిరుపతిలోని భక్తజనం వందలమంది ఆయనకు బ్రహ్మరథం పట్టి సాదరంగా స్వాగతం చెప్పగా .. రైలులో ఏర్పేడు చేరి అక్కడి నుంచి తమ ఆశ్రమానికి బయలుదేరారు.

## "వ్యాసాశ్రమం-ఏర్పేడు"

ప్రాచీనకాలం నాటి ఋషివాటిక వంటిది ***" శ్రీ మలయాళస్వామి "*** నెలకొల్పిన ***" వ్యాసాశ్రమం "***. ప్రపంచంలోని ప్రముఖ మత సంప్రదాయాలన్నింటినీ గౌరవించే స్వామి తమ కుటీరద్వారంపై వివిధ మత చిహ్నాలు వ్రాయించారు. భగవద్గీతకు గొప్ప వ్యాఖ్యానం వ్రాసి గీతాప్రచారం విరివిగా

చేసారు. స్వామివారు ***" వ్యాసాశ్రమం "*** పక్షాన తెలుగు సంస్కృత గ్రంథాలకు వ్యాఖ్యానాలు వందల సంఖ్యలో ప్రచురించి ఆధ్యాత్మిక ప్రబోధానికి ఎనలేని సేవ చేసారు.

***" శుష్కవేదాంత తమోభాస్కరం ", " ఉపదేశామృతం ", " స్వబోధ సుధాకరం ", " ఓంకారం ", " ధర్మసేతువు ", "స్తోత్రమంజరి ", " ప్రశ్నోత్తర మాణిక్యమాల ", " గీతార్థప్రకాశిక ", " బాలయోగిని ", " లోకోద్ధారకము ", " ఈశ్వరకృప ", " గురుభక్తి ప్రభావము ", " గృహస్థాశ్రమ ధర్మము ", " మహామంత్రాతీత ప్రభావము ", " నిర్వాణ నిలయము ", " బ్రహ్మచర్యము ", "సూత్రార్థప్రకాశిక ", " కర్మసిద్ధాంతం ", " చాతుర్మాస్య మహత్యము", " ఉపదేశామృతము ", " నిర్విఘ్నయోగసిద్ధి ", " శ్రీ మలయాళ యతీంద్రగీత "*** లు వాటిలో చాలా ముఖ్యమైనవి.

❀ ❀ ❀

***" శ్రీ మలయాళస్వామి "*** బ్రహ్మవిద్యాప్రచారానికి ఎంతకృషి చేసారో సంఘసంస్కరణకు అంత కృషి చేసారు. దురాచారాలు మూఢవిశ్వాసాలు నిర్మూలించటానికి చాలా కష్టాలు పడ్డారు. కేరళలో శ్రీ నారాయణ గురుదేవులు చేసినంత కృషి ఆంధ్ర దేశంలో మలయాళస్వామి చేసారు! స్వార్థపరులు శాస్త్రాల్లో మన్వాది స్మృతుల్లో చేర్చిన, కల్పితభాగాలు ఎత్తి చూపించి పండిత పామరుల మన్ననలు అందుకున్నారు. హరిజనులనూ, గిరిజనులనూ, స్త్రీ పురుషులనూ, మరి సమస్త భారతీయులనూ సామ్యవాదంలో బంధించారు.

జాతిభేదాలు నిర్మూలించి బ్రాహ్మణేతరులకు కూడా కర్మసన్న్యాసదీక్షలిప్పించి మఠమందిరాలు స్థాపించారు. వ్యాసాశ్రమ పూజా కలాపంలో సర్వజనులకు ***" పరబ్రహ్మ గోత్రోద్భవస్య, పరబ్రహ్మ గోత్రోద్భవాయాః "*** అని సంకల్పం చెప్పించారు. అస్పృశ్యతను నివారించి వరకట్నాలు నిషేధించి, వితంతువుల పునర్వివాహాలు అనుమతించారు. జీవహింసను మాన్పించడంతో పాటు శుభకార్యాల్లో ఆడంబరాలు, వేశ్యల నాట్యాలు ఆపించారు.

❀ ❀ ❀

స్వామివారి ఆత్మప్రబోధాలు సమాజసేవాకార్యాలు ఎంత గొప్పవో .. వారి స్వానుష్ఠానం అంతకంటే గొప్పది. తాము అనుష్ఠింపని ధర్మం స్వామివారు ఇతరులకు బోధించలేదు. తపశ్చర్యాకాలంలో ఎంతటి కఠోరనియమాలు పాటించారో తపఃస్సిద్ధి తరువాత కూడా అంతే నిష్ఠతో వాటిని పాలించారు. ఆసేతు హిమనగం పాదరక్షలు లేకుండా తిరిగారు! జీవితాంతం వరకు పాదరక్షలు ధరించలేదు!

**" వ్యాసాశ్రమం "** లోని విద్యార్థులకు గొప్ప భవనాలు నిర్మించినా .. తాము మాత్రం పూరి గుడిసెలోనే తమ అనుష్ఠానం కొనసాగించారు. వారేమి వ్రాసినా తమ పేరుకు ముందు **" చరాచర సుఖాభిలాషి "** అని వ్రాసేవారు.

❋ ❋ ❋


1960 నుంచి మలయాళస్వామికి తీవ్ర అనారోగ్యం ప్రారంభమైనా సరే లెక్కచేయక .. 1961లో **పాయకాపురం** లో జరిగిన సనాతన సభలకూ, 1962లో **షాద్‌నగర్** లో జరిగిన ఆధ్యాత్మిక సభలకూ మరి ***గాగిల్లాపురం*** సభలకూ వెళ్ళారు. 1962 ఏప్రిల్ 3వ తేదీ నాడు ప్రపంచానికి తమ తుది సందేశం వ్రాయించి .. 1962 జూలై 12 వ తేదీ అర్ధరాత్రి 12.00 గంటలకు శ్రీమలయాళస్వామివారు బ్రహ్మైక్యం చెందారు. మరి వారి ఆత్మ .. ఆశ్రమాన్ని సందర్శించే వారిని ఇప్పటికీ ఆశీర్వదిస్తోంది!

PYRAMID SPIRITUAL SOCIETIES MOVEMENT
ENERGY WISDOM CONSCIOUSNESS
INDIA
BE A LIGHT UNTO YOURSELF



# " శ్రీ శ్యామాచరణ లాహిరి "

దుఃఖభూయిష్టమైన రోగాలతో ఈతి బాధలను అనుభవిస్తోన్న గృహస్థులకూ మరి సాధు సంతులకూ క్రియా యోగదీక్షల ద్వారా మోక్ష మార్గాన్ని చూపించడానికి దివి నుంచి భువికి దిగివచ్చిన శివాంశ సంభూతులే ***" శ్రీ శ్యామాచరణ లాహిరి "*** గారు. సర్వశక్తిమంతులయిన ***" శ్రీ మహావతార్ బాబాజీ "*** గారి ద్వారా క్రియాయోగ దీక్షను పొంది ఒకవైపు ప్రాపంచిక వ్యవహారాలను నిర్వహించుకుంటూనే మరొకవైపు స్వీయ ఆత్మోద్ధరణను పొందిన లాహిరి మహాశయులు అందరికీ ఆదర్శనీయులు!



***" శ్రీ శ్యామాచరణ లాహిరి "*** గారు 1828 సంవత్సరం సెప్టెంబర్ 30వ తేదీన పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని ***" ఘరాణీ "*** అనే ఒక గ్రామంలో .. శ్రీ గౌర్‌మోహన్, ముక్తకేశిదేవి దంపతులకు జన్మించారు.

***" యోగులు .. యోగుల కుటుంబంలోనే జన్మిస్తారు "*** అని భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుల వారు బోధించినట్లు శ్రీ శ్యామాచరణ్ తల్లిదండ్రులు ఇద్దరూ కూడా యోగదంపతులే! గౌర్‌మోహన్ గారు తమ పాండిత్య ప్రతిభతో రాజాస్థానంలో సంస్కృత పండితునిగా ***" సర్కార్ "*** అనే బిరుదు పొంది ***" పండిట్ గౌర్‌మోహన్ లాహిరీ సర్కార్ "*** గా ప్రసిద్ధి చెందారు.

వారు పురాణేతిహాసాలలో బహుముఖ ప్రజ్ఞాశాలియే కాక, నిరంతర ధ్యానమగ్నులై స్వీయ ఆత్మోద్ధరణలో ఉన్నతంగా శిఖరారోహణలో పురోగమిస్తూ ఉండేవారు. ***" శాస్త్రాలు వల్లె వేసినంత మాత్రాన ఆత్మోద్ధరణ జరుగదు; పైగా దాని వల్ల అహంకారం కూడా పెరగవచ్చు "*** అనుకునేవారు గౌర్‌మోహన్.

శ్యామాచరణ్ తల్లి .. ***" ముక్తకేశిదేవి "*** కూడా గొప్ప శివభక్తి పరాయణురాలు. ప్రతిరోజూ శివపూజ చేయనిదే ఆమె ఒక చుక్కనీరు కూడా ముట్టేవారు కాదు. సచ్ఛీలతతో అతిథి అభ్యాగతులను ఆదరించడం ఆ కుటుంబం యొక్క ఆదర్శాలు. ఆ దంపతులు అన్యోన్య అనురాగాలతో, దైవభక్తి పరాయణులై మెలిగేవారు.

❊ ❊ ❊

శ్రీ గౌర్‌మోహన్ గారు తన భార్యకు శివునియందు గల భక్తి ప్రపత్తులను గ్రహించి ***" జలాంగీ నది "*** ఒడ్డున, తమ ఇంటికి దగ్గరలో ఒక శివమందిరాన్ని నిర్మించారు. ప్రతిరోజూ

శ్యామాచరణ్‌ను తీసుకుని వాళ్ళ అమ్మ శివారాధనకు గుడికి వెళ్ళేది. శ్యామాచరణుడు గుళ్ళో తల్లిని అనుకరిస్తూ, తాను కూడా నిశ్చలంగా కూర్చుని తదేకలగ్న మనస్కుడై ధ్యానంలో ఉండి పోయేవాడు.

ఒక రోజున ముక్తకేశిదేవి .. శ్యామాను ఇసుక తిన్నెలపై వదలి, పూజలో నిమగ్నురాలై పోయింది. కాస్సేపయ్యాక అకస్మాత్తుగా బాలుడు గుర్తుకు వచ్చి చూసేసరికి, ఒంటినిండా విభూతి పులుముకొని, తల్లి పిలిచినప్పటికీ, వినిపించుకోలేనంత గాఢ ధ్యానమగ్నుడై ఉన్నాడు శ్యామా! శివాంశసంభూతుడైన శ్యామాచరణుడు అలా ధ్యానమగ్నుడగుటలో ఆశ్చర్య పడవలసిందేదీ లేదు కానీ .. అతడు సామాన్య బాలుడు కాదని మాత్రం ఆమె గ్రహించింది.

ఈశ్వరుడు ఆ బాలునిలో క్షణకాలం ప్రస్ఫుటమైనప్పటికీ .. తల్లి మమకారం వల్ల .. ఆమె బిడ్డను బిడ్డగానే చూసింది.

❀ ❀ ❀

ఒకసారి ముక్తకేశిమాత, శ్యామాచరణ్ బాబు, ఆలయంలో శివధ్యానంలో పూర్తిగా నిమగ్నమై ఉండగా .. ఒక జటాజూటధారి, సుందరమూర్తి అయిన సన్యాసి ఆలయ ద్వారం వద్ద నిలబడి ***" అమ్మా "*** అని పిలిచాడు. ఆవిడ కళ్ళు తెరచి అతనిని చూసి భయకంపితురాలై బాబును ఒడిలోకి దగ్గరగా తీసుకుంది.

ఆ పరిస్థితిని గమనించిన ఆ సాధుపుంగవుడు .. ఆమె భయపడినట్లు గ్రహించి ఆమెను భయపడవద్దని వారించి .. ఆమెకు లాహిరీని చూపిస్తూ .. ***" ఈ బాలుడు నా ఆశీస్సుల వలనే జన్మించాడు. దుఃఖభూయిష్టమైన రోగాలతో ఈతి బాధలను అనుభవిస్తోన్న గృహస్థులనూ, మానవాళినీ, సాధువులనూ ' క్రియా యోగ సాధన ' అనే సుళువైన మోక్షమార్గం ద్వారా ఆత్మోద్ధరణ పొందించడానికి దివి నుంచి భువికేతెంచిన వాడు. భవిష్యత్తులో ఈ బాలుడు ప్రపంచ వ్యవహారాలను చూసుకుంటూనే .. ఆదర్శ జీవితం గడుపుతూ .. ఆత్మోద్ధరణ పొంది .. అనేక మందికి మార్గదర్శకుడు అవుతాడు. అందాకా అతనిని నేను నీడలాగా వెన్నంటి ఉండి నా కలను నిజం చేసుకుంటాను "*** అని భవిష్యవాణిని తెలిపారు.

ఆయనే సర్వవ్యాపకులైన ***శ్రీ బాబాజీ మహారాజ్‌గారు!*** ఆమె ఆయనకు సాష్టాంగ దండ ప్రణామాలు అర్పించే లోపలే .. ఆ సర్వశక్తియుతుడైన మహావతారుడు అంతర్ధానమై పోయారు.

❀ ❀ ❀

1833లో గౌర్‌మోహన్ గారు కుటుంబంతో సహా కాశీ చేరారు. అప్పటికి శ్యామాచరణ్ ఐదేళ్ళ బాలుడు మరి అతని విద్యాభ్యాసం అంతా కాశీలోనే జరిగింది.

బాలుడిగా అతడు మృదుస్వభావంతో ఉంటూ చాలా సమయం అంతర్ముఖుడిగానే ఉండేవాడు. అతడు మంచి ఈతగాడు కావడంతో గంగానదీ ప్రవాహంలో ఒక ఘాట్ నుంచి ఇంకొక ఘాట్‌కు ఎప్పుడూ ఆనందంగా ఈదుతూ ఉండేవాడు. అతనికి 18 యేళ్ళ వయస్సు వచ్చాక తల్లిదండ్రులు **" కాశీమోణి "** అన్న కన్యతో అతనికి వివాహం జరిపించారు; మరి వివాహానంతరం వారిద్దరూ తమ గృహస్థ జీవితాన్ని ప్రేమానురాగాలతో గడుపుతూ .. ఇద్దరు కుమారులకూ మరి ముగ్గురు కుమార్తెలకూ జన్మనిచ్చారు.

❊ ❊ ❊

***" కష్టపడి పనిచేసుకునే వారికి ఆధ్యాత్మిక మార్గంలో నడవడానికి సమయం సరిపోదు "*** అన్న దగాకోరు ఆలోచనను సవాలు చేస్తూ శ్రీ శ్యామాచరణ్‌గారు ***" ప్రపంచంలో పనిచేసే వారు సైతం భగవత్ ప్రాప్తిని సులువుగా పొందవచ్చు "*** అని నొక్కినొక్కి వక్కాణించేవారు. ఈ సత్యాన్ని చాటడానికి వారు తమ జీవితాన్నే ఒక ఉదాహరణగా నిలిపారు! .. కాశీలో పోస్టల్ డిపార్ట్‌మెంటులో ఉద్యోగం చేసుకుంటూనే .. నిరంతర ధ్యానసాధన చేస్తూ సాధువులనూ, సన్యాసులనూ ఎక్కువగా కలుస్తూ ఉండేవారు.

కాలక్రమంలో .. అనేక జన్మల పరిణామ ఫలితంగా .. వారి జీవిత ప్రణాళికలో భాగంగా శ్రీ బాబాజీ గారు తమకున్న అద్వితీయ శక్తితో శ్యామాచరణ్ గారిని **" రాణీఖేత్ "** కు బదిలీ చేయించారు. హిమాలయ పర్వతాల్లోని ఒక అందమైన ప్రదేశం అయిన రాణీఖేత్‌లో శ్యామాచరణ్ హెడ్‌క్లర్క్‌గా పనిచేస్తూ .. అక్కడి ప్రకృతి సౌందర్యాన్ని తనివితీరా వీక్షిస్తూ ధ్యానసాధనా మార్గంలో ఆనందిస్తూ ఉండేవారు.

ఇలా ఉండగా ఒకరోజు శ్యామాచరణ్ .. హిమాలయ పర్వత సానువుల్లో .. అలా వెళుతూ ఉండగా, శిఖరపుటంచుల నుంచి ***" శ్యామాచరణ్ "*** అంటూ ఎవరో తనను పేరుపెట్టి పిలిచినట్లు అనిపించింది. ***" ఎవరా? "*** అని అనుకుంటూ ఉండగానే .. వాత్యల్యపూరిత చూపులతో రాగిరంగు జటాజూటాలతో అతనికి ఒక అజానుబాహువు కనిపించారు.

***" శ్యామాచరణ్! భయపడకయ్యా .. నువ్వు ఎప్పుడో ఒకప్పుడు ఈ దారికి వస్తావని తెలిసి .. నీ కోసమే నిరీక్షిస్తున్నాను. ఈ రోజుకి ఇక నీ పని చాలించి నా వద్దకు రా "*** అని చెప్పి ఆ సాధువు అంతర్ధానమైపోయాడు.

***" అతని మాటల్లో ఏదో అద్భుతశక్తి ఉంది "*** అని అచ్చెరువొందిన శ్యామాచరణ్ ***" వెళ్ళాలా? వద్దా? "*** అని చాలాసేపు తర్జనభర్జన పడి చివరకు వెళ్ళాలని నిర్ణయించుకుని .. పర్వతశ్రేణుల్లోని అడవులగుండా తన నడకను సాగించాడు. అప్పటికి సూర్యాస్తమయం అవుతోంది.

***" శ్యామాచరణ్ ఇలా రా! "*** అని మళ్ళీ వినిపించిన పిలుపుకు ఆకర్షితుడై ముందడుగు వేసుకుంటూ వెళ్ళి తిన్నగా శ్రీ బాబాజీ గారి పాదాల చెంతకు చేరాడు. పరిశుభ్రంగా మరి చక్కగా

అన్నీ సర్ది ఉంచబడిన ఒక గుహలోకి శ్యామాచరణ్‌ని తీసుకుని వెళ్ళిన బాబాజీ ***" నన్ను గుర్తుపట్టావా? అసలు గతంలో ఎప్పుడన్నా ఇక్కడికి వచ్చావా? ఈ కమండలం, పులిచర్మం గుర్తించావా? లేక అన్నీ మరిచిపోయావా? "*** అని అడిగారు.

శ్యామాచరణ్‌కి ఏం చెప్పాలో తోచని అయోమయంతో .. ***" ఇక్కడికి రావడం నాకు ఇదే మొదటిసారి! ఈ గుహను నేను ఇంతకుపూర్వం ఎప్పుడూ చూడలేదు! "*** అంటూ చీకటి పడటంతో మరుసటిరోజు ఉదయాన్నే డ్యూటీకి హాజరుకావాలి కనుక తిరిగి రాణీఖేత్‌కి వెళ్ళిపోవడానికి అనుమతి ఇవ్వాల్సిందిగా కోరాడు.

బాబాజీ గారు వెంటనే ***" నువ్వు ఆఫీసు కోసం కాదు .. నీ కోసమే ఆ ఆఫీసు "*** అని స్వచ్ఛమైన ఇంగ్లీషులో చెప్పగా విని శ్యామాచరణ్ ఆశ్చర్యపోయాడు. ***" ఎక్కడో కొండకోనల్లో .. మానవాళికి దూరంగా మసలే ఈ హిమాలయ సాధువు .. ఇంతటి చక్కని వ్యాకరణంతో కూడిన ఇంగ్లీషులో సంభాషించటమా? "*** అని సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయిన అతని సందేహాలను నివృత్తి చేస్తూ .. ***" ఇది మహామాయా నాటకం "*** .. అంటూ తన చేతితో అతని శిరస్సును తాకారు.

అంతే! ఒక్కసారిగా శ్యామాచరణ్ శరీరమంతా విద్యుత్ అయస్కాంత క్షేత్రంగా మారి .. తన గత జన్మలన్నీ అతని కళ్ళముందు సాక్షాత్కరించాయి.

***" శ్యామాచరణ్! గతజన్మలో నువ్వు ఈ గుహలోనే తపస్సు చేసుకుంటూ నీ జీవితాన్ని గడిపావు. ఈ కమండలం, పులిచర్మం నీకు చెందినవే. వందల సంవత్సరాలుగా వీటిని భద్రపరుస్తూ నేను నీ కోసం ఎదురుచూస్తున్నాను. 33 ఏళ్ళ క్రితం నీవు గౌర్‌మోహన్ కుమారుడిగా జన్మించినప్పటి నుంచీ నేను నిన్ను కాపాడుకుంటూనే వస్తున్నాను. నీ ఐదవ యేట మీ అమ్మగారికి కూడా నేను ఈ మాట ఇచ్చాను "*** అంటూ బాబాజీ వాత్సల్యపూరితంగా తెలియజేసారు.

ఇది విన్న శ్యామాచరణ్ క్షణం ఆలస్యం లేకుండా కన్నీటితో బాబాజీ కాళ్ళపైపడి సాష్టాంగ ప్రణామం ఆచరించి .. తక్షణ కర్తవ్యం అర్థించాడు. ***" కాలం చాలా విలువైంది! మరి నీకు దీక్షాసమయం ఆసన్నమైంది! కనుక దేహశుద్ధి కోసం నువ్వు ఈ కమండలంలో ఉన్న నూనెను త్రాగి .. నదిలో స్నానం చేసిరా "*** అని ఆదేశించారు.

అప్పటివరకూ మంచుకొండలలోని చలిగాలులతో వణికిపోతోన్న అతని శరీరం నదిలోకి దిగగానే .. అనంతమైన వేడితో నిండిపోవడంతో తన ఎన్నెన్నో జన్మల కల్మషాలన్నీ కరిగి పోయినట్లుగా అతనికి తోచింది! మరి సద్గురు దర్శన భాగ్యం అంటే మామూలు విషయం కాదుకదా!

ఇంతలో ఒక సాధుపుంగవుడు నది వద్దకు వచ్చి, అతనికి పొడిబట్టలు అందించి, అడవి మార్గంగుండా అతనిని నడిపిస్తూ .. అద్భుతమైన వెలుగులు విరజిమ్ముతూన్న ఒకానొక బంగారు భవంతి దగ్గరకు చేర్చాడు.

దానిని చూసి ఆశ్చర్యపోతూన్న శ్యామాచరణునితో ***" మన గురుదేవులు నీ కోసమే ఇప్పటికిప్పుడు ఈ బంగారు భవంతిని సృష్టించారు. ఈ రాత్రి ఈ మేడలో నీకు ' క్రియాయోగ దీక్ష ' ఇవ్వబడుతుంది. గత జన్మలో ఇదే నీ ఆఖరి కోరిక "*** అని తెలిపాడు. రత్నఖచితమయమై .. అద్భుత సుగంధాలను వెదజల్లుతూన్న ఆ మేడలో ఎందరెందరో యోగులు ధ్యానస్థితిలో పరవశాన్ని పొందుతూండగా .. ఆ ప్రాంతమంతా చెప్పనలవికాని ప్రశాంతతో నిండిపోయి ఉంది!

సర్వశక్తియుతులైన ఆచార్యులకు అసాధ్యమేదీ లేదన్న సృష్టిరహస్యానికి శ్యామాచరణ్ ఆశ్చర్యపోతూండగానే శ్రీ బాబాజీగారు వచ్చి .. ***" ఈనాటితో నీ భౌతికవాంఛలన్నీ తీరినట్లే! ఇక మేలుకో! ఈ అమృత ఘడియలలో నేను నీకు గుప్తమైన మరి మరుగున పడిపోయిన ' క్రియాయోగ దీక్ష ' ను ఇస్తున్నాను "*** అంటూ తమ చేతిని ముందుకు చాచి అక్కడ హోమగుండంతో పాటు ఫలపుష్పాలను సాక్షాత్కరింపజేసారు.

ఆ తరువాత బాబాజీ శ్యామాచరణుడికి సకల ప్రపంచాన్ని జరామరణాల నుంచి విముక్తులను చేసే అతి ప్రవిత్రమైన క్రియాయోగ దీక్షను ఇచ్చి, సకల మానవాళి యొక్క ఆధ్యాత్మిక దాహాన్ని తీరుస్తూ ప్రపంచ ఆధ్యాత్మిక చరిత్రలోనే ఒక నూతన శకానికి తెరలేపారు.

❊ ❊ ❊

దీక్షా కార్యక్రమం తరువాత ***" శ్యామాచరణ్! నీకు ఆకలిగా ఉందా? ఒకసారి కళ్ళు మూసుకో "*** అన్నారు బాబాజీ. కొద్దిసేపయిన తర్వాత కళ్ళు తెరచి చూసేసరికి బంగారు భవంతి మాయమై బాబాజీతో సహా ఇతర శిష్యగణమంతా నేలపై కూర్చుని కనిపించారు.

ఆశ్చర్యపోతూన్న శ్యామాచరణ్‌తో ***" ఈ భవంతి ఒక పని నిమిత్తం సృష్టించబడింది .. మరి ఆ పని అయిపోగానే మాయమయ్యింది "*** అంటూ సందేహాన్ని తీర్చారు బాబాజీ. ఆ తరువాత అక్కడే ఉన్న కుండను చూపిస్తూ ***" నీకు ఏది కావాలనుకుంటే అది అందులోంచి తీసుకుని తిను "*** అనగా శ్యామాచరణ్ ***" రసగుల్లాలు కావాలి "*** అనుకుంటూ అందులో చేయిపెట్టి నోరూరించే ***" రసగుల్లాలు "*** తీసుకుని తిన్నాడు! ఎన్నో ప్రపంచాలను సృష్టించగలిగే మహా తపస్వికుల అఖండ శక్తికి అచ్చెరువొందాడు శ్యామాచరణ్!

ధ్యానసాధన ద్వారా .. జీవుడు – శివుడు ఏకమైన ఆ అద్భుత స్థితిలో .. ప్రపంచ వ్యవహారాలనూ మరి ఉద్యోగాన్నీ మరచిపోయి గుహలోనే కాలం గడుపుతూ నిస్సంగత్వంవైపు మొగ్గు చూపుతున్న శ్యామాచరణుడితో .. బాబాజీ .. ***" నేను నీ ద్వారా ఒక ప్రపంచకార్యం నిర్వర్తించవలసి ఉంది. నువ్వు ప్రపంచంలోనే ఉంటూ గృహస్థయోగివై ఆదర్శజీవితానికి నాంది పలుకు. ప్రపంచంలో కోట్లాది మంది ప్రజలు చుక్కానిలేని నావలా తమ గమ్యం ఏదో తెలియక కొట్టుమిట్టాడుతున్నారు. నువ్వు వారందరికీ ఒక ధృవతారగా సన్మార్గం చూపించు. వారి ఆత్మోద్ధరణకు సులువైన క్రియాయోగాన్ని విశ్వవ్యాప్తం చెయ్యి. "***

*" నిన్ను ఆదర్శంగా తీసుకుని, గృహస్థులు, ప్రపంచ వ్యవహారాలు నిర్వర్తిస్తూనే .. ' అవి భగవత్ప్రాప్తికి అడ్డుకావు ' అన్న అవగాహనకు వస్తారు. ' ప్రపంచ వ్యవహారాలు నిర్వర్తిస్తున్నప్పటికీ అంతరంగ నిస్సంగత్వంతో మోక్షప్రాప్తిని పొందవచ్చు ' అనే జ్ఞానం వారికి కలుగచేయి "* అని కర్తవ్యబోధ చేసారు.

***" ఎప్పుడు నన్ను తలచుకున్నా సశరీరంగా నీకు నేను దర్శనమిస్తాను "*** అని బాబాజీ తనకు ఇచ్చిన వాగ్దానానికి సంతుష్టుడైన శ్యామాచరణ్ .. క్రియాయోగ దీక్షాపద్ధతుల ద్వారా జన్మజన్మల సంస్కారాలనూ, మనస్సునూ, శరీరాన్నీ ఎలా శుద్ధి చేసుకోవచ్చో సవివరంగా తెలుసుకుని .. రాణీఖేత్‌కు తిరిగి వచ్చారు.

❊ ❊ ❊

పై అధికారులకు ఎలాంటి సెలవు చీటీ పంపకుండా అప్పటికప్పుడు అన్ని రోజులపాటు తన ఉద్యోగ బాధ్యతలను వదిలి .. హిమాలయాలకు వెళ్ళిన శ్యామాచరణ్ .. తిరిగి రాణీఖేత్‌కు రాగానే తన సెలవు అభ్యర్ధనను మంజూరు చేస్తూ పై అధికారులు పంపిన కాగితాన్ని చూసి ఆశ్చర్యపోయాడు.

*" ఇదంతా గురుదేవుల లీలయే "* అనుకుంటూ అతి త్వరలో మళ్ళీ కాశీకే బదిలీ అయిన శ్యామాచరణులు కార్యోన్ముఖులై .. జాతి, మత, కుల, స్త్రీ, పురుష వివక్షత లేకుండా అందరికీ క్రియాయోగ దీక్షను ఇవ్వడం మొదలుపెట్టారు. పరుసవేదికి తగిలిన ఇనుము బంగారంలా మారినట్లు సద్గురువు స్పర్శచే ఒక మామూలు కుటుంబీకుడైన శ్యామాచరణ్ .. ఆధునికయుగపు క్రియా యోగాచార్యులుగా మారి సంసారంలోనే నిర్వాణం చెందుతూ ప్రపంచ ఆధ్యాత్మిక చరిత్రనే క్రొత్త మలుపులు త్రిప్పారు.

***" శ్రీ బాబాజీ "*** వారి ఆజ్ఞానుసారం శ్యామాచరణులు ఆచార్యత్వాన్ని స్వీకరించి .. క్రియాయోగ సోపానాలను ఒక్కొక్కటిగా అధిరోహించారు. నిరంతర యోగసాధన వల్ల ఆధ్యాత్మిక శక్తి అఖండంగా, అమోఘంగా అతనిపై ప్రసరించి వారి వద్దకు వచ్చే భక్తుల సంఖ్య, శిష్యుల సంఖ్య దినదినాభివృద్ధి చెందసాగింది.

తాము మహోన్నత స్థాయికి చెందిన గురువులైనప్పటికీ తమ శిష్యుల పట్ల ఎంతోప్రేమతో మెలిగేవారు. తమ పాదాలను ఎవ్వరినీ తాకనిచ్చేవారు కాదు లాహిరీ బాబా! ఎవరైనా వారికి వంగి నమస్కరిస్తే .. తిరిగి వారు కూడా ***" అవతల వారిలో ఉన్నది నారాయణుడే "*** అని భావించి మరీ వినయంతో నమస్కరించేవారు.

తాము గృహస్థులైనప్పటికీ .. బ్రహ్మచారులకూ, సాధువులకూ మరి వారితో పాటు నాలుగు వర్ణాల వారికీ, క్రిస్టియన్లకూ, మహమ్మదీయులకు కూడా క్రియాయోగ దీక్ష ఇచ్చేవారు. తమ శిష్యులకు ***" సచ్ఛీలంతో, నిగ్రహంతో, భక్తి వినయాలతో మెలగాలి "*** అని మార్గదర్శనం చేసేవారు.

❊ ❊ ❊

కాశీమోణి దేవి గారికి ఆమె భర్త తీసుకున్న అద్భుతమైన దీక్ష గురించి కానీ, యోగసాధన గురించి కానీ, దివ్యమైన వారి ఆధ్యాత్మిక శక్తి గురించి కానీ తెలియదు.

ఒకరోజు అర్ధరాత్రి ఆమె నిద్రనుంచి అనుకోకుండా మెలకువ వచ్చి లేచారు. ***" ఎన్నాళ్ళిలా నిద్రపోతావులే "*** అని చెవిలో ఎవరో చెప్పినట్లయి .. నిద్రలేచి చూడగా పక్కపై భర్త లేరు. దీపం వెలిగించి .. గదిలో ఓ మూల ధ్యానంలో ఉండి గాలిలో తేలియాడుతూ ఉన్న భర్తను చూసి ఆశ్చర్యంలో మునిగిపోయింది! తన భర్తకు ఇంతటి యోగశక్తి ఉందని ఆమె ఊహించలేకపోయింది.

గతంలో ఒకసారి విశ్వనాథ ఆలయంలో కూడా కాశీ విశ్వనాథునిలో భర్తను చూసిన దృశ్యం ఆమెకు జ్ఞప్తికి వచ్చి ఆమె కళ్ళవెంట ఆనందభాష్పాలు రాలాయి. ఇంతవరకు సామాన్య మానవునిలాగా తన భర్తను చూసినందుకు పరిపూర్ణ శరణాగతి పొంది తనను క్షమించమని వారిని పరిపరివిధాల వేడుకుంది.

ఇలా కొంతసేపయ్యాక .. శ్రీ శ్యామాచరణులు మామూలు స్థితికి వచ్చారు. తనకు కూడా క్రియాయోగ దీక్షను ఇవ్వవలసిందిగా కాశీమోణి ప్రాథేయపడగా .. ఆమెకు మరునాడే దీక్ష ఇచ్చారు. అప్పటినుంచి తన భర్త సహచర్యంతో పాటు క్రియాయోగ సాధన కూడా ఆమె జీవిత గమనాన్ని మార్చివేసింది.

***" యోగసాధనలో సిద్ధినీ, ఆత్మావబోధననూ పొందిన యోగికి విజ్ఞాన సర్వస్వం కరతలామలకం అవుతుంది "*** అని లాహిరీ బాబా నిరూపించారు.

శ్రీ లాహిరీబాబా గారి పొరుగు ఇంట్లో ఉన్న డాక్టర్ చంద్రమోహన్ గారు ఒకానొకరోజు బాబా వద్దకు వచ్చి .. వారి ఆశీస్సులు కోరారు. బాబా డాక్టర్ గారితో మాట్లాడుతూ .. ఆధునిక వైద్య విధానంలో గల నూతన పోకడలను గురించీ, శరీర నిర్మాణం గురించీ చాలా విషయాలు అడిగారు. చాలా ఉత్సాహంగా డాక్టర్ గారు వాటన్నింటికీ సమాధానాలు ఇచ్చారు.

అవి విన్న బాబాగారు ***" చంద్రమోహన్! చావుకు నిర్వచనం ఏమని చెప్తావు? "*** అని అడిగారు. చంద్రమోహన్ వైద్యశాస్త్రానుసారంగా, తన మేధస్సును ఉపయోగించి బాబా గారికి వివరించడం మొదలుపెట్టారు. అప్పుడు బాబాగారు ***" చంద్రా..! నేనిప్పుడు బ్రతికి ఉన్నానో, చచ్చిపోయానో చెప్పు! "*** అన్నారు.

ఆ ప్రశ్నలోని అంతరార్థం చంద్రమోహన్ గారికి అర్థం కాలేదు. ఆతృతతో బాబాగారిని పరీక్షించి చూసేసరికి వారి నాడీస్పందన దొరకక ఆయన నిశ్చేష్టుడైపోయాడు! శ్వాస కూడా లేదు కానీ .. ముఖం మాత్రం తేజోవంతంగా మరి మందస్మితంగా ఉంది. ***" ఎలా ఇది సాధ్యం? "*** అని భావించి .. మళ్ళీ మళ్ళీ బాబాను పరీక్షించి .. నిశ్చేష్టుడై బాబా పాదాల చెంత మోకరిల్లాడు.

లాహిరీ బాబా చిరునవ్వుతో **" నాకు చనిపోయినట్టు సర్టిఫికేట్ ఇవ్వు "** అని అడిగారు. అప్పుడు **" నేనివ్వగలను కానీ .. మీరు మాట్లాడుతున్నారు .. మరి చనిపోయిన వ్యక్తి మాట్లాడలేదు కదా "** అన్నారు డాక్టర్ గారు!

ఇటువంటి ప్రత్యక్ష అనుభవంతో .. డాక్టర్ చంద్రమోహన్‌కు ఆధ్యాత్మిక విద్యపట్ల ఉన్న అనుమానం నివృత్తి అయ్యి అతడు ప్రాపంచిక విషయాల పట్ల మోహరహితుడయ్యాడు. యోగికి నిత్య ధ్యానసాధన ద్వారా అసాధ్యమేదీ కాదని తెలుసుకున్నాడు. అప్పుడు లాహిరీబాబా గారు **" చాలా విషయాలలో నేటి విజ్ఞాన శాస్త్రం వెనకబడే ఉంది .. కానీ యోగులకు ఇలాంటి జ్ఞానం కరతలామలకమే "** అంటూ డాక్టర్ గారి సందేహాలను నివృత్తి చేసారు.

❀ ❀ ❀

సిద్ధయోగి లాహిరీ బాబాగారు సాకారుడైనప్పటికీ .. నిరాకారుడు. ప్రస్తుతం ప్రపంచమంతటా పూజింపబడుతున్న లాహిరీబాబా ఫొటో .. ఒకసారి అందరినీ ఆశ్చర్యపరుస్తూ ఒక ఫొటోగ్రాఫర్ తీసిన ఒకేఒక్క ఫొటో. లాహిరీబాబాకు ఫొటోలు అంటే ఇష్టం ఉండేది కాదు.

***" ఫొటోలు తీసుకోవడం ఎందుకు? ఫొటో తీసుకుంటే భవిష్యత్తులో ధ్యానాన్ని విడిచి ఫొటోను పూజిస్తూ కూర్చుంటారు. ఎక్కువమంది బాహ్యపూజకే ప్రాధాన్యం ఇచ్చి అంతరాత్మను విస్మరిస్తున్నారు "*** అనేవారు. అయితే అనేకమంది శిష్యులు ప్రాధేయపడగా, మొత్తం మీద ఫొటో తీసుకోవడానికి అంగీకరించారు. కాశీలో పేరుపొందిన గంగాధర్ అనే ఫొటోగ్రాఫర్ ఫొటో తీయడానికి వచ్చాడు.

ఫొటో తీయడానికి ముందు **" వ్యూ ఫైండర్ *(View Finder)* "** లో చూస్తే అతనికి బాబా కూర్చున్న స్థలమంతా కనబడుతోంది కానీ .. బాబా కనబడటంలేదు.

గంగాధర్ బాబాను సవినయంగా ప్రాధేయపడి .. **" మీ అనుమతి లేకపోతే ఫొటో రాదు. దయతో అనుమతి ఇవ్వండి "** అని వేడుకున్నాడు. అప్పుడు బాబాగారు **" ఇప్పుడు తీసుకో .. వస్తుంది "** అన్నారు. అప్పుడు మాత్రమే గంగాధర్ కెమెరాలోంచి చూస్తే బాబాగారు ప్రస్ఫుటంగా కనబడ్డారు. పద్మాసనంలో కూర్చుని శాంభవీ ముద్రతో .. శరీరమంతా దైవకాంతితో మెరిసిపోతున్న బాబాఫొటో తీసి గంగాధర్ పరమానంద భరితుడయ్యాడు!

ప్రతిరోజూ సాయంసంధ్యవేళల్లో గంగానది ఒడ్డున పచార్లు చేసి తమ శిష్యులైన **" కృష్ణారామ్ "** గారి ఇంటి వరండాలో విశ్రమించటం లాహిరీ బాబాకు నిత్యకృత్యంగా ఉండేది. ఆ సమయంలో వారు ఎంతోమంది జిజ్ఞాసువులతో ఆధ్యాత్మిక చర్చలు జరిపేవారు.

ఒకసారి ఇలా చర్చలు జరుగుతున్నప్పుడు ఒక పెద్దమనిషి వచ్చి **" మీరు ఏ దేవుడిని ధ్యానిస్తారు? రాముడినా .. శివుడినా .. కృష్ణుడినా .. లేక కాళీనా? "** అని తన సందేహాన్ని

వెలిబుచ్చారు. దానికి బాబాగారు **" నేను శివుడినీ .. కృష్ణుడినీ .. రాముడినీ .. మరి నిన్నూ .. నన్నూ .. అందరినీ ధ్యానిస్తాను "** అన్నారు. ఆశ్చర్యపోవడం ఆ పెద్దమనిషి వంతు అయ్యింది. ఆత్మజ్ఞానుల మాటలు అర్థం చేసుకోవటం అనేది మామూలు విషయం కాదు కదా!

❀ ❀ ❀

గురువు యొక్క ప్రావీణ్యత వారి యొక్క పురోభివృద్ధి శిష్యుల ద్వారా వ్యక్తమవుతుంది. లాహిరీ బాబా తమ జీవిత చరమాంకంలో **యోగాచర్య పండిట్ పంచానన భట్టాచార్య గారిని** క్రియాయోగ వ్యాప్తిని చేయమని కోరారు. గురుదేవుల ఆజ్ఞానుసారం పంచానన భట్టాచార్య గారు **" ఆర్యమిషన్ "** అనే సంస్థను స్థాపించి .. బాబాగారి గీతా వ్యాఖ్యానాలతో సహా అనేక పుస్తకాలను ప్రచురించారు.

బాబా గారి ఇంకొక శిష్యులు ***" స్వామి ప్రణవానందగిరి "*** గారు ***" ప్రణవగీత "*** ను రచించి అందులో భగవద్గీతకు యోగపరంగా వాఖ్యానం చేసారు. వారి ఇంకొక శిష్యులు ***" శ్రీ యుక్తేశ్వర గిరి "*** గారు శ్రీ లాహిరీ బాబా బోధనలను అనుసరించి విజ్ఞాన పూర్వక వాఖ్యానాలతో భగవద్గీతను రచించి బాబాగారి అనుమతితో ప్రచురించారు.

❀ ❀ ❀


శ్రీ మహావతార్ బాబాజీ యొక్క లీలా నాటకంలో లాహిరీ బాబా ఒక భాగం మాత్రమే! ఆ జ్ఞానజ్యోతిని అందరికీ అందజేయాలని.. శ్రీ శ్యామాచరణ్ లాహిరీ గారు రేయింబవళ్ళు కృషి చేసారు. మరి అనేకమంది ఆధ్యాత్మిక పిపాసకులకు ఆ క్రియాయోగ గంగను అందించి తాము అమరులయ్యారు.

1985వ సంవత్సరం సెప్టెంబరు 26వ తేదీ ఆశ్వయుజ శుద్ధ అష్టమి నాడు క్రియాయోగ పద్ధతిలో ధ్యానముద్రలో కూర్చుని తమ సహస్రారంపై దృష్టిని నిలిపిన యోగిరాజ్ ***" శ్రీ శ్యామాచరణ లాహిరీ "*** గారు తమ పాంచభౌతిక శరీరాన్ని విడిచిపెట్టారు. వారి మహాసమాధి అనంతరం కూడా .. శ్రీ లాహిరీ బాబా చాలా మందికి సశరీరంగా దర్శనం ఇచ్చారు!

PYRAMID SPIRITUAL SOCIETIES MOVEMENT
ENERGY WISDOM CONSCIOUSNESS
INDIA
BE A LIGHT UNTO YOURSELF

# " జ్ఞానావతార్ శ్రీ యుక్తేశ్వర్ గిరి "

*సాధారణ గృహస్థధర్మాలను నెరవేర్చుకుంటూనే సాంసారిక జీవితంలోని ధర్మార్థకామమోక్షాలను తగురీతిలో అనుభవిస్తూ* ***" క్రియాయోగసాధన "*** *లో శరీరాన్నీ, మనస్సునూ ఆత్మచైతన్యాన్నీ అద్భుతమైనరీతిలో వికసింప జేసుకున్న* ***" శ్రీయుక్తేశ్వర్ గిరి "*** *గారు .. క్రియాయోగ సాధకులైన* ***" శ్రీ శ్యామాచరణ్ లాహిరి "*** *గారి ప్రియశిష్యులు. శాస్త్రీయ విధానాలతో కూడిన క్రియాయోగాన్ని మానవాళి ఆత్మోద్ధరణకై విశ్వవ్యాప్తం చేసిన ఈ* ***జ్ఞానావతారుని*** *జీవితంలోని కొన్ని ముఖ్య విశేషాంశాలు.*



కలకత్తాలోని గంగానది ఒడ్డున ఉన్న శ్రీరాంపూర్ గ్రామంలో 1855, మే, 10వ తేదీన జమీందారుల కుటుంబంలో జన్మించిన ***" శ్రీ యుక్తేశ్వర్ గిరి "*** గారి అసలుపేరు ***" ప్రియానాథ్ "***. వీరి తల్లి ***" కాదంబినీదేవి "***. వీరి తండ్రి ***" క్షేత్రనాథ్ కరార్ "*** గారు మంచి విద్యావేత్త మరి వ్యాపారవేత్త.

***" ప్రియానాథ్ "*** వారికి ఒక్కడే బిడ్డ కావడంతో అతడిని వారు ఎంతో అల్లారుముద్దుగా పెంచారు. పవిత్ర హృదయురాలు మరి భారతీయత అణువణువునా పుణికిపుచ్చుకున్న తల్లి పెంపకంలో ప్రియానాథ్ .. ప్రేమ, భక్తి, దయ, వినయం వంటి దైవలక్షణాలనూ మరి తండ్రి నుంచి క్రమశిక్షణ, నియమపాలనలతో పాటు వ్యాపారదక్షత వంటి ప్రాపంచిక లక్షణాలనూ పుష్కలంగా పొందాడు.

అతని పరిశీలనా మరి పరిశోధనా దృక్పథం ఎంతగా ఉండేవంటే .. ఒకసారి అతని తల్లి .. ***" ఫలానా చోట దయ్యం వుంది! అటుకేసి వెళ్ళకు "*** అని ఆదేశించింది కానీ ప్రియానాథ్ .. తల్లి వెళ్ళవద్దు అన్న చోటికి నిర్భయంగా వెళ్ళి .. ***" దయ్యం లేదు "*** అని తేల్చుకున్నాడు. ఇలా తార్కికంగా ఉంటే తప్ప అంగీకరించని గుణమే .. అతను ఆధ్యాత్మిక శిఖరాలను ఎక్కడానికి ఎంతో ప్రేరణ అయ్యింది.

❀ ❀ ❀

తగిన వయస్సురాగానే పాఠశాలలో చేరిన **ప్రియానాథ్** ఎంతో తెలివైనవాడుగా పేరు తెచ్చుకుంటూ చదువులో మంచి ప్రతిభను చూపేవాడు. ఉపాధ్యాయులు చెప్పిన ప్రతి ఒక్క అంశాన్నీ లోతుగా తెలుసుకుంటూ .. విడమరచి పరిశీలిస్తూ తార్కికంగా మాత్రమే అంగీకరించేవాడు.

తన కొడుకు తెలివితేటలకు క్షేత్రనాథ్‌గారు ఎంతో సంతోషించే వారు కానీ .. అతని ప్రతిభను చూసి ఎక్కువకాలం ఆనందించక ముందే వారు మృత్యువాత పడ్డారు. తండ్రి మరణానంతరం తల్లి కాదంబినీదేవిగారే .. వ్యాపారాలనూ, జమిందారీనీ కూడా సంబాళిస్తూ ప్రియానాధుడిని జాగ్రత్తగా పెంచి పెద్దచేసారు. ప్రియానాధుడు కూడా వ్యాపారంలో తల్లికి చేదోడు వాదోడుగా సహాయం చేస్తూండేవాడు.

❀ ❀ ❀

***" శ్రీరాంపూర్ "*** లోనే నివాసం ఉన్న ***" గోస్వామి "*** గారి కుటుంబం ఆధ్యాత్మికంగా ఎంతో ఉన్నతంగా మరి ఆదర్శవంతంగా ఉండేది. తరచూ ఆ కుటుంబంతో సాన్నిహిత్యంగా మెలుగుతూ ఉండడం వల్ల .. శాస్త్రయుక్తమైన వారి నడవడిక మరి ఆదర్శవంతమైన వారి ఆధ్యాత్మిక జీవనం ప్రియానాథ్ భవిష్య జీవితానికి పునాదులుగా మారాయి.

గోస్వామిగారింటికి ఒక పండితుడు అప్పుడప్పుడూ వస్తూ పోతూ ఎన్నెన్నో శాస్త్రచర్చలను చేస్తూండేవాడు. గ్రామస్థులెందరో అతని ప్రసంగాలను వినడానికి వచ్చేవారు. మధ్యలో ఎవరికైనా ఏదైనా సందేహం వస్తే మాత్రం .. ఆ పండితుడు లెక్కచేయక పోయేవాడు. పైగా ***" శాస్త్రంలో ఇలా ఉంది కాబట్టి చేయాల్సిందే "*** అంటూ హుంకరించేవాడు.

***" ఆ పండితుని బోధనలన్నీ బట్టీపట్టిన చిలుక పలుకులు "*** అని గ్రహించిన ప్రియానాథ్ అతనికి గుణపాఠం చెప్పాలని తనే వ్రాసిన ఒక సంస్కృత శ్లోకాన్ని అతనికి వినిపించి ***" ఇది ఏ గ్రంథం లోనిదో చెప్పగలరా? "*** అని అడిగాడు. ఏదో గ్రంథం పేరు మరింకేదో వివరణలు చెప్పి దబాయించాలని చూసిన పండితుడికి .. అది తానే వ్రాసిందని చెప్పిన ప్రియానాథ్ ***" బ్రహ్మదేవుని వాక్కు అయినా సరే సరియైన పద్ధతిలో వివరణలేకపోతే అది నా దృష్టిలో నిరర్థకం "*** అని తేల్చి చెప్పాడు.

అంతకాలంగా తమనందరినీ ఒక గొఱ్ఱెలమందలా తలచి తన పాండిత్యాన్నంతా ఒలుకబోస్తున్న ఆ పండితునికి తగిన బుద్ధిచెప్పిన ప్రియానాథ్‌ని ఆ గ్రామ ప్రజలందరూ గౌరవించి మరి ఎన్నెన్నో విషయాలకు అతని వద్దనుంచి వివరణలు పొందేవారు.

❀ ❀ ❀

ప్రాథమిక విద్యాభ్యాసం తరువాత క్రిస్టియన్ మిషనరీ స్కూలులో చదివిన ప్రియానాథ్ ఆ మతానికి చెందిన గ్రంథాలన్నీ అధ్యయనం చేసి అందులోని సత్యాన్నీ, క్రీస్తు సమభావననూ అర్థం చేసుకున్నాడు.

శరీర నిర్మాణశాస్త్రాన్ని బోధిస్తున్న ఒక ప్రొఫెసర్ చెప్పే వివరణలకు సంతృప్తి చెందని ప్రియానాథ్ .. కలకత్తా మెడికల్ కాలేజీలోచేరి రెండుసంవత్సరాల పాటు శరీర ధర్మశాస్త్రాన్నీ , అనాటమీని

విశేషంగా అధ్యయనం చేసి కాలేజీనుంచి బయటకు వచ్చేసాడు. మిగతా కోర్సుకాలంకూడా పూర్తి చేయమని కాలేజీ యాజమాన్యం అడుగగా ఇక తాను తెలుసుకోవాల్సింది అయిపోయిందనీ .. ***" డాక్టర్ "*** అయ్యే ఉద్దేశ్యం తనకులేదనీ .. తేల్చి చెప్పాడు! ***" ఏ విషయాన్నైనా బాగా లోతుగా, నిశితంగా ఆలోచించాలి "*** అన్నది ప్రియానాథ్ దృఢమైన అభిప్రాయం. దానివల్ల మనస్సు నిర్మలమై ఏ పరిస్థితినైనా సమర్థతతో ఎదుర్కోగలిగే ధైర్యాన్ని ఇస్తుందని నమ్మేవారు.

విద్యాభ్యాసానంతరం కుటుంబ వ్యవహారాలూ, జమీందారీ వ్యవహారాలూ చూసుకుంటూ తల్లి ఆదేశంమేరకు వివాహం చేసుకుని ఒక కుమార్తెకు జన్మనిచ్చారు. భార్యాబిడ్డల పట్ల ఎంతో అనురాగంతో జీవితం గడుపుతూ ఉన్నా కూడా అతని మనస్సు మాత్రం ఎప్పుడూ దైవచింతనలోనే ఉండేది. ***" పనిపట్ల శ్రద్ధ, మంచినడవడి, ఆత్మస్థైర్యంతో కూడిన సాధారణ జీవనం గడుపుతూవుంటే పరిపూర్ణ వికాసంతోపాటు జీవితంలో సమతుల్యస్థితి కలుగుతుంది "*** అని నమ్మేవారు ప్రియానాథ్.

21యేళ్ళ వయస్సు వచ్చేసరికి ప్రియానాథ్‌లో సత్యాన్వేషణ పిపాస ఎక్కువైంది. అదేసమయంలో అతనికి క్రియాయోగ పండితులు ***" శ్రీ శ్యామాచరణ్ లాహిరీ "*** మహాశయుల గురించి తెలిసి .. ఇక వారి గురించిన విషయసేకరణను మొదలుపెట్టారు. వారి శిష్యుల ద్వారా లాహిరీ బాబా ఎక్కడ ఉన్నారో తెలుసుకుని .. వెంటనే కాశీకి ప్రయాణమయ్యారు.

బాబాగారి ఇల్లు వెతుక్కుంటూ, వెతుక్కుంటూ వెళ్ళి .. శిష్యుల మధ్య సిద్ధాసనంలో కూర్చుని శాంభవీ ముద్రలో ధ్యానం చేస్తున్న వారి తేజస్సును చూసి ఆశ్చర్యపోయారు. లాహిరీబాబా అతని కళ్ళకు సాక్షాత్తూ పరమశివునిలాగా కనిపించారు. దాంతో అతని మనస్సు ఆనందంతో నిండిపోయి .. పరిపూర్ణ శరణాగతితో వారికి సాష్టాంగ దండప్రణామాలు ఆచరించారు.

లాహిరీ మహాశయులు మెల్లగా కళ్ళుతెరచి .. ప్రియానాధుని గతజన్మలూ, రాబోయే భవిష్యత్తూ చూసి మానవాభ్యుదయం కోసం బాబాజీ రూపంలోని అదృశ్యశక్తి అతడిని తన వద్దకు లాక్కొచ్చి పడవేసిందని అర్థం చేసుకున్నారు. ఉరకలేస్తున్న ఉపనది .. పెద్దనదిలో కలిసిపోయినట్లు గురుశిష్యుల మధ్యవున్న అంతరం ఒక ఆత్మీయ ఆలింగనంతో అంతరించిపోయింది.

1883 ఆగస్టు 19వ తేదీన సనాతనమైన ***క్రియాయోగ*** దీక్షను ప్రియానాధునికి ఇచ్చి .. అఖండ క్రియాయోగ చరిత్రలోనే ఒక నూతన అధ్యాయానికి తెరలేపారు లాహిరీబాబా. చాలా రోజులపాటు గురుదేవుల చెంతనే వుండి క్రియాయోగ ధ్యానం చేసి ఆ తరువాత వారి ఆదేశానుసారం శ్రీరాంపూర్ చేరి .. ఉత్సాహంతో క్రియాయోగవ్యాప్తికి శ్రీకారం చుట్టారు. సాధనలో ఎదురయ్యే సమస్యలకు సమాధానాలను గురువుగారితో ఉత్తరప్రత్యుత్తరాలు జరిపి పొందేవారు.

ఈ క్రమంలో వారు త్రైలింగస్వామి, స్వామి భాస్కరానంద సరస్వతి, రాధాస్వామి గురు మహారాజ్ వంటి సత్పురుషులనూ, ఒక కొండజాతి సాధువునూ కలిసి వారి యొక్క ఆధ్యాత్మిక శక్తికి ఆశ్చర్యపోయాడు.

ప్రియానాథ్ నిరంతరం అంతర్ముఖులై ఉండేవారు కానీ .. కాశీలో లాహిరీ బాబా చెంత ఉన్నప్పుడు మాత్రం వారితో ఎన్నెన్నో విషయాలు చర్చించేవారు. తాము రచించినవి వారికి చూపించి వారినుంచి ఎన్నెన్నో సలహాలు తీసుకునేవారు. లాహిరీ బాబా తమ శిష్యులందరితో కూర్చుని మాట్లాడుతూ ఉన్నప్పుడు .. సామాన్యంగా ఉన్నట్లే అనిపించినా .. వారి నోటివెంట వచ్చే ప్రతి ఒక్కమాట కూడా చాలా సమస్యలకు సమాధానంలా ఉండేది!

కొన్నిసార్లు వారు హాస్యంగా చెప్పినట్లే ఉండేది కానీ .. జాగ్రత్తగా గమనించి అందులోని ఆణిముత్యాల్లాంటి విజ్ఞాన సంపదని ప్రియానాథ్‌గారు చక్కగా గ్రంథస్థం చేసేవారు. ఒక్కొక్కసారి గురుదేవులు తీక్షణంగా మాట్లాడిన మాటల్లో ఉన్న గూడార్థాలను కూడా .. ప్రియానాథ్‌గారు మిగతా శిష్యులకు ప్రశాంతంగా వివరించేవారు. ప్రియానాథ్‌తో పాటు అతని స్నేహితులూ మరి తల్లి కాదంబినీదేవి కూడా శ్రీరామ్‌పూర్ నుంచి కాశీకి వచ్చి లాహిరీబాబాకు శిష్యులైపోవడంతో ఇక ప్రియానాథ్‌కూడా ఎక్కువకాలం గురుదేవులవద్దే గడిపేవారు.

❀ ❀ ❀

ఒకానొకసారి ***" రాము "*** అనే అతని స్నేహితునికి కలరా సోకి ఎంత వైద్యం చేయించినా పరిస్థితి మొత్తం దిగజారిపోయింది. ప్రియానాథ్ ఆందోళనను గమనించిన గురుదేవులు ***" నయం అవుతుందిలే .. ఖంగారుపడకు "*** అన్నారు. కాస్త నిబ్బరంగానే ఉన్న ప్రియానాధ్ ***" రాము చనిపోయాడు "*** అన్న వార్తవిని హతాశుడయ్యాడు. ఉపశమనం కోసం గురుదేవుల వద్దకు చేరగా ***" కూర్చుని ధ్యానం చేయి "*** అన్నారు. అలాంటి సమయంలో అది అసంభవం .. అయినా గురువు వాక్యానుసారం ఆ రాత్రి తెల్లవార్లూ ధ్యానంలో సమాధిమగ్నుడయ్యాడు ప్రియానాథ్. సూర్యోదయానంతరం లాహిరీ బాబా ఒక సీసాలో వేపనూనె ప్రియానాథ్‌కు ఇచ్చి .. రాము నోట్లో ఏడు చుక్కలు వేస్తే తిరిగి బ్రతుకుతాడని చెప్పారు.

***" చనిపోయిన వ్యక్తి తిరిగి బ్రతకడం ఏమిటి? "*** అని ప్రియానాథ్ ఆశ్చర్యపోయినా .. గురుదేవునిపై ఉన్న అచంచల విశ్వాసంతో శవం నోట్లో యేడు చుక్కలు వేపనూనె వేసారు. ఆశ్చర్యంగా రెండు రోజులక్రితం చనిపోయాడని డాక్టర్లచే నిర్ధారించబడిన రాము .. గాఢనిద్రలోంచి లేచినట్లు లేచి కూర్చుని .. మామూలుగా శ్వాస తీసుకోవడం మొదలు పెట్టాడు. వెంటనే రాముని వెంట బెట్టుకుని గురుదేవుల చెంతచేరి వారి పాదాలపై వాలిపోయాడు ప్రియానాథ్.

అనంతరం గురుదేవుల ఆజ్ఞానుసారం క్రియాయోగ సాధనలు చేస్తూనే గీతా సత్సంగాలు మొదలుపెట్టారు. జ్యోతిష్యశాస్త్రం కూడా చక్కగా అధ్యయనం చేసి నక్షత్ర, గ్రహరాసుల స్థితిగతులను గూర్చి ఎంతో జ్ఞానాన్ని పొందారు.

❀ ❀ ❀

1894 సంవత్సరంలో అలహాబాద్‌లోని పవిత్ర ***" త్రివేణి సంగమం "*** లో 12 యేళ్ళకొకసారి జరిగే ***" కుంభమేళా "*** లో .. పాల్గొనడానికి వెళ్ళిన ప్రియానాథ్ గంగానదిలో మునిగి స్నానంచేసి బయటకు వస్తూ .. తననెవరో పిలిచినట్లయి అక్కడే ఆగిపోయాడు. ***" ఆ పిలుపు అక్కడే ఉన్న ఒక గుడారం నుంచి వస్తోంది "*** అని గుర్తించి లోపలికి వెళ్ళాడు.

ఆ గుడారంలో దేదీప్యమానమైన తేజస్సుతో నిండిపోయి ధ్యానంలోవున్న భగవదవతార మూర్తిని చూసి .. హృదయాంతరాళం నుంచి పొంగివస్తున్న అనిర్వచనీయమైన భక్తిపారవశ్యంతో వారికి సాష్టాంగదండప్రణామం ఆచరించారు. వారే క్రియాయోగ గంగను దివినుంచి భువికి దింపిన అవతారపురుషులు ***" శ్రీ బాబాజీ మహరాజ్ "*** గారు! తమ గురుదేవులు లాహిరీ బాబా చెప్పినట్లు వయస్సునూ, మృత్యువునూ జయించిన ఆ 400 యేళ్ళ వయస్సున్న బాబాజీ దివ్యస్వరూపం .. ప్రియానాథ్‌ను మైమరపింపజేసింది. తనను పిలిచింది వారే అన్న విషయం అర్థం అయ్యి .. వినయంతో బాబాజీకి పాదసేవ చేస్తూ చెంతన కూర్చున్నారు ప్రియానాథ్.

గురువువద్ద జ్ఞానం పొందడానికి ఒక శిష్యునికి కావాల్సిన ***" ప్రణిపాతేన "***, ***" పరిప్రశ్నేన "***, ***" సేవయామి "*** అన్న మూడు దివ్యలక్షణాలను ప్రియానాధునిలో పుష్కలంగా చూడగలిగిన బాబాజీగారు .. ***" నీ గురుదేవులు లాహిరీబాబా వ్యాఖ్యలకు అనుగుణంగా నువ్వు గీతకు వ్యాఖ్యానం వ్రాసావుకదా! "***

***" ఇప్పుడు నేను చెప్పిన విధంగా ప్రాక్ పశ్చిమ వేదాంతాలను మేళవించి పాశ్చాత్యులకు కూడా ఉపయోగపడే విధంగా నువ్వు రచనలు చేయాలి. ఇకనుంచి ' యుక్తి ' తో జీవితాన్ని గడిపే ' ఈశ్వర్ ' లా నువ్వు ' యుక్తేశ్వర్ ' అని పిలువబడతావు .. మరి ' జ్ఞానావతార్ ' గా ఆధ్యాత్మిక లోకంలో ప్రసిద్ధి చెందుతావు. నేను నీకు అప్పగించిన పని పూర్తికాగానే నేనే నీ దగ్గరికి వచ్చి దానిని చూస్తాను "*** అని చెప్పి ప్రియానాథ్ చూస్తూండగానే అంతర్ధానమయ్యారు.

వారి దర్శనభాగ్యానికి ఎంతో సంతోషించిన ***" యుక్తేశ్వర్ "*** కాశీకి బయలుదేరి వెళ్ళి గురుదేవులను చేరి విషయమంతా వివరించారు. భవిష్యత్తులో ఈ క్రియాయోగాన్ని ***" యుక్తేశ్వర్ "*** విశ్వవ్యాప్తం చేయగలడని లాహిరీబాబా కూడా సంతుష్టులయ్యారు. ఇక అప్పటినుంచి ***" యుక్తేశ్వర్‌గిరి "*** గా అతనిని సంబోధించడం మొదలు పెట్టారు.

❀ ❀ ❀

***" శ్రీరాంపూర్ "*** లో ఉన్న తమ ఇంటిని ఆశ్రమంలా చేసి .. అక్కడే బాబాజీగారి బోధనలతో కూడిన గ్రంథరచనను మొదలు పెట్టారు ***" యుక్తేశ్వర్ "***. ప్రతిరోజూ అర్ధరాత్రి నిశ్శబ్ద ఘడియల్లో తమ రచనను సాగించేవారు. ఆ రచనను పూర్తిచేసిన తరువాత దానిని లాహిరీ బాబాకు చూపించి ఎలాగైనా బాబాజీ వద్దకు చేర్చమని ప్రాధేయపడ్డారు.

వెంటనే లాహిరీబాబా **" యుక్తేశ్వర్ "** తలపై తనచేతిని ఉంచి ఆశీర్వదించారు. అంతే! కళ్ళు మిరుమిట్లు గొలుపుతూ అద్భుతమైన కాంతి రూపంలో మహావతార్ బాబాజీగారి దివ్య స్వరూపం గుమ్మంలో ప్రత్యక్ష్యం అయ్యి **" నీకు ఇచ్చిన మాటప్రకారం నేను వచ్చాను "** అంటూ **" యుక్తేశ్వర్ "** తనకు సమర్పించిన రచనను పరిశీలించి ఎంతో ప్రసన్నులై .. చిరుమందహాసంతో నర్మగర్భితంగా లాహిరీ బాబావైపు చూసి నవ్వారు బాబాజీ. బాబాజీ తనకు అప్పజెప్పినపని పూర్తి అయ్యిందనీ, ఇక తాను ఈ లోకంనుంచి నిష్క్రమించాల్సిన సమయం ఆసన్నమైందనీ లాహిరీ బాబాకు బాబాజీ ఆజ్ఞ సందేశంగా వచ్చింది.

❊ ❊ ❊

1895 సెప్టెంబర్ 26వ తేదీ లాహిరీ మహాశయులు మహాసమాధి చెందిన తరువాత .. **" శ్రీ యుక్తేశ్వర్ గిరి "** గారే సమాజంలో వున్న అన్ని వర్గాల ప్రజలకూ, అన్ని ధర్మాలప్రజలకూ క్రియాయోగ దీక్షలను ఇవ్వడం మొదలుపెట్టారు. ఎన్నెన్నో సంకుచిత భావాలతో నిండివున్న ఆనాటి హిందూ సమాజం .. క్రియాయోగ సాధనద్వారా మెల్లిమెల్లిగా విశాల దృక్పథాలను పెంపొందించుకుంటూ ఆత్మపరిమాణ క్రమమంలో ముందుకు సాగడం మొదలుపెట్టింది.

ఆనాటి సమాజం **" శ్రీ యుక్తేశ్వర్ గిరి "** గారి గీతాసభల శాస్త్రంలోని యోగ రహస్యాలను విని క్రొత్త ఆలోచనలను ఆహ్వానించసాగింది. ఇలా గీతాసభలను విస్తృతంగా ఏర్పాటు చేయడంలో **" మోతీలాల్ మహోపాధ్యాయ "** అనే బ్రాహ్మణుడు వారికి ఎంతో సహకరించేవారు.

కాశీలోని సంస్కృతకళాశాలలో ఏర్పాటు చేయబడిన గీతాసభలో ప్రాక్ పశ్చిమదేశాలకు చెందిన ఎందరెందరో మేధావులు **" శ్రీ యుక్తేశ్వర్ గిరి "** గారి నుంచి జాలువారిన జ్ఞానామృత బిందువులను గ్రోలి ఎంతో ఆనందించారు. స్వామి వివేకానందులకు సమకాలీకులు అయిన **" శ్రీ యుక్తేశ్వర్ గిరి "** గారు మాతృదేశంపట్ల కూడా ఎంతో గౌరవభావాన్ని చూపేవారు.

❊ ❊ ❊

1910లో **" శ్రీ యుక్తేశ్వర్ గిరి "** గారు కాశీలోని గంగానది ఒడ్డున ఉన్న రాణామహల్‌లో ఉన్నప్పుడు .. లాహిరీబాబా యొక్క ఇంకొక శిష్యుడైన **" స్వామి కేవలానందజీ "** గారి వద్ద క్రియాయోగ దీక్షతీసుకున్న **" ముకుందలాల్ "** వచ్చి వారినికలిసారు. దాంతో ముకుందలాల్ యొక్క గురు అన్వేషణ ముగిసి **" యుక్తేశ్వర్ "** సహచర్యంలో కాలక్రమేణా **" యోగానంద పరమహంస "** గా ప్రసిద్ధులయ్యారు.

శ్రీరాంపూర్‌లోనే తమ సాంప్రదాయ విద్యను పూర్తిచేసిన యోగానందులు తన గురుదేవులైన యుక్తేశ్వర్ గిరి గారి ఆజ్ఞానుసారం సత్సంగ బాధ్యతలను స్వీకరించి .. 1916లో జపాన్‌కు, 1920లో అమెరికాకు వెళ్ళి .. బాబాజీతో సహా తన గురుపరంపరా విశిష్ఠతను విశ్వవ్యాప్తం చేసారు.

క్రియాయోగ వ్యాప్తిలో ఉన్నత శిఖరాలను అందుకున్న శ్రీ యుక్తేశ్వర్ గిరి గారు ఆచరణాత్మక జ్ఞానాన్ని కూడా విశేషంగా ప్రదర్శిస్తూ అందరికీ ఆదర్శంగా వుండేవారు. తమ శిష్యులతో మరి స్నేహితులతో కూడా ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యవహరిస్తూ వారందరి యోగక్షేమాలను స్వయంగా చూస్తుండేవారు. ఎప్పుడూ శాంభవీ ముద్రలోనే కూర్చుని ధ్యానం చేసుకుంటూ .. ఎవరైనా తనను కలవడానికి వచ్చినప్పుడు .. వారి కళ్ళలోకి తదేకంగా చూసేవారు.

1935లో అమెరికాలో గీతాసభలను నిర్వహించి భారతదేశం తిరిగివచ్చిన యోగానంద పరమహంస .. గురుదేవులతో ఎంతో సమయం గడిపి వారినుంచి అనంతమైన జ్ఞానాన్ని పొందారు. భవిష్యత్తులో క్రియాయోగ వ్యాప్తికి యోగానంద చేపట్టాల్సిన ప్రణాళికల గురించి విస్తృతంగా చర్చించి అతనికి మార్గనిర్దేశనం చేసారు!

జ్ఞానావతార్ శ్రీ యుక్తేశ్వర్ గిరి గారు 1936, మార్చి 9వతేదీన పూరీ నగరంలోని గంగానది ఒడ్డున తమ 81ఏట మహాసమాధి చెందారు. ఆ తరువాత జూన్ 19వ తేదీన మధ్యాహ్నం 3.00 గంటలకు పరమహంస యోగానందగారు ముంబయిలోని ఒకానొక హోటల్‌లో కూర్చుని ధ్యానం చేసుకుంటూంటే అతనికి గదిలో ఒక పెద్దకాంతి కనిపించింది. కళ్ళు తెరిచి చూసేసరికి ఎదురుగా తన గురుదేవులు శ్రీయుక్తేశ్వర గిరి గారు ప్రత్యక్షమై వున్నారు!


సరిగ్గా నెలరోజులక్రితం మహాసమాధి చెంది ఇసుకలో పూడ్చిపెట్టబడిన గురువుగారి శరీరం మళ్ళీ ఇక్కడ సజీవంగా దర్శనం ఇవ్వడం యోగానందులను సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తింది! ఇలా జ్ఞానావతారులైన గురువులు ఈ లోకాన్ని విడిచివెళ్ళిన తర్వాత కూడా తమ శిష్యులకు ప్రతి క్షణం మార్గనిర్దేశనం చేస్తూంటారు!

❀ ❀ ❀

అనాదిగా అనేకమంది అవతారపురుషులూ, ప్రవక్తలూ మానవోద్ధరణకోసం దైవమార్గాన్ని చూపడానికి ఈ భూమిమీద జన్మతీసుకుంటూ .. తమ బోధనల ద్వారా వారికి మృత్యువునుంచి అమృతత్వానికి దారిచూపుతూ ఉంటారు. **“ జ్ఞానావతార్ ”** అని అందరిచే గౌరవంగా పిలిపించుకోబడిన **“ శ్రీ యుక్తేశ్వర్ గిరి ”** గారు కూడా క్రియాయోగ గంగను .. సమస్త మానవాళికి చేరువ చేయడంలో విశేషకృషిని చేసి .. ఆధ్యాత్మిక వినువీధిలో ఒక తేజో నక్షత్రంలా నిలిచారు!

# " శ్రీ పరమహంస యోగానంద "

ఆధ్యాత్మిక జగత్తులో అత్యంత ప్రముఖ గురువుగా పేరు పొందిన ***" శ్రీశ్రీ పరమహంస యోగానందులు "*** క్రియాయోగ వ్యాపకులు శ్రీశ్రీశ్రీ మహావతార్ బాబాజీ శిష్య పరంపరకు చెందినవారు. బాబాజీ శిష్యులైన శ్రీ యుక్తేశ్వర్ గిరి గారికి శిష్యులుగా చేరి .. జ్ఞానసంపన్నులుగా మారిన వీరు తమ గురుదేవులు ఇచ్చిన ప్రత్యేక సూచనలను ఒక పవిత్రమైన బాధ్యతగా స్వీకరించి .. తమ ఆధ్యాత్మిక సేవాకార్యక్రమాలను విశ్వవ్యాప్తం చేసారు. ఉన్నత లోకాలకు చేరిన తమ గురుదేవులను మళ్ళీ సశరీరంగా ప్రత్యక్షం చేసుకుని .. వారి ద్వారా అందించబడిన సూక్ష్మలోకాల సమాచారాన్ని మానవాళికి అందించారు.



***పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని గోరఖ్‌పూర్‌లోని ఒక బెంగాలీ సంపన్న కుటుంబంలో 1893 జనవరి 5వ తేదీన జన్మించారు .. " పరమహంస యోగానంద ".***

ప్రచండ క్రియాయోగ సాధకులు శ్రీ లాహిరీ మహాశయులకు ప్రియశిష్యులు అయిన యోగానందుల తల్లి తండ్రులు ***శ్రీ భగవతీ చరణ్ ఘోష్ దంపతులు*** ఎంతో సాధుస్వభావులు మరి దయాశీలులు. వీరు తమ ఎనిమిది మంది సంతానంలో నాలుగోవాడిగా జన్మించిన యోగానందులకు ***" ముకుందలాల్ ఘోష్ "*** అని పేరు పెట్టి .. ఎంతో ప్రేమతో, క్రమశిక్షణతో పెంచారు.

❀ ❀ ❀

బెంగాల్ రైల్వే శాఖలో ఉపాధ్యక్ష పదవిలో పనిచేస్తూన్న ***" భగవతి "*** గారు .. ఒక సందర్భంలో తమ క్రిందిస్థాయిలో పనిచేసే ఒకానొక ఉద్యోగి ద్వారా శ్రీ లాహిరీ మహాశయులను కలుసుకోవడం తటస్థించింది. ఆ మహాగురువుల దివ్యదర్శనం తరువాత జన్మించిన ***" ముకుందలాల్ "*** ని వారు బాబా ఆశీస్సులుగానే భావించారు!

చిన్నారి ముకుందుడి స్మృతిపథంలో .. తాను ఏదో జన్మలో ఒకానొక హిమాలయ యోగిగా జ్ఞాపకం వస్తూండేది. ఆ జ్ఞాపకాల మెరుపులే .. అతనికి తన భవిష్యత్తు కూడా గోచరింప చేసేవి. అయితే పసితనపు నిస్సహాయత వల్ల తన మనస్సులోని అలజడిని వెళ్ళబోసుకోలేక ఎంతో సంఘర్షణను అనుభవించే వారు. అతని బాధ చూసి గాభరాపడ్డ అమ్మ, నాన్న అతడిని ఎత్తుకుని .. లాహిరీ మహాశయులు దగ్గరకు తీసుకువెళ్ళారు.

చిన్నారి ముకుందుడిని ఆశీర్వదించిన గురుదేవులు అతడి తల్లితో ***" ఖంగారు పడకు తల్లీ! .. నీ కుమారుడు ఒక గొప్ప యోగజాతకుడు! అతడు భవిష్యత్తులో లక్షలాది మందిని ఆత్మ***

***యోగుల్లా మార్చి .. వారిని దైవసన్నిధికి చేర్చబోయే గొప్ప యోగీశ్వరుడు అవుతాడు"*** అంటూ ఆశీర్వదించారు.

ఆ తరువాత ఒకసారి ముకుందుడికి జబ్బు చేసినప్పుడు కూడా వారి ఇంట్లో ఒక గోడమీద తగిలించి ఉన్న లాహిరీ బాబా ఫోటో నుంచి విభూతి అతనిపై రాలిపడటం మరి అతను వెంటనే కోలుకోవడం జరిగింది.

ఆ తరువాత కొన్నాళ్ళకు అతనికి ఒక స్ఫూర్తివంతమైన ఆధ్యాత్మిక దర్శనం కలిగింది. ***" కళ్ళు మూసుకుని ఉన్నప్పుడు ఉండే చీకటి వెనుక ఏం ఉంటుంది? "*** అన్న ఒక ఆలోచన అతని మనస్సులోకి వచ్చి .. దానిని అదేపనిగా శోధించడం మొదలుపెట్టాడు. ఆ చీకటి లోతుల్లోకి అలా వెళ్ళగా వెళ్ళగా .. అతని అంతర్దృష్టిలో బ్రహ్మాండమైన మెరుపులాంటి వెలుగు కనిపించి .. ఆ వెలుగులో కొండగుహల్లో ధ్యానముద్రలో కూర్చుని వున్న యోగుల దివ్యదేహాలు కనిపించాయి.

ఆశ్చర్యపోయిన ముకుందుడు ***" ఎవరు మీరు? "*** అని గట్టిగా అడిగాడు.

***" మేము హిమాలయ యోగులం "*** అన్నారు వారు. ***" ' హిమాలయాలకు వెళ్ళాలి ' అనీ, ' మీలాగే కావాలి ' అనీ నేను ఎంతో ఉవ్విళ్ళూరుతున్నాను. నన్ను కూడా మీతో తీసుకెళ్ళరూ? "*** అంటూ వారిని కోరాడు ముకుందుడు.

***" తథాస్తు "*** అంటూ మెల్ల మెల్లగా ఆ దృశ్యం కనుమరుగై, అతని చుట్టూ అనంతమైన కాంతి వలయాలు వలయాలుగా పెరిగిపోయి .. ఈశ్వరాకారంలోని ఆ కాంతిలో తాను కూడా కలిసిపోయిన అనుభూతి చెందాడు. ఆ తరువాత ఎంతో సేపటికి గానీ .. అతడు ఆ పారవశ్యంలోంచి బయటపడలేక పోయాడు!

❋ ❋ ❋

చిన్నారి ముకుందుడికి పదకొండవయేట మాతృవియోగం సంభవించడంతో అతడు మరింత ఒంటరివాడై .. దైవత్వానికి ఇంకా దగ్గరయ్యాడు. వాళ్ళ అమ్మ చనిపోకముందు వ్రాసి పెట్టిన ఉత్తరం ఒకటి అతని చేతికి అంది .. అందులో తన భవిష్యత్తు గురించి లాహిరీ మహాశయులు చెప్పిన సమాచారం చదివాడు. అంతే! అతనికి తన జీవితగమ్యం ఏమిటో తెలిసింది!

ఈ క్రమంలో అతడు అనేక మంది సాధుసన్యాసులను కలవడం మరి వారి నుంచి ఎంతో జ్ఞానపరమైన సమాచారాన్ని పొందడం జరిగింది. ముకుందుడికి తన పదిహేడవయేట ఒరిస్సా రాష్ట్రంలోని పూరి సముద్రం ఒడ్డున వున్న క్రియాయోగ సాధకులు జ్ఞానావతారులు ***" శ్రీశ్రీ యుక్తేశ్వర్ గిరి "*** గారి సాన్నిధ్యం లభించింది. జ్ఞానావతారులైన స్వామి యుక్తేశ్వర్ గిరి గారు .. క్రియాయోగ

పరంపరలోని శ్రీ లాహిరి మహాశయుల శిష్యులు. గురుదేవులతో ముకుందుడి సమాగమనం చాలా చిత్రంగా జరిగింది.

❀ ❀ ❀

ఒకానొకసారి కలకత్తాలో వున్న బెంగాలీ బస్తీలో సరుకులు కొనడానికి వెళ్ళిన ముకుందుడు .. అక్కడే సందు చివరన కాషాయవస్త్రాలు ధరించి ఏసుక్రీస్తులా ప్రసన్నవదనంతో నిలబడి జ్ఞాన స్వరూపుల్లా వెలిగిపోతున్న ***" యుక్తేశ్వర్ గిరి "*** గారిని చూసాడు. అంతే తన దారిన తాను వెళ్ళబోతూన్న ముకుందుడు అప్రయత్నంగా ఆగిపోయి ***" గురుదేవా! "*** అంటూ ఆత్రంగా వెళ్ళి అతని పాదాలపై పడిపోయాడు.

***" నా తండ్రీ! వచ్చేసావా?! "*** అంటూ .. ఆయన కూడా ఆనందంతో ముకుందుడిని లేవనెత్తి ***" ఎన్నేళ్ళుగా కాచుకుని ఉన్నాను బాబూ నీ కోసం! "*** అంటూ అతడిని గాఢంగా ఆలింగనం చేసుకున్నారు! ఎంతోసేపు ఇద్దరూ మౌనంలో ఆత్మానందాన్ని అనుభవించిన తరువాత ***" రా ముకుందా! నా ఆశ్రమాలూ, నా సర్వస్వమూ నీకు ఇచ్చేస్తాను! "*** అన్నారు యుక్తేశ్వర్ గిరి గారు.

***" స్వామీ .. నేను వచ్చింది కేవలం జ్ఞానం మరి దైవసాక్షాత్కారం కోసం మాత్రమే! నేను మీ దగ్గర పొందగోరే నిధులు అవే! "*** అంటూ ముకుళిత హస్తాలతో ఆర్ద్రంగా విన్నవించుకున్నాడు ముకుందుడు.

***" నీకు బేషరతుగా నా ప్రేమను అందిస్తాను! నువ్వు కూడా నాకు నీ ప్రేమను నాకు అందిస్తావా? "*** అంటూ .. అమూల్యమైన వాక్కులతో, నమ్మకం నిండిన కళ్ళతో తన శిష్యుడిని ప్రశ్నించారు గురుదేవులు.

***" తప్పకుండా గురుదేవా "*** అంటూ .. మనసా వాచా కర్మణా జ్ఞానావతారులకు సంపూర్ణ శరణాగతితో .. శిష్యుడైపోయాడు ముకుందుడు.

❀ ❀ ❀

***శ్రీ యుక్తేశ్వర్*** గారు అందరిలాగానే మానవమాత్రులుగా జన్మించినప్పటికీ .. పరమేశ్వరుడితో తాదాత్మ్యం సాధించారు. నరుడు నారాయణుడు కావడానికి దాటరాని అడ్డంకి ఏదీ ఆయనకు కనిపించలేదు. వారి పాదస్పర్శ సోకినప్పుడల్లా ఒకానొక రకమైన ఆధ్యాత్మిక ఆకర్షణతో ముకుందుడి ఒళ్ళు పులకరించిపోయేది.

తన దగ్గర వున్న శిష్యుల్లోని చాలామంది వైద్యులకు ఆయన ***" శరీర ధర్మ శాస్త్రం చదివిన వారు ఇంకా ముందుకు సాగి ఆత్మజ్ఞానాన్ని శోధించాలి; శరీర యంత్రానికి సరిగ్గా వెనకాల ఆధ్యాత్మిక తంత్రం ఒకటి దాక్కుని ఉంది "*** అని పదే పదే చెప్పేవారు. పాశ్చాత్య దేశాల వారి

అభ్యుదయశీలత, ప్రతిభాసంపత్తి మరి ఆరోగ్యప్రదమైన పంథాలనూ మెచ్చుకుంటూనే ప్రాచ్యదేశాల ఘనతను నిలిపిన ధార్మిక ఆదర్శాలను ఆయన ప్రశంసించేవారు.

***" విదేశాలకు వెళ్ళినప్పుడు వారి అహంకారం మీద మొరటుగా తీసే దెబ్బలను వారు హర్షించరు. రాజీపడదానికి అనుకూలమైన నిదానం, ఓరిమి .. సమృద్ధిగా లేనిదే ఏ గురువు కూడా భారతదేశ సందేశాన్ని పాశ్చాత్య దేశాల్లో వ్యాప్తి చెయ్యలేడు "*** అని ఖచ్చితంగా చేప్పేవారు.

❋ ❋ ❋

ముకుందుడు .. దాదాపు పది సంవత్సరాల పాటు ***" పూరి "*** .. ***" శ్రీరామ్‌పూర్ "*** లోని ఆశ్రమాలల్లో గురువుగారి శిష్యరికం చేస్తూనే.. కలకత్తా యూనివర్సిటీ నుంచి 1915లో గ్రాడ్యుయేషన్ పట్టా కూడా పుచ్చుకున్నాడు. ఆ తరువాత తన గురుదేవులతో కలిసి కాశ్మీర్, మరి హిమాలయ యాత్ర చేసి ఎందరెందరో సాధువులను కలిసి ఎన్నెన్నో దివ్యానుభూతులను పొందాడు!

1915 జూలై నెలలో ***" శ్రీరామ్‌పూర్ "*** ఆశ్రమం లోనే ముకుందుడికి సన్యాసదీక్ష ఇచ్చారు గురుదేవులు. లాంఛన ప్రాయమైన కర్మకాండలు అన్నీ ప్రక్కనబెట్టి అతి నిరాడంబరంగా అతడికి సన్యాసదీక్ష ఇచ్చి .. ముకుందుడినే తనకు ఇంకో క్రొత్త పేరు ఎన్నుకోమన్నారు.

అప్రయత్నంగా ***" యోగానంద "*** అన్నపేరు ముకుందుని నోటినుంచి రాగానే విని ఒక్క క్షణం ఆలోచించారు గురుదేవులు

***" తథాస్తు! ఈ పేరుకు అర్థం .. ' యోగం ' ద్వారా పొందే ఆనందం. ఇక నుంచీ ' ముకుందలాల్ ఘోష్ ' అన్న నీ కుటుంబ వ్యవహార నామం విడిచిపెట్టి .. నిన్ను సన్యాసాశ్రమ సంప్రదాయంలో ' గిరి ' శాఖకు చెందిన ' యోగానందుడి 'గా పిలుస్తారు "*** అని తమ ఆశీస్సులు అందజేసారు.

ఆ తరువాత కొన్నాళ్ళు యోగానందులకు పాశ్చాత్య దేశాలలో తాను చేయవలసిన ఆధ్యాత్మిక జ్ఞాన విస్తరణ గురించిన అంతర్దర్శనాలు కనిపించాయి. దానికి తగ్గట్టుగానే అతనికి అమెరికాలోని ***" మత ధార్మిక ఉదారవాదుల అంతర్జాతీయ మహాసభ "*** నుంచి భారతదేశ ప్రతినిధిగా రమ్మని కోరుతూ ఆహ్వానం కూడా వచ్చింది.

గురుదేవుల అనుమతి తీసుకుని .. 1920లో ***" బోస్టన్ "***కు ప్రయాణమై వెళ్ళి అక్టోబర్ 6వ తేదీన అమెరికాలో తన మొట్టమొదటి జ్ఞాన ప్రసంగం చేసారు ***" యోగానంద "***. అలా చాలా సంవత్సరాల పాటు అమెరికాలోని చాలా ప్రదేశాలలో ఆధ్యాత్మిక ప్రసంగాలు చేస్తూ ఎందరెందరో ఆత్మలను భగవత్ సాన్నిధ్యానికి చేర్చడానికి ఎంతో కృషి చేసారు!

అంతేకాక ***" సాంగ్స్ ఆఫ్ ది సోల్ (ఆత్మగీతాలు) "*** అన్న కవితా సంపుటిని కూడా ఆంగ్ల భాషలో వ్రాసి .. న్యూయార్క్ కళాశాల అధ్యక్షులు ఫ్రెడరిక్ B. రాబిన్‌సన్ గారిచే ఆవిష్కరింప

జేసారు. కాలిఫోర్నియా, లాస్ ఏంజెలిస్, వాషింగ్టన్ వంటి ఎన్నెన్నో ప్రదేశాలలో వేలాది మంది శ్రోతల సమక్షంలో తానుచేసిన ఆధ్యాత్మిక ప్రసంగాలకు సంబంధించిన సమాచారాన్ని ఫోటోలతో సహా ఎప్పటికప్పుడు వారు గురుదేవులకు పంపిస్తూ వుండేవారు. ***" విస్పర్స్ ఫ్రమ్ ఎటర్నిటీ "*** అన్న ప్రార్థనలూ, ఆత్మావలోకనలతో కూడిన పుస్తకాన్ని రచించి అమెరికా ప్రజలకు అంకితమిచ్చారు యోగానంద.

మళ్ళీ 1935 ఆగస్టు 22 వ తేదీన భారతదేశం తిరిగి వచ్చిన యోగానందులు .. ***" శ్రీరామ్‌పూర్ ఆశ్రమం "*** లో ఉన్న గురుదేవులను దర్శించుకుని వారి ముందు మోకరిల్లి తమ అవ్యక్త ప్రేమనూ, ధన్యవాదాలనూ అర్పించుకున్నారు.

ఆ తరువాత దక్షిణ భారతదేశ యాత్ర చేస్తూ తమ క్రియాయోగ జ్ఞాన విస్తరణను చేపట్టారు. ఆ సమయంలోనే జ్ఞానావతారులైన గురుదేవులు అతనితో ఆశీర్వాద పూరకమైన కొన్ని మాటలు పలికి అతనికి ***" పరమహంస"*** అనే బిరుదును ప్రసాదించారు.

ఆ తరువాత కొన్నిరోజులకే .. ***" పరమహంస యోగానంద "*** అలహాబాద్‌లో జరిగిన **కుంభమేళా** కు వెళ్ళిన సమయంలో గురుదేవులు తమ దేహత్యాగం చేయడం జరిగింది. ***" వెంటనే బయలుదేరి రండి "*** అన్న టెలిగ్రామ్‌ను చూసి ఆశ్రమానికి వచ్చిన యోగానందులు .. ఊహించలేనంత సజీవంగా .. పద్మాసనంలో కూర్చుని ధ్యానముద్రలో ఉన్న గురుదేవులను చూసి ***" బెంగాల్ సింహం వెళ్ళిపోయింది "*** అంటూ వాపోయారు. ***" ఇక గురుదేవులు ఎన్నటికీ నా కంటికి కనిపించరు "*** అన్న ఆలోచన అతడిని నిలువెల్లా బాధతో నింపి వేసింది.

❋ ❋ ❋

ఆ తరువాత కొన్నాళ్ళకు ఒకరోజు యోగానందులు బొంబాయిలోని ***" రీజెంట్ "*** హోటల్‌లోని గదిలో కూర్చుని గురుదేవుల ఆలోచనల చింతనలో దుఃఖితుడై ఉండగా .. అతనికి ఒక అవతారమూర్తి యొక్క దివ్యమంగళ రూపం ఉజ్వల దీప్తితో దర్శనం ఇచ్చింది!

ఎదురుగా రక్తమాంసాలతో నిండిన ***శ్రీ యుక్తేశ్వర్*** గారి భౌతిక విగ్రహాన్ని చూసేసరికి .. ఆనంద తరంగాలు అతనిని ఉక్కిరి బిక్కిరి చేసాయి:

***" నన్ను వదిలి ఎందుకు వెళ్ళిపోయారు గురుదేవా? "*** అంటూ బేలగా ప్రశ్నించిన యోగానందను ఊరడిస్తూ .. అతనికి చక్కటి జ్ఞాన సందేశాన్ని అందించారు యుక్తేశ్వర్‌గిరి గారు.

" భౌతిక కర్మను అనుభవిస్తూండే మానవులకు సహాయం చెయ్యడానికి భగవంతుడు భూమి మీదకు ప్రవక్తలను పంపినట్లే .. ఒకానొక సూక్ష్మలోకంలో రక్షకుడిగా సేవచెయ్యి అని భగవంతుడు నన్ను ఆదేశించాడు. అక్కడి వాళ్ళంతా స్పృహతో భూమిమీద భౌతిక కాయాన్ని విడిచి వెళ్ళిపోవడానికి వీలు కలిగించే ధ్యానోపార్జితమైన శక్తిని సాధించిన వాళ్ళే! కానీ **' సవికల్పసమాధి '** నుంచి వచ్చిన

వారు .. సూక్ష్మకర్మలేశాలు అన్నింటి నుంచి కూడా తమ ఆత్మలను విముక్తం చేసుకుంటే కానీ వారు **' నిర్వికల్ప సమాధి '** ని పొందలేరు. ఉన్నత తలమైన ఆ **నిర్వికల్పసమాధి** ని పొందినప్పుడే వీళ్ళంతా ముక్తినీ, మోక్షాన్నీ పొందగలుగుతారు.

***" ఇప్పుడు నేను రక్షకుడిగా వున్న లోకంలో కారణ, మహాకారణ లోకాల నుంచి వచ్చిన గొప్ప గొప్ప సిద్ధ పురుషులు ఉన్నారు. ఇలాంటి వాళ్ళంతా వీరందరికీ జ్ఞానాన్ని కలుగజేయడమే నా పని "*** అంటూ సూక్ష్మలోకాల సమాచారాన్ని విపులంగా యోగానందులకు తెలియజేసారు గురుదేవులు.

అంతేకాక ***" యోగానందా! నా జీవితాన్నీ, మరణాన్నీ, పునరుత్థానాన్నీ గురించిన సత్యాలను నేను ఇప్పుడు నీకు చెప్పాను. నా కోసం నువ్వు బెంగపెట్టుకోకు. అంతకంటే ముఖ్యం .. ' దేవుడి కల ' అయిన ఈ భూలోకం నుంచి సూక్ష్మశరీరాచ్ఛాదితమైన ఆత్మలు ఉండే మరో భగవత్ స్వప్న గ్రహానికి వెళ్ళిన నా వృత్తాంతాన్ని ప్రతి చోటా చాటు! అది ప్రపంచంలో ఉన్న దుఃఖపీడిత మరణభీతితో ఉన్న వారి హృదయాలలో క్రొత్త ఆశను చిగురింపజేస్తుంది "*** అంటూ సూచించారు.

యోగానందులను ఆశీర్వదించి ***" నువ్వు కూడా నిర్వికల్ప సమాధి ద్వారంలోకి ప్రవేశించి .. నన్ను ఎప్పుడు పిలిస్తే అప్పుడు .. ఇప్పటిలాగే సశరీరంగా నీ దగ్గరకు వస్తాను "*** అని చెప్పి అంతర్ధానమయ్యారు.

గురుదేవుల పునరుత్థాన జ్ఞాన సందేశాన్ని విన్న యోగానందులు ఎంతో తృప్తినీ, ఆత్మశాంతినీ పొందారు. అటు తరువాత శ్రీ యోగానంద 1936 సంవత్సరాంతంలో అమెరికా తిరిగి వచ్చి తన జీవితకాలం చివరివరకూ క్రియాయోగ వ్యాప్తినీ, గురుదేవుల జ్ఞాన సందేశాలనూ అమెరికా అంతటా విశేషంగా ప్రచారం గావించారు.

***" సెల్ఫ్ రియలైజేషన్ ఫెల్లోషిప్*** (SRF) **"** సంస్థ ద్వారా, ***" యోగదా సత్సంగ్ సొసైటీ "*** ల ద్వారా ఆధ్యాత్మిక జ్ఞాన విస్తరణకు క్రియాయోగ వ్యాప్తికి ఎనలేని సేవ చేసారు.

మానవజాతినంతటినీ తమ విస్తృతమైన ఆత్మగానే గౌరవించిన వీరు .. భవిష్యత్ తరాలకోసం అనంతమైన జ్ఞాన భాండాగారాన్ని కూడా పదిలపరచి ఉంచారు. వీరు రచించిన ***" Man's Eternal Quest " .. " The Divine Romance " .. " Journey to Self - realization " .. " Wine of the Mystic " .. " Whispers from Eternity - Metephysical Meditation " .. " Sayings of Paramahamsa Yogananda "*** వంటి ఎన్నెన్నో గ్రంధాలు నేడు ప్రపంచ వ్యాప్తంగా సాధకుల జ్ఞాన తృష్ణను ఎంతగానో తీరుస్తున్నాయి. అందులో ***" Autobiography of a Yogi – ఒక యోగి ఆత్మ కథ "*** గ్రంథం ద్వారా .. యోగసాధనలోని ఉన్నత తలాల్లో సాధకుడు పొందే విశ్వచేతన అనుభవాన్ని పరమహంస యోగానందుల వారు వివరించే తీరు మహాద్భుతం! ఈ సత్యనిష్ఠ

గ్రంథం ద్వారా మనం కలుసుకునే మహావ్యక్తులు .. గొప్ప ఆధ్యాత్మిక జ్ఞానంతో నిండిన ఆప్తమిత్రుల్లా మనకు తరచూ జ్ఞాపకం వస్తూ వుంటారు. **" నవ శకపు ఉపనిషత్తు "** గా కొనియాడబడే ఈ గ్రంథం .. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది సత్యాన్వేషకుల ఆధ్యాత్మిక పిపాసను తీరుస్తోంది అనడంలో అతిశయోక్తి లేదు!

ఇలా ఆధ్యాత్మిక జగత్తుకు ఎంతో అద్భుతమైన సేవలనందించిన **" పరమహంస శ్రీశ్రీ యోగానందుల వారు "** అమెరికా .. కాలిఫోర్నియా రాష్ట్రంలోని **" లాస్ ఏంజెలిస్ "** నగరంలో 1952, మార్చి 7వ తేదీన అప్పటి భారత రాయబారి **" శ్రీ వినయ్‌రంజన్ సేన్ "** గారి గౌరవార్థం జరిగిన విందులో ముగింపు ప్రసంగం చేసారు. ఆ తరువాత వారు సచేతనంగా తమ భౌతిక శరీరాన్ని విడిచి .. **" మహాసమాధి "** చెందారు.

ఎంతో ఉదాత్తమైన యోగజీవితాన్ని గడిపిన ఈ జగద్గురువులు .. యోగవిద్య విలువను తమ జీవితంలోనే కాకుండా తమ మరణంలో కూడా ప్రదర్శించారు. ఆయన చనిపోయిన కొన్ని వారాల తరువాత కూడా ఆయన ముఖం **" అమరత్వం "** అనే దివ్యతేజస్సుతో ప్రకాశించడం అమెరికా వాసులందరినీ అబ్బురపరచింది.

క్రియాయోగ సాధన ద్వారా మరి సెల్ఫ్ రియలైజేషన్ కార్యక్రమాల ద్వారా ఆధ్యాత్మిక జగత్తులో ఎల్లలు లేని సేవచేసిన పరమహంస యోగానందగారు సత్యాన్వేషణలో తమ గురుపరంపర యొక్క గొప్పతనాన్ని లోకానికి చాటిచెప్పి .. తమ గురువులందరినీ కూడా అమరులుగా చేసారు.

## " సూక్ష్మలోకాల సమాచారం "

***" జ్ఞానావతార్ శ్రీశ్రీ యుక్తేశ్వర్ గిరి "** గారు తమ శిష్యులు అయిన **" శ్రీ పరమహంస యోగానంద " గారికి అందించిన పునరుత్థాన జ్ఞాన సందేశం.***

భౌతిక కర్మను అనుభవిస్తూండే మానవులకు సహాయం చెయ్యడానికి భూమిమీదికి ప్రవక్తలను పంపినట్లే .. ఒకానొక సూక్ష్మలోకంలో రక్షకుడిగా సేవ చెయ్యమని భగవంతుడు నన్ను ఆదేశించాడు. దానిని **' హిరణ్యలోకం '** అంటారు. భూలోకంలో ప్రగతిని పొందిన ఆత్మలు .. పునర్జన్మలు లేకుండా చేసుకోవడానికి అక్కడ వారికి నేను సాయపడుతున్నాను.

వీరు భూమిమీద తమ మరణసమయంలో ఒంటిమీద స్పృహతో భౌతికకాయాన్ని విడిచి వెళ్ళిపోవడానికి వీలు కలిగించే ధ్యానోపార్జితమైన శక్తిని సాధించినవాళ్ళే. అయితే కొన్ని సూక్ష్మ కర్మలేశాల వల్ల .. వీరు సవికల్ప సమాధిలోనే తమ దేహాన్ని వదిలి వెళ్ళడం జరిగింది. భూమి మీద పొందిన ఈ **' సవికల్ప సమాధి స్థితి '** అనే తలాన్ని దాటి, ఉన్నతతలం అయిన **' నిర్వికల్ప సమాధి స్థితి '** లోకి ప్రవేశించనిదే .. వీరు **' హిరణ్యలోకం '** లోనికి ప్రవేశించ లేరు. "

❀ ❀ ❀

*" హిరణ్యలోకవాసులు అంతకు పూర్వమే, సాధారణ సూక్ష్మ మండలాల ద్వారా సాగివచ్చి అక్కడికి చేరి ఉంటారు. ఉన్నతమైన కారణలోకం నుంచి వచ్చి, దాదాపు పూర్ణసిద్ధి పొందినవాళ్ళు కూడా హిరణ్యలోకంలో ఉన్నారు. భూలోక ప్రాణులు అందరూ కూడా మరణించిన తరువాత సూక్ష్మమండలాలకు చేరవలసిందే. వీరు సూక్ష్మలోకాలలో తమ పూర్వకర్మలకు సంబంధించి అనేక కర్మ బీజాలను నశింపచేసుకుని ఉంటారు. ఉచ్ఛస్థితిలోవున్న భక్తులు తప్ప, మిగిలిన వాళ్ళల్లో ఎవరూ, సూక్ష్మమండలాల్లో అటువంటి ముక్తిదాయక కృషి ఫలప్రదంగా చెయ్యలేరు.*

*" విశ్వనియమం చేత సూక్ష్మకర్మ లేశాలన్నింటినుంచీ .. తమ ఆత్మలను పూర్తిగా విముక్తం చేసుకోడానికి సాధకులు, హిరణ్యలోకంలో కొత్త సూక్ష్మశరీరాలతో తిరిగి పుట్టడానికి నిర్ణయించుకుంటారు. నేను వున్నది ఈ హిరణ్యలోకంలోనే! ఇక్కడ వాళ్ళు ఎలా తమ తమ సూక్ష్మకర్మ లేశాలను శుద్ధిచేసుకుంటారో నీకు వివరిస్తాను. "*

" మానవుడి ఆత్మ వరుసగా మూడు శరీరకోశాలలో పొందుపరచబడి ఉంది. ***' <u>భౌతిక శరీరం</u> ', ' <u>భావమయ శరీరం</u>*** ' మరి ***' <u>కారణ శరీరం</u> '.***

*" ఈ మూడు శరీరాలలో .. మానవుడి మానసిక, భావోద్రేక మరి భౌతిక జ్ఞానేంద్రియాలు ఏర్పడి ఉంటాయి. సూక్ష్మలోక వ్యక్తి, తన చేతనతోనూ అనుభూతులతోనూ ప్రాణకణిక <u>లైఫ్‌ట్రాన్</u>లతో తయారు అయిన శరీరంతో పనిచేస్తాడు. కారణశరీరం ధరించినవాడు .. భావాలతో కూడిన ఆనందమయలోకాల్లో ఉండిపోతాడు. అక్కడ ఉండేవాళ్ళు ఒక గ్రహం నుంచి మరో గ్రహానికి ప్రయాణం చెయ్యడానికి .. విద్యుత్తుకంటే .. మరి రేడియోధార్మిక శక్తులకంటే .. వేగంగా సాగే ' సూక్ష్మ విమానాలను ' , మరి ' కాంతిపుంజాలను ' వాడతారు. "*

❀ ❀ ❀

*" వివిధ వెలుగు, వన్నెల సూక్ష్మ ప్రకంపనలతో రూపొందిన ఈ సూక్ష్మవిశ్వం .. భౌతిక విశ్వం కన్నా కొన్ని వందలరెట్లు పెద్దది! భౌతిక సృష్టి యావత్తూ .. ' సూక్ష్మమండలం' అనే ప్రకాశవంతమైన పెద్ద గాలిబుడగ క్రింద ఘనరూపం అయిన ఒక చిన్ని బుట్టలా వ్రేలాడుతూ ఉంటుంది. రోదసిలో భౌతికమైన అనేక సూర్యగ్రహాలూ, నక్షత్రాలూ సంచరిస్తూన్నట్లుగానే .. లెక్కలేనన్ని సూక్ష్మసౌర, సూక్ష్మ నక్షత్ర మండలాలు కూడా ఉంటాయి. భౌతికమైన సూర్యచంద్రులకంటే .. సూక్ష్మ సూర్యచంద్రులు ఎంతో అందంగా ఉంటారు! సూక్ష్మలోక తేజోమండలాలు మేరు ప్రభామండలాన్ని అంటే ' అరోరా బోరియాలిస్ ' ను పోలి ఉంటాయి. ఈ సూక్ష్మలోక సౌరమేరుప్రభ, మందకిరణ చంద్రమేరుప్రభ కన్నా ఎన్నోరెట్లు మిరుమిట్లు గొలుపుతూ ఉంటుంది.*

" సూక్ష్మలోకంలో రాత్రి, పగలూ భూమిమీద వాటికన్నా దీర్ఘమైనవి. సూక్ష్మప్రపంచం అత్యంత ఆకర్షణీయమైనదీ, పరిశుభ్రమైనదీ, పరిశుద్ధమైనదీ మరి సువ్యవస్థితమైనదీ. నిర్జీవగ్రహాలూ,

చవిటి పర్రలూ అక్కడ లేనేలేవు. భూలోకానికి కళంకప్రాయమైన సూక్ష్మజీవులు (బ్యాక్టీరియా), పురుగులు, పాములు వంటివి అక్కడ ఉండవు. శీతోష్ణస్థితులూ మరి ఋతువులూ భూలోకంలో లాగా ఉంటాయి. అప్పుడప్పుడు, వెలుగులీనే తెలిమంచూ, వన్నెవన్నెల వెలుగుల వానలు కూడా కురుస్తూ ఉంటాయి. సూక్ష్మగ్రహాలలో మాణిక్య సరోవరాలూ, మిలమిల మెరిసే సముద్రాలూ .. ఇంద్రచాప నదులూ సమృద్ధిగా ఉంటాయి. "

" సూక్ష్మవిశ్వంలో భూమి నుంచి వచ్చిన కొన్ని కోట్ల సూక్ష్మ జీవాత్మలు ఉంటాయి. అంతే కాకుండా .. దేవతాశక్తులూ, మత్స్యకన్యలూ, చేపలూ, జంతువులూ, పిశాచాలూ, భూతాలూ, దైవాంశ సంభూతులూ, అదృశ్యశక్తులూ కూడా అసంఖ్యాకంగా ఉంటాయి.

ఇవన్నీ కర్మల గుణాగుణాలను బట్టి వేరువేరు సూక్ష్మ గ్రహాలలో నివసిస్తాయి. మంచిశక్తులకూ చెడ్డశక్తులకూ గోళాకార భవనాలనూ మరి స్పందనశీల ప్రాంతాలనూ సమకూర్చడం జరిగింది. మంచివి స్వేచ్ఛగా ప్రయాణం చేస్తాయి. కానీ .. దుష్టశక్తులు పరిమిత మండలాలకు లోబడి ఉంటాయి. మనుష్యులు భూమి మీదా, పురుగులు మట్టిలోనూ, చేపలు నీళ్ళలోనూ, పక్షులు గాలిలోనూ ఉన్నట్లే .. వివిధ శ్రేణుల సూక్ష్మలోక జీవులకు కూడా సముచితమైన స్పందన శీల నివాసాలు సమకూరి ఉంటాయి. "

❀ ❀ ❀

" ఇతర లోకాల నుంచి వెలివేసిన మరి పతిత దేవదూతల మధ్య ప్రాణకణికాస్త్రాలు అంటే .. లైఫ్‌ట్రానిక్ బాంబులతో మరి మానసిక మంత్ర శక్తుల ప్రకంపనా శీల కిరణాలతో ఘర్షణలూ, యుద్ధాలూ జరుగుతూంటాయి. ఈ జీవులు తమ తమ దుష్కర్మలను అనుభవిస్తూ నిమ్నతల సూక్ష్మవిశ్వంలోని అంధకారాచ్ఛాదిత ప్రాంతాల్లో నివసిస్తూ వుంటాయి.

" అంధకారమయమైన సూక్ష్మ కారాగారానికి పైన ఉండే విశాల మండలాలన్నీ ప్రకాశమానంగా అందంగా ఉంటాయి. సూక్ష్మవిశ్వం భూమి కన్నా ఎక్కువ సహజంగా .. దైవసంకల్పంతోనూ, పరిపూర్ణతా పరికల్పనతోనూ అనుసంధానం చెంది ఉంటుంది. సూక్ష్మలోక వస్తువు ప్రతి ఒక్కటి కూడా ప్రధానంగా దైవసంకల్పం వల్లా మరి పాక్షికంగా సూక్ష్మలోక జీవుల సంకల్పాల వల్ల ఆవిర్భవిస్తూ వుంటుంది. దేవుడు సృష్టించిన దానిని ఏదైనా మార్చేయడానికి కానీ, దాని అందాన్నీ, రూపాన్నీ అతిశయింప చేయడానికి కానీ వాళ్ళకు శక్తి వుంటుంది. సూక్ష్మవిశ్వాన్ని తమ ఇచ్ఛానుసారంగా మార్చివేసే స్వాతంత్ర్యం లేదా మెరుగుపరచే హక్కును భగవంతుడు తన సూక్ష్మలోక సంతానానికి ఇచ్చాడు.

" సముద్రంలోనూ .. నేల మీదా, గాలిలోనూ .. జరిగే యుద్ధాలతో, హత్యలతో ఈ భూమి కళంకితమై పోయింది. కానీ సూక్ష్మలోక రాజ్యాలకు సుఖప్రదమైన సామరస్యమూ, సమానత్వం

తెలుసు. వారు తమ తమ రూపాలను సంకల్పానుసారంగా సాక్షాత్కరింప జేయడం, అదృశ్యం చేయడం చేస్తూంటారు. పువ్వులుకానీ, చేపలుకానీ, జంతువులుకానీ .. తాత్కాలికంగా, సూక్ష్మలోక మానవులుగా రూపాంతరం చెందగలవు.

" సూక్ష్మలోక జీవులు అన్నీ స్వేచ్ఛగా ఏ రూపం అయినా దాల్చి, ఒకదానితో ఒకటి సులువుగా భావసంపర్కం పెట్టుకోగలవు. స్థిరంగా, ఖచ్చితంగా ఉండే ప్రకృతి నియమం ఏదీ వాటిని నిర్బంధించదు. మాటవరుసకు, ఏ సూక్ష్మలోక వృక్షాన్నయినా సూక్ష్మలోకపు మామిడిపండుకానీ ఇంకో పండుకానీ మరే వస్తువును అయినా కానీ .. సృష్టించి ఇమ్మని అడిగి తీసుకోవచ్చు. కొన్ని కొన్ని కర్మసంబంధమైన ప్రతిబంధకాలు ఉన్నప్పటికీ, వివిధ రూపాలను కోరడం విషయంలో, సూక్ష్మలోకంలో విభేదాలు లేవు. అక్కడ ఆ ఒక్కటికూడా దేవుడి సృజనాత్మక కాంతితో స్పందిస్తూ ఉంటుంది.

" అక్కడి వాళ్ళు ఎవరూ స్త్రీ గర్భాన జన్మించినవారు కారు. సూక్ష్మలోక వాసులు తమ విశ్వసంకల్పశక్తి సహాయంతో ప్రత్యేక అవయవ నిర్మాణమూ, సూక్ష్మ శరీరమూ గల సంతానాన్ని సృష్టించుకుంటారు. కొత్తగా తనువు చాలించిన జీవి ఎవరైనా ఒక సూక్ష్మలోక కుంటుంబంలోకి, వారు ఆహ్వానించగా వస్తుంది. "

❀ ❀ ❀

" సూక్ష్మశరీరం చలికి కానీ .. వేడికి కానీ ఇతర ప్రకృతి పరిస్థితులకు కానీ .. లోబడదు. సూక్ష్మశరీరంలో సూక్ష్మమస్తిష్కం ఒకటి ఉంటుంది; సూక్ష్మశరీర నిర్మాణంలో, ఒక సూక్ష్మమెదడుతో పాటు వెయ్యిరేకుల కాంతి కమలం మరి సూక్ష్మవెనుబాముతోపాటు జాగృతమైన షట్చక్రాలు ఉంటాయి. ఈ సూక్ష్మమెదడు నుంచి హృదయం విశ్వశక్తినీ మరి కాంతినీ గ్రహించి .. వాటిని సూక్ష్మనాడుల్లోకీ, శరీరకణాలైన **' ప్రాణాణువులు '** అంటే **' లైఫ్‌ట్రాన్స్ '** లోకి పంపిస్తుంది. సూక్ష్మలోక జీవులు ప్రాణకణిక శక్తివల్ల, పవిత్ర మంత్ర ప్రకంపనల వల్ల తమ రూపాల్లో మార్పులు చేసుకుంటూ ఉంటారు. "

❀ ❀ ❀

" సూక్ష్మమండలాలు .. పంచేంద్రియ జ్ఞానంతో గహించదగిన **' త్రిమితీయ '** అంటే .. **' 3D '** భౌతిక ప్రపంచంలాగా కాకుండా .. అన్నీ కలిసి ఉన్న **' సహజావబోధన '** అనే ఆరవ జ్ఞానేంద్రియానికి గోచరమవుతాయి! సూక్ష్మలోక వ్యక్తులు కేవలం, సహజావబోధానుభూతివల్ల చూస్తారు, వింటారు, వాసన చూస్తారు, రుచి చూస్తారు, తాకుతారు. వాళ్ళకు మూడు కళ్ళు ఉంటాయి. వాటిలో రెండు కొంతవరకు మూసుకుని ఉంటాయి.

మూడవది మరి ముఖ్యమైన సూక్ష్మనేత్రం .. నుదుటిమీద నిలువుగా, తెరుచుకుని ఉంటుంది. సూక్ష్మలోక మానవులకు కళ్ళు, చెవులు, ముక్కు, నాలుక, చర్మం అన్న బాహ్య జ్ఞానేంద్రియాలు

అన్నీ ఉంటాయి కానీ .. వాళ్ళు శరీరంలో ఏ భాగంతో అయినా సంవేదనలు పొందడానికి **' సహజావబోధం '** అనే జ్ఞానేంద్రియం ఉంటుంది. దాంతో వాళ్ళు చర్మంతో, చూడగలరు. కళ్ళతో, నాలుకతో వినగలరు; చెవులతో, చర్మంతో రుచి  కూడా చూడగలరు. "

" సూక్ష్మలోకంలో **' అందం '** అనేది ఆత్మపరమయిన గుణమేకానీ .. బాహ్యరూపం కాదు! అంచేత, సూక్ష్మలోకవాసులు ముఖ లక్షణాలకు ప్రాముఖ్యం ఇవ్వరు. అయితే, సంకల్పం మాత్రం చేత, నవీన సుందర సూక్ష్మశరీరాలను సృష్టించుకుని ధరించే సామర్థ్యం వాళ్ళకు ఉంది. భూమిమీద మనుష్యులు పండుగపబ్బాలలో క్రొత్త దుస్తులు ధరించినట్లే .. సూక్ష్మలోకవాసులు కొన్ని సందర్భాలలో ప్రత్యేకంగా కల్పించిన రూపాలు ధరిస్తారు.

" హిరణ్యలోకం వంటి సూక్ష్మగ్రహాలలో .. ఎవరయినా ఆధ్యాత్మిక ప్రగతి ద్వారా విముక్తులై కారణ లోకానికి వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నప్పుడు **' సూక్ష్మ ఆనందోత్సవాలు '** జరుగుతాయి. అటువంటి సందర్భాలలో, అగోచరుడైన పరమేశ్వరుడితో పాటు ఆయనలో లీనమైన సాధువులు కూడా ఆ ఉత్సవాల్లో పాల్గొనడానికి .. వారికి నచ్చిన దేహాలతో సాక్షాత్కరిస్తారు.

" ఇతర జన్మల్లోని స్నేహితులు, సూక్ష్మలోకంలో ఒకరినొకరు సుళువుగా గుర్తుపడతారు. స్నేహానికి అమరత్వం ఉన్నందుకు ఆనందిస్తూ .. వాళ్ళు పార్థివ జన్మలోని వియోగాలు జరిగే విషాద సమయంలో తరచు శంకిస్తూ వచ్చిన ప్రేమను ఇప్పుడు అనుభూతం కావించుకుంటారు.

" సూక్ష్మలోకవ్యక్తుల సహజావబోధం తెర చీల్చుకుని మానవ కార్యకలాపాలను గమనిస్తూ ఉంటుంది కానీ .. మానవుడు మాత్రం, తన ఆరవ జ్ఞానేంద్రియం కొంతమట్టుకు వికాసం చెంది ఉండకపోతే సూక్ష్మమండలాన్ని దర్శించలేడు. కాకపోతే భూమిమీద ఉండేవాళ్ళు కూడా ధ్యానంలో క్షణికంగా ఒక సూక్ష్మలోకజీవినో, ఒక సూక్ష్మలోకాన్నో దర్శించగలుగుతారు. "

❊ ❊ ❊

" హిరణ్యలోకంలో ఉండే .. ప్రగతి సాధించిన జీవులు సూక్ష్మలోకపు దీర్ఘమైన రాత్రి మరి పగలు కాలాల్లో సాధారణంగా ఆనంద సమాధిలో జాగృతులై ఉంటారు. విశ్వపరిచాలనానికి సంబంధించిన క్లిష్ట సమస్యలను పరిష్కరించడానికి వారు సహాయపడుతూ ఉంటారు. హిరణ్యలోక జీవులు నిద్ర పోయేటప్పుడు అప్పుడప్పుడూ, కలలు వంటి సూక్ష్మ అంతర్దర్శనాలు కూడా పొందుతూ ఉంటారు. వారి మనస్సులు సాధారణంగా అత్యున్నత నిర్వికల్ప ఆనందంలో సచేతనంగా ఉంటాయి.

" అయినప్పటికీ .. సూక్ష్మవిశ్వంలోని అన్ని ప్రాంతాల్లో ఉండే వాళ్ళకూడా అప్పుడప్పుడూ మనోవేదనలకు గురి అవుతూ ఉంటారు. హిరణ్యలోకం వంటి గ్రహాల మీద ఉండే మహాభక్తులూ, సునిశిత మనస్సులూ, సత్యవర్తనలో కానీ .. సత్యదర్శనంలో కానీ .. ఏదయినా పొరపాటు

జరిగినట్లయితే .. తీవ్రమైన మనోవేదన పొందుతారు. ఈ ప్రగతిజీవులు తమ ప్రతిచర్యనూ, ఆలోచననూ, ఆధ్యాత్మిక నియమ పరిపూర్ణత్వంతో అనుసంధానం కావించుకోవడానికి ప్రయత్నిస్తూంటారు.

" సూక్ష్మలోకవాసులందరి మధ్యా **' భావసంపర్కం '** అన్నది మానసిక ప్రసారం అంటే **' టెలిపతీ '** ద్వారా .. సూక్ష్మ దూరదర్శనాలు అంటే .. **' ఆస్ట్రల్ టెలివిజన్ '** ల ద్వారా జరుగుతుంది. పలికిన మాటల వల్ల, వ్రాసిన వ్రాతలవల్ల భూమిమీద జరిగే గందరగోళం, అపార్థం సూక్ష్మ లోకాలలోని వారికి తెలియవు.

" వెలుతురు కల్పించిన బొమ్మలవరుస ద్వారా .. సినిమా తెరమీద మనుష్యులు నిజంగా ఊపిరి తీసుకోకుండానే కదలడం, కార్యకలాపాలు సాగించడం చేస్తున్నట్టుగానే .. సూక్ష్మలోకవాసులు కూడా కేవలం కాంతి మూలంగా నడుస్తారు .. పనిచేస్తారు! భూలోకంలో మానవుడు ప్రధానంగా ప్రాణశక్తి మీద ఆధారపడి జీవించినట్లుగా .. వీరు ప్రధానంగా విశ్వకాంతి మీద ఆధారపడి బ్రతుకుతూ ఉంటారు.

" సూక్ష్మలోకవాసులు తమ ఆహారంగా కూరగాయలు తింటారు. అక్కడి భూములలో వెలుగు రేకుల్లాటి కూరగాయలు సమృద్ధిగా పండుతాయి. వారు శోభాయమానమైన నీటి బుగ్గల నుంచీ, సూక్ష్మనదుల నుంచీ మరి సెలయేళ్ళ నుంచీ ప్రవహించే అమృతాన్ని పానం చేస్తారు.

" భూమిమీద సాధారణంగా, మానవుల అదృశ్యబింబాలను .. ఈథర్ లోంచి రప్పించి టెలివిజన్ ద్వారా కళ్ళకు కట్టించి .. తర్వాత స్విచ్ నొక్కి మాయంచేసినట్టే .. ఆకాశతత్వంలో తేలే కూరగాయలనూ, మొక్కలనూ అగోచర సూక్ష్మ ప్రతిరూపాలనూ సూక్ష్మలోకవాసులు కూడా సృష్టిస్తారు! వీరు తమ ఉద్దామకల్పనలను అనుసరించి విశాల వనాలను సాక్షాత్కరింపజేయవచ్చు మరి తిరిగి వాటిని ఆకాశతత్వ సహజంగా అదృశ్యం చేయవచ్చు.

***" ' హిరణ్యలోకం ' వంటి సువర్లోకమండలాల్లో ఉండే వాళ్ళు .. తిండి తినవలసిన అవసరం లేకుండా దాదాపు స్వేచ్ఛ పొందినప్పటికీ .. కారణం లోకంలో దాదాపు పరిపూర్ణతా సిద్ధి పొందిన జీవుల స్వేచ్ఛాయుత అస్తిత్వం, అంతకన్నా ఉన్నత స్థితిలో ఉంటుంది; వాళ్ళ ఏకైక ఆహారం ఆనందామృతమే!***

" భూమి నుంచి విముక్తుడై సూక్ష్మలోకంలోకి వచ్చిన ఆత్మ అక్కడ భూలోకంలో వివిధ జన్మల్లో తాను పొందిన తండ్రులనూ, భార్యలనూ, భర్తలనూ, పిల్లలనూ, స్నేహితులనూ అనేక మందిని చూస్తాడు. వాళ్ళు అతనికి సూక్ష్మమండలాల్లోని వివిధ భాగాలలో అప్పుడప్పుడూ కనిపిస్తూ ఉంటారు. అందుచేత, ఎవరి మీద ప్రత్యేకాభిమానం చూపించాలో తెలుసుకోలేక .. వాళ్ళందరి మీద కూడా దివ్యమైన, సమానమైన ప్రేమ చూపిస్తాడు.

" క్రిందటి జన్మలో తమ క్రొత్త గుణాల వికాసానికి అనుగుణంగా తనతో బంధం ఏర్పరచుకున్న తనకు ప్రియమైన వాళ్ళ బాహ్యారూపాలు ఇప్పుడు మారిపోతాయి. కానీ ఒకప్పుడు తనకు ప్రియంగా ఉన్నవాళ్ళనందరినీ గుర్తు పట్టడానికి అతడు తన అమోఘ సహజావబోధాన్ని ఉపయోగించి, వాళ్ళను తమ క్రొత్త సూక్ష్మలోక నివాసాలకు ఆహ్వానిస్తాడు. సృష్టిలో ఉన్న ప్రతి అణువు కూడా నశింపజేయరాని వ్యక్తిత్వం కలిగి ఉన్నది కనుక, సూక్ష్మలోక మిత్రుడు ఏ విధంగా ఉన్నా గుర్తు పట్టేస్తారు! భూమి మీద నటుడు ఏ మారువేషంలో ఉన్నప్పటికీ నిశిత పరిశీలనవల్ల అతన్ని గుర్తు పట్టగలిగినట్లే ఇది కూడా సంభవం అవుతుంది! "

❀ ❀ ❀

" సూక్ష్మమండలాలలో ఆయుఃప్రమాణం, భూమి మీద ఉన్నదానికన్న ఎక్కువ. ఓ మోస్తరుగా అభివృద్ధి సాధించిన ఒక వ్యక్తి సూక్ష్మ జీవిత సగటు ఆయుః ప్రమాణం, భూ కాలప్రమాణ ప్రకారం అయిదువందల సంవత్సరాల నుంచి వెయ్యేళ్ళ వరకూ ఉంటుంది. కొన్ని రకాల రెడ్ వుడ్ వృక్షాలు ఇతర వృక్షాల కన్నా కొన్నివేల ఏళ్ళు అధికంగా బ్రతికే విధంగా, ఇది జరుగుతుంది. చాలామంది అరవై ఏళ్ళు నిండక ముందే చనిపోతూన్నప్పటికీ కొందరు యోగులు అనేక వందల ఏళ్ళు బ్రతుకున్నట్లే కొందరు సూక్ష్మలోకవాసులు సాధారణ సూక్ష్మలోక ఆయుర్దాయాన్ని మించి కూడా బ్రతుకుతారు. సూక్ష్మలోకంలోకి వచ్చే **' సందర్శక జీవులు '** తమ భౌతిక కర్మ భారాన్ని బట్టి అధిక కాలమో, స్వల్ప కాలమో అక్కడ నివసిస్తారు. ఆ తరువాత మళ్ళీ వారి భౌతిక కర్మ నిర్ణీత సమయంలో వాళ్ళను ఈ భూమ్మీదకి లాక్కొస్తుంది."

❀ ❀ ❀

" ఒకానొక సూక్ష్మలోకజీవి తన జ్యోతిర్మయదేహాన్ని విడిచిపెట్టే సమయంలో యముడితో కష్టపడి పెనుగులాడక్కర్లేదు. అయినా ఈ జీవులు సూక్ష్మతరమైన కారణ శరీరం కోసం .. **' సూక్ష్మ రూపాన్ని విడవాలి '** అన్న ఆలోచన వచ్చేసరికి కొద్దిగా గాభరాపడతారు. భూమి మీద ఉన్న ఇష్టం లేని చావూ, జబ్బూ, ముసలితనమూ సూక్ష్మలోకంలో ఉండవు. ఈ భయాలు మూడూ భూలోకానికి పట్టిన శాపాలే! భూమి మీద జన్మ తీసుకున్న తరువాత మనిషి .. ***' బ్రతకడానికి గాలీ, అన్నమూ, నిద్రా అవసరమైన దుర్బల భౌతికకాయమే తాను '*** అని భ్రమపడి దానితో పూర్తిగా మమేకమై పోవడానికి తన చేతనను అనుమతిస్తాడు.

" భౌతిక మరణంలో ఊపిరి పోతుంది మరి మాంస సంబంధమైన కణాలు విఘటనం చెందుతాయి కానీ, సూక్ష్మశరీర మరణంలో ప్రాణకణికలు చెల్లాచెదరయి పోతాయి. అవి సూక్ష్మలోకజీవులకు ప్రాణసంఘటన కావించిన శక్తి తాలూకు ప్రత్యక్షీకృత ఘటకాంశాలు.

" భౌతిక మరణసమయంలో మనిషికి ఒంటిమీద స్పృహపోయి సూక్ష్మలోకంలో ఉన్న తన సూక్ష్మశరీరం స్పృహకు వస్తుంది. నిర్ణీత సమయంలో సూక్ష్మలోక మరణాన్ని అనుభవించి ఆ

తర్వాత .. సూక్ష్మలోక జననమరణాల స్పృహ నుంచి .. భౌతిక జననమరణాల స్పృహకు సాగుతాడు. సూక్ష్మ, స్థూల శరీరకోశాల ఆవర్తన చక్రాలు మరి జ్ఞానం ఆర్జించని చక్రాలు ఒక్కొక్కప్పుడు ఆనందమయ సూక్ష్మలోకాలలోనూ, నిరాశా జనకమైన భౌతిక లోకాలలోనూ కలిగిన అనేక అనుభవాల తాలూకు జ్ఞాపకాలను మనిషిలో రేకెత్తిస్తాయి. "

❁ ❁ ❁

" మానవుడు ప్రధానంగా **వైయక్తీకృత** ఆత్మతో కూడిన, కారణ శరీరుడు! ఆ శరీరం ముప్పై ఐదు తత్త్వాలతో కూడింది. దానిని రూపొందించడానికి మౌలిక ఆలోచనాశక్తులుగా, మరి కారణ ఆలోచనాశక్తులుగా, దేవుడికి ఆ తత్త్వాలు అవసరమయ్యాయి; ఆ తరువాత ఆయన, వాటిలోంచి పందొమ్మిది తత్త్వాలు తీసుకుని సూక్ష్మశరీరాన్నీ, పదహారు తత్త్వాలు తీసుకుని భౌతిక శరీరాన్నీ నిర్మించాడు.

" సూక్ష్మశరీరంలో ఉండే పందొమ్మిది తత్త్వాలు కూడా మానసికమైనవీ, భావోద్రేకపరమైనవీ మరి ప్రాణకణికాపరమైనవి. ఆ పందొమ్మిది అంశాలూ బుద్ధి (తెలివి); అహంకారం; చిత్తం (అనుభూతి); మనస్సు (ఇంద్రియ స్పృహ); ఐదు జ్ఞానేంద్రియాలు– చూపు, వినికిడి, వాసన, రుచి, స్పర్శలను గ్రహించడానికి ఉపకరించే సూక్ష్మ ప్రతిరూపాలు; ఐదు కర్మేంద్రియాలు – ప్రజననానికీ, విసర్జనకూ, మాటకూ, నడకకూ, కాయిక కర్మలకూ ఉపకరించే సామర్థ్యాల మానసిక ప్రతిరూపాలు.

" ప్రాణశక్తి తాలూకు ఇంద్రియాలు ఐదు. శరీరంలో స్ఫటికీకరణ (crystallizing), స్వాంగీకరణ (assimilating), విసర్జన (eliminating), జీవాణుపాక (metabolizing), ప్రసరణ (circulat- ing), కార్యాలు జరిపేవి. ఇవే ప్రాణాపానవ్యానోదానసమాన వాయువులు.

" పందొమ్మిది తత్త్వాల సూక్ష్మశరీరకోశం .. పదహారు స్థూల రసాయన మూలకాలతో రూపొందిన భౌతిక శరీరం నశించిన తరువాత కూడా నిలిచే ఉంటుంది."

❁ ❁ ❁

" దేవుడు వివిధ తత్త్వాలను తనలోనే భావన చేసుకుని వాటిని స్వప్నాలలోకి ప్రక్షేపించాడు. ఆ విధంగా, అనంత సాపేక్షతా బృహదాభరణాలతో అలంకరించుకున్న **' విశ్వస్వప్న మాయా సుందరి *(Lady Cosmic Dream)* '** ఆవిర్భవించింది. కారణ శరీరంలోని ముప్ఫై ఐదు తత్త్వాల్లోనూ భగవంతుడు, మనిషి సూక్ష్మ శరీరానికి సంబంధించిన పందొమ్మిది తత్త్వాలనూ, భౌతిక శరీరానికి సంబంధించి పదహారు తత్త్వాలనూ సర్వసంకీర్ణతాయుతంగా సమకూర్చాడు. స్పందనశక్తులను ఘనీభూతం చేసి, మొదట మనిషి సూక్ష్మశరీరాన్నీ చివరికి భౌతికశరీరాన్నీ సృష్టించాడు. ఆయన మౌలిక సారళ్యరూపుడయిన పరమేశ్వరుడు!

" దిగ్భ్రమ కారకమైన నానాత్వంగా పరిణమించడానికి కారణమయిన సాపేక్షతానియమం ప్రకారం కారణవిశ్వమూ కారణశరీరమూ .. సూక్ష్మవిశ్వానికీ - సూక్ష్మదేహానికీ భిన్నంగా ఉంటాయి. అలాగే భౌతిక విశ్వంతో పాటు భౌతికదేహం కూడా స్వభావతః సృష్టిలోని ఇతర రూపాలకు భిన్నంగా ఉంటాయి.

" రక్తమాంసాలతో కూడిన భౌతిక శరీరం, సృష్టికర్త యొక్క నిశ్చిత, ప్రత్యక్షీకృత స్వప్నాలతో ఏర్పడింది. ఆరోగ్య-అనారోగ్యాలు కష్ట-సుఖాలు, లాభ-నష్టాలు అన్న ద్వంద్వాలు భూమిమీద ఎప్పుడూ ఉంటాయి. మానవులకు త్రిమితీయ (3-D) పరిమితితో కూడిన ప్రతిరోధం తప్పదు. మనిషి బ్రతికుండాలి అన్న కోరిక .. జబ్బు వల్లనో మరే కారణాల వల్లనో తీవ్రంగా సడలిపోయినట్లయితే మరణం సంభవిస్తుంది. మరణం వల్ల మాంసరూపమైన బరువైన బాహ్య కళేబరాన్ని తాత్కాలికంగా వదిలెయ్యవలసి వస్తుంది .. కానీ ఆత్మ మాత్రం సూక్ష్మ కారణ శరీరాలలో ఆబద్ధమై ఉంటుంది. ఈ మూడు శరీరాలనూ కలిపి ఉంచే సంయోజక శక్తి కోరిక మరి ఈ తీరని కోరికల శక్తే మానవుడి బానిసతనానికి కారణం.

" భౌతిక వాంఛలకు మూలం .. అహంకారం మరి ఇంద్రియ సుఖాలు. ఇంద్రియానుభవ నిర్బంధం మరి ప్రలోభం అన్నది సూక్ష్మలోక అనుబంధాలకు కానీ, కారణలోక అనుభూతులకు కానీ సంబంధించిన వాంఛశక్తి కంటే ఎక్కువ శక్తివంతమైంది.

" సూక్ష్మలోక వాంఛలు, స్పందనరూప సుఖానుభవానికి సంబంధించినవి. సూక్ష్మలోక జీవులు వివిధ గ్రహాల ఆకాశ సంగీతాన్ని ఆలకించి .. సృష్టి అంతా పరివర్తనశీల కాంతికి సంబంధించిన అనంతాభివ్యక్తులుగా కనబడటం వల్ల .. పరవశులై ఆనందిస్తారు. సూక్ష్మలోక జీవి వెలుగును వాసన చూస్తాడు, రుచి చూస్తాడు, తాకుతాడు. ఈ విధంగా సూక్ష్మలోకవాంఛలు అన్నీ కూడా వస్తువులనూ, అనుభవాలనూ కాంతిరూపాలుగా, మరి ఘనీభూత ఆలోచనలుగా, మరి కలలుగా రూపొందించడానికి వారికి ఉండే శక్తిని బట్టి ఉంటాయి.

" కారణలోక వాంఛలు అనుభూతివల్ల మాత్రమే నెరవేరతాయి. కారణ శరీరంలో మాత్రమే ఆబద్ధులై ఉండి, విముక్త ప్రాయులైన జీవులు విశ్వాన్నంతటినీ దేవుడి స్వప్నభావాలకు సిద్ధించిన ప్రత్యక్షరూపంగా దర్శిస్తారు. ఆలోచనమాత్రం చేతనే వాళ్ళు దేన్నయినా సాక్షాత్కరింప చెయ్యగలరు! కాబట్టి కారణ శరీరులు, భౌతిక ఇంద్రియ సుఖాన్నికానీ, సూక్ష్మలోక ఆనందాన్ని కానీ స్థూలమైనది గానూ, ఆత్మకు కలిగే సూక్ష్మతర సంవేదకుల అవరోధకంగానూ పరిగణిస్తారు. కారణ శరీరులు తమకు కావలసినవి తక్షణమే సాక్షాత్కరింపజేసుకుని కోరికలు నశింపజేసుకుంటారు. కారణ శరీరం అనే నాజూకు ముసుగు కప్పి ఉన్న వాళ్ళు .. సృష్టికర్తలాగే విశ్వాలను సృష్టించగలరు. సృష్టి అంతా విశ్వస్వప్న జాలంతో రూపొందినందువల్ల, కారణ శరీరం అంటే పలుచని వస్త్రం ధరించి ఉన్న ఆత్మ .. వివిధ విస్తృత రూపాలలో శక్తిని సాక్షాత్కరింపజేసుకుంటూ ఉంటుంది.

" సహజంగా కంటికి కనిపించని ఆత్మను దాని శరీరం దానికి ఆవరించి ఉన్న వివిధ శరీరాల చేత మాత్రమే గుర్తుపట్టడానికి వీలవుతుంది. అలాకాకుండా భౌతిక శరీరం ఒక్కటే ఉంది అంటే.. అది తీరని కోరికవల్ల ఏర్పడినట్టే లెక్క. మానవుడి ఆత్మ, ఒకటో రెండో మూడో .. శరీరాలు అనే సీసాలలో బంధించి ఉండి, అజ్ఞానమూ, కోరికలూ అనే బిరడాలతో గట్టిగా బిగించి ఉన్నంతకాలం .. అతడు పరమాత్మ సాగరంలో లీనం కాలేడు. **' చావు '** అనే సుత్తి దెబ్బతో స్థూల భౌతికకాయం బ్రద్దలయిపోయినప్పుడు సూక్ష్మ, కారణ శరీరాలు అనే మిగిలిన రెండు తొడుగులు కూడా .. సర్వవ్యాప్త ప్రాణం అనే పరమాత్మతో సచేతనంగా లీనం కావడానికి వీలు లేకుండా ఆత్మను నిరోధించడానికి, ఇంకా మిగిలి ఉంటాయి.

***" జ్ఞానం ద్వారా నిష్కామం అలవడినప్పుడు, దాని శక్తి మిగిలిన కోశాలను రెండింటినీ చిన్నాభిన్నం చేసేస్తుంది. చివరికి, ఆ ఆత్మ విముక్తమయి, అమేయ సమృద్ధమయిన పరమాత్మతో ఐక్యమవుతుంది. "***

" కారణశరీరం చెప్పలేనంత సూక్ష్మమయింది. దానిని అర్థం చేసుకోవాలి అంటే కళ్ళు మూసుకుని సూక్ష్మ విశ్వాన్ని భౌతిక విశ్వ సమస్తాన్నీ భావాల రూపంలోనే దర్శించడానికి కావలసిన మహత్తర ఏకాగ్రతా శక్తులు ఉండి ఉండాలి. అధిమానవసాధ్యమైన ఏకాగ్రతతో ఆ రెండు విశ్వాలనూ, వాటి సంకీర్ణతలన్నింటితో సహా, కేవలం భావాల్లోకి పరివర్తన చేయడంలో, కృతకృత్యుడు కాగలిగితే అప్పుడు అతడు కారణ లోకాన్ని చేరి మనస్సుకూ పదార్థానికీ మధ్య సరిహద్దులో నిలబడతాడు.

" అక్కడ అతడు, ఘన ద్రవ వాయుపదార్థాలు, విద్యుత్తు, శక్తి, సర్వజీవులు, దేవతలు, మనుష్యులు, జంతువులు, మొక్కలు, సూక్ష్మజీవులు మొదలైన, సృష్టిలోని వస్తువులన్నిటినీ చైతన్య రూపాలుగా దర్శిస్తాడు. అంటే, మనిషి కళ్ళు మూసుకుని తన దేహం భౌతిక నేత్రాలకు కనబడకుండా కేవలం భావంగా మాత్రమే ఉన్నా కూడా .. **' నేను '** అన్నవాడు ఒకడు ఉన్నాడు అని గ్రహించినట్టుగానే అన్నమాట!

" మనిషి, ఊహలో చెయ్యగలిగిందల్లా కారణశరీరుడు వాస్తవంగా చేస్తాడు. కేవలం మనస్సులో, ఆలోచనలో మొదటి కొస నుంచి తుది కొస దాకా సాగడానికీ, ఒక లోకం నుంచి మరో లోకానికి మానసికంగా లంఘించడానికీ .. నిత్యత్వం అనే కూపంలోకి అంతులేకుండా పడుతూ ఉండడానికీ, నక్షత్ర మండలాల ముత్యాల పందిరిలోకి రాకెట్టు మాదిరిగా దూసుకుపోవడానికీ, పాలపుంతల మీదా నక్షత్రాంతరాళాలలో సెర్చిలైటులా మిలమిల్లాడడానికీ .. అత్యంత విస్తారమైన మానవ కల్పనాశక్తికి సామర్థ్యం ఉంది! కానీ కారణలోక జీవులకు అంతకన్న గొప్ప స్వేచ్ఛ ఉంది. భౌతిక అవరోధంకానీ, సూక్ష్మ అవరోధం కానీ, కర్మ బద్ధత కానీ లేకుండా వాళ్ళు .. తమ భావాలను తక్షణమే మూర్తిరూపంలో సునాయాసంగా ప్రత్యక్షీకరించుకుంటారు.

" కారణలోకంలో ఆత్మలు, ఒకదానిని ఒకటి ఆనందమయ పరమాత్మ తాలూకు వైయక్తీకృత బిందువులుగా గుర్తుపడతాయి! వాటి చుట్టూ ఉండే వస్తువులు అన్నీ భావవస్తువులే! కారణశరీరులు, కేవలం భావాలయిన తమ దేహాలకూ ఆలోచనలకూ ఉండే తేడా గమనిస్తారు. మానవుడు కళ్ళు మూసుకుని మిరుమిట్లుగొలిపే తెల్లటి వెలుగును కానీ, మందమైన నీలివన్నె మసక వెలుతురును కానీ చూడగలిగినట్లే .. కారణ శరీరులు, కేవలం ఆలోచనలనే చూడగలరు, వినగలరు, వాసన చూడగలరు, రుచి చూడగలరు మరి తాకగలరు. వాళ్ళు విశ్వమానస శక్తితో ఏదైనా సృష్టిస్తారు! మరి లయం చేస్తారు."

" కారణ లోకంలో **' చావు-పుట్టుకలు '** అన్నవి రెండూ కూడా వారి వారి భావనలలోనే ఉంటాయి. కారణ శరీరులు **' నిత్యనూతన జ్ఞానం '** అనే అమృతంతోనే సదా విందు చేసుకుంటూ ఉంటారు. వారు **' శాంతి '** అనే నీటి బుగ్గల్లోంచి పెల్లుబికి వచ్చింది త్రాగుతారు, **' అనుభూతి '** అనే నేలమీద తిరుగుతారు .. మరి **' ఆనందం '** అనే అనంతసాగరంలో ఈదులాడుతూ ఉంటారు.

" చాలా మంది జీవులు వేలకొద్దీ సంవత్సరాలు కారణలోకంలో ఉండిపోతారు. అక్కడి గాఢతరమైన ఆనందాతిరేకం వల్ల .. విముక్తాత్మగా కారణ శరీరంలోంచి బయటికి వచ్చి .. కారణ విశ్వానికి ఉన్న **' విస్తారత '** అనే రూపాన్ని ధరిస్తుంది! అప్పుడు వారిలో ఉన్న భావాల సుడిగుండాలూ, ప్రత్యేకీకృత శక్తితరంగాలూ .. ప్రేమ, ఆనందం, శాంతి, సహజావబోధం, ప్రశాంతత, స్వయంసంయమం, ఏకాగ్రత .. అన్నీ కరిగి, పరమానంద సాగరంలో లీనమయి పోతాయి. ఆ తరువాత ఆత్మ .. తాను ఒక వైయక్తీకృత తరంగంగా ఆనందానుభవం పొంది .. ఆహ్లాదాలూ, స్పందనలూ అనే కెరటాలు గల విశ్వైక మహాసాగరంలో విలీనమై సాపేక్షతా నియమం నుంచి తప్పించుకుని, అనిర్వచనీయ ఆనందంలో నిత్యస్థితం అవుతుంది. సర్వవ్యాపకత్వమనే సీతాకోక చిలుక రెక్కలమీద నక్షత్రాలూ, చంద్రబింబాలూ, సూర్యబింబాలూ చిత్రించి ఉన్నట్లే పరమాత్మగా విస్తరించిన విశ్వసృష్టి అనే దైవ స్వప్నంలో కలిగిన ఆనందాతిశయంతో అది మత్తెక్కి ఉంటుంది."

❀ ❀ ❀

" ఇలా **' శారీరక భ్రాంతులు '** అనే మూడు ఘటాలలో నుంచి బయటపడ్డ ఆత్మ .. తన వ్యక్తిత్వాన్ని కోల్పోకుండానే అనంతంలో ఏకమవుతుంది. మహాప్రవక్త క్రీస్తు కూడా ఏసుగా పుట్టడానికి పూర్వమే కారణలోకంలో ఈ చరమస్వేచ్ఛను సాధించారు. భూలోక జీవితంలో **' మరణం '** మరి **' పునరుత్థానం'** అనే మూన్నాళ్ళ అనుభవంతో సూచితమైన పూర్వదశలు మూడింటిలోనూ .. ఆయన పరమాత్మలో సంపూర్ణంగా ఉదయించడానికి కావలసిన శక్తిని కారణ లోకాలలోనే సాధించాడు. అదే అభివృద్ధిచెందని మనిషి ఈ మూడు శరీరాలలోంచి బయటపడటానికి భూలోకంలోనూ, సూక్ష్మలోకంలోనూ లెక్కలేనన్ని జన్మలు ఎత్తవలసి ఉంటుంది.

" కానీ ఈ చరమస్వేచ్ఛ సాధించిన గురువు .. ఇతర మానవులను దేవుడి దగ్గరికి తిరిగి తీసుకు రావడానికి భూలోకానికి ప్రవక్తగా తిరిగి వెళ్ళాలని నిశ్చయించుకోవచ్చు .. లేకపోతే నాలాగా, సూక్ష్మవిశ్వంలో ఉందామని అనుకోవచ్చు. అక్కడ రక్షకుడుగా వాళ్ళ కర్మభారాన్ని కొంత తాను మోస్తూ వాళ్ళు సూక్ష్మవిశ్వంలో మళ్ళీ పుట్టవలసిన అవసరం లేకుండా చేసి, కారణలోక మండలాలకు వాళ్ళు శాశ్వతంగా వెళ్ళడానికి సహాయపడతాడు. లేదా విముక్తాత్ముడై, కారణ లోకంలోకి ప్రవేశించి .. అక్కడివాళ్ళు .. కారణశరీరంలో తమ జీవితకాలాన్ని తగ్గించుకుని కైవల్య ప్రాప్తి పొందడానికి తోడ్పడతాడు.

" భూలోక కర్మను ఇంకా క్షయం చేసుకోవలసిన వాళ్ళల్లో కొందరు తమ కర్మ సంబంధమైన ఋణాన్ని తీర్చుకోవడానికి .. స్థూలమైన ఒక భౌతికదేహంలో జన్మ తీసుకుంటారు. వీళ్ళను భౌతిక మరణానంతరం, సూక్ష్మలోకానికి వచ్చే ***' స్థిరవాసులు '*** గా కాకుండా, తాత్కాలికంగా వచ్చే ***' సందర్శకులు '*** గా మాత్రమే పరిగణించాలి."

" మానవుడు సూక్ష్మలోకాలలో దీర్ఘకాలం ఉండడం సంభవించేలోగా అతడు తన భౌతిక కర్మను, లేదా కోరికలను పూర్తిగా అనుభవించాలి. ఎందుకంటే భూలోకంలో కర్మఫలానుభోగం పూర్తికాని వారికి సూక్ష్మలోక మరణం సంభవించిన తరువాత .. విశ్వభావాల ఉన్నత కారణ మండలంలోకి వెళ్ళడానికి అనుమతి లభించదు. అందుకే వారు పదహారు స్థూలతత్వాలున్న తమ భౌతికదేహాన్నీ, పందొమ్మిది సూక్ష్మతత్వాలున్న సూక్ష్మదేహాన్నీ వరుసగా స్పృహలో ఉంచుకుని .. భౌతికలోకానికీ .. సూక్ష్మ లోకానికీ అటూఇటూ రాకపోకలు సాగిస్తూ ఉండాలి.

" అయితే భౌతికశరీరం నశించిన తరువాత ప్రతిసారీ, భూమి నుంచి వచ్చిన అభివృద్ధి చెందని జీవి, చాలా వరకు ***' మరణస్వప్నం '*** అనే గాఢ సుషుప్తిలో ఉండిపోయి .. అందమైన సూక్ష్మలోకం స్పృహ కోల్పోతుంది. అటువంటివాడు సూక్ష్మలోకంలో విశ్రాంతి తీసుకున్న తరువాత అనుక్రమ శిక్షణకోసం భౌతికలోకానికి తిరిగి వెళ్తాడు. పదేపదే సాగే రాకపోకలవల్ల అతడు క్రమంగా, సుళువుగా అర్థంగాని సూక్ష్మతత్వం వున్న లోకాలకు అలవాటు పడిపోతాడు.

" అది అలా ఉండగా, సూక్ష్మవిశ్వంలో మామూలుగా ఉంటున్నవాళ్ళు, లేదా చిరకాలంగా స్థిరనివాసులుగా ఉంటూ వచ్చినవాళ్ళు తమ భౌతిక వాంఛలన్నింటినుంచీ విముక్తులై, భూలోకపు స్థూల స్పందనలకు మళ్ళీ లోనుకావలసిన అవసరం లేనివాళ్ళు సూక్ష్మకారణకర్మలు మాత్రమే అనుభవించవలసి ఉంటుంది. సూక్ష్మలోకంలో మరణించిన తరవాత ఈ జీవులు అత్యంత సూక్ష్మతరమూ, సుందరతరమూ అయిన కారణలోకానికి వెళ్తారు. విశ్వనియమం నిర్ణయించిన ప్రకారం కొంత జీవితకాలం గడిచిన తరవాత, ఈ ప్రగతి సాధించిన జీవులు .. హిరణ్యలోకానికో మరి అలాంటి ఇతర ఉన్నత సూక్ష్మలోకానికో తిరిగి వచ్చి, సూక్ష్మలోక కర్మఫలావశేషాన్ని అనుభవించడానికి ఒక క్రొత్త సూక్ష్మశరీరంలోకి ప్రవేశిస్తారు.

" భూమి నుంచి వచ్చిన వాళ్ళు తమ భౌతిక కర్మావశేషాలను ఇంకా నిలుపుకునే ఉన్నట్లయితే .. హిరణ్యలోకం వంటి అత్యున్నత సూక్ష్మలోకానికి వారు చేరలేరు. కనుక నేను రక్షకుడిగా పనిచేసేది.. భూమి నుంచి పైకి వచ్చిన సూక్ష్మలోకజీవులను ఉద్ధరించడం కోసం కంటే.. ముఖ్యంగా కారణలోకం నుంచి తిరిగివచ్చి సూక్ష్మలోకం లో పునర్జన్మ ఎత్తిన ఆత్మల్ని ఉద్ధరించడం కోసమే! "

❀ ❀ ❀

" భూమిమీద వుండే వాళ్ళల్లో చాలామంది, సూక్ష్మలోక జీవితంవల్ల కలిగే ఉత్కృష్ట ఆనందాలనూ, లాభాలనూ హర్షించడానికి ఉపకరించే ధ్యానార్జిత అంతర్దర్శనాన్ని అలవరచుకున్న కారణంగా, మరణానంతరం మళ్ళీ భూమిమీద ఉండే పరిమిత, అపరిపూర్ణ సుఖాలకోసమే తిరిగి రావాలి అని కోరుకుంటూంటారు. అలాగే చాలామంది సూక్ష్మలోక జీవులు కూడా కారణలోకంలోని **' ఆధ్యాత్మికానందం '** అనే ఉన్నతావస్థను ఊహించుకోలేక, తమ తమ సూక్ష్మ శరీరాలు మామూలుగా విఘటనం చెందే సమయంలో, స్థూలతర అసహజ సూక్ష్మలోక సౌఖ్యాన్ని గురించిన ఆలోచనల మీదే మనస్సు పెట్టుకుని సూక్ష్మస్వర్గానికి తిరిగి రావాలని కోరుకుంటారు. ఇలాంటి వాళ్ళకు సూక్ష్మలోకంలో మరణించిన తరువాత, బహుసన్నని సరిహద్దులో సృష్టికర్తనుంచి వేర్పాటుగా ఉన్న కారణ జగత్తులో శాశ్వతనివాసం పొందడానికి వాళ్ళ భారీ సూక్ష్మలోక కర్మక్షయం కావాలి. "

" కంటికి ఇంపు చేసే సూక్ష్మవిశ్వంలో లభించే అనుభవాల కోసం మరేమీ కోరికలు పెట్టుకోకుండా, తిరిగి అక్కడికి వెళ్ళాలన్న వ్యామోహానికి లోబడకుండా ఉండగలవాళ్ళయితేనే .. కారణ లోకంలో ఉండిపోతారు. అక్కడ కారణకర్మను, లేదా వెనుకటి కోరికల బీజాలను క్షయంచేసే పనిపూర్తిచేసిన ఆత్మ .. **' అవిద్య '** అనే బిరడాలో మూడు సీసాల్లో బంధించబడి ఉన్న భౌతిక, సూక్ష్మ, కారణ శరీరాల్లోని కారణశరీరం అనే కడపటి సీసాలోంచి కూడా బయటపడి శాశ్వత పరబ్రహ్మంలో కలిసిపోతుంది.

" మానవుడి మూడు శరీరాలూ ***' ఒకదాంట్లోకి ఒకటి చొచ్చుకుపోయి ఉంటాయి '*** అన్న విషయం, అతని త్రిగుణాత్మక ప్రకృతి ద్వారా అనేక మార్గాల్లో వ్యక్తమవుతుంది! భూమి మీద మానవుడికి జాగ్రదావస్థలో .. దాదాపు ఈ మూడు వాహకాలు కూడా స్పృహలో ఉంటాయి. " రుచిచూడటం, వాసన చూడటం, తాకడం, వినడం, లేదా చూడటం వంటి ఇంద్రియానుభవాలు పొందాలని అతడు ఇంద్రియ భోగలాలసుడై తలపెట్టినప్పుడు, అతడు ప్రధానంగా తన ***' భౌతిక శరీరం '*** తో పని చేస్తున్నాడన్నమాట.

" ***' అంతర్దర్శనం పొందడం '***, లేదా ***' సంకల్పించడం '*** అన్నవి అతడు ముఖ్యంగా ***' సూక్ష్మశరీరం '*** తో చేస్తున్నాడు. ఆలోచిస్తున్నప్పుడు కానీ అంతఃపరిశీలనలోనో ధ్యానంలోనో గాఢంగా మునుగుతున్నప్పుడు కానీ, అతని కారణశరీరానికున్న వ్యక్తీకరణ శక్తి వెల్లడి అవుతుంది!

అలవాటు ప్రకారం కారణ శరీరంతో సంబంధం పెట్టుకునేవాడికి ప్రతిభా సంబంధమైన విశ్వభావాలే ఏర్పడతాయి.

***" ఇలా ఒక వ్యక్తిని ' భౌతిక మానవుడు' గా కానీ, ' శక్తిమంతుడైన మానవుడు ' గా ' ప్రజ్ఞాపరుడైన మానవుడు' గా కానీ స్థూలంగా వర్గీకరించవచ్చు."***

" మనిషి ప్రతిరోజూ సుమారు పదహారేసి గంటలసేపు భౌతిక వాహనంగా తనను తాను భావించుకుంటూ ఉంటాడు. నిద్రపోయినప్పుడు కలలు కనేటట్టయితే, సూక్ష్మలోక జీవుల మోస్తరుగానే ఏ వస్తువునయినా అనాయాసంగా సృష్టిస్తూ సూక్ష్మశరీరంలో ఉంటాడు. కలలు లేకుండా కూడా చాలా గంటల సేపు నిద్ర గాఢంగా సాగినట్లయితే అతడు, తన చేతనను లేదా అహంకార తత్వాన్ని కారణ శరీరానికి బదిలీ చెయ్యగలుగుతాడు! అటువంటి నిద్ర పునర్నవీకరంగా ఉంటుంది.

***" కలలు కనేవాడు తన సూక్ష్మశరీరంతో సంబంధం పెట్టుకుంటున్నాడు తప్ప కారణశరీరంతో కాదు కనుక అతని నిద్ర పూర్తిగా పునర్నవీకరం కాదు."***


" యోగానందా! నా ఈ క్రొత్త శరీరం, పాతదానికి పరిపూర్ణమైన నఖలు. ఈ రూపాన్ని నేను నా సంకల్పానుసారంగా ఎప్పుడైనా సరే ప్రత్యక్షం చెయ్యడం, అదృశ్యం చెయ్యడం భూమిమీద చేసిన దానికంటే కూడా తరచుగా చేస్తూ ఉంటాను. శీఘ్రంగా అదృశ్యం చెయ్యడం వల్ల నేనిప్పుడు కాంతిరథం .. అంటే లైట్ ఎక్స్‌ప్రెస్‌లో.. ఒక గ్రహం నుంచి మరో గ్రహానికీ, నిజానికి సూక్ష్మలోకంనుంచి కారణలోకానికీ లేదా భూలోకానికీ, క్షణంలో ప్రయాణం చేస్తూంటాను!

" ఇప్పుడు నువ్వు ఇంకా గట్టిగా చుట్టేసుకుని ఉన్న మాంసమయమైన ఈ నా సూక్ష్మశరీరం, భగవంతుడి మరో సూక్ష్మతరస్వప్నలోకంలో పునరుత్థానం చెందింది. ఎప్పటికో ఒకనాటికి ఈ సూక్ష్మతర స్వప్నశరీరంతో పాటు సూక్ష్మతర స్వప్న లోకం కూడా గతిస్తాయి!

***" కలల బుడగలన్నీ చివరికి, చరమ జాగరణ స్పర్శతో పగిలిపోక తప్పనట్లే .. అవి కూడా ఎప్పటికీ ఉండిపోయేవి కావు .. బాగా అర్థం చేసుకో! "***

# " భగవాన్ శ్రీ సత్యసాయి "

" ఈ దేహాన్ని ఎన్ని విధాలుగా పోషించినా .. ఏ నాడు, ఏ క్షణంలో, ఎలా పోతుందో .. ఎవరికీ తెలియదు. **' ఏ నాటికైనా మృత్యువు తప్పేది కాదు '** అన్నది సృష్టిధర్మం. కనుక .. దేహాభిమానాన్ని విడిచి సేవాభిమానాన్ని పెంపొందించుకుంటూ .. **' మానవసేవే మాధవసేవ '** అన్న సత్యాన్ని గుర్తించి నడుచుకోవాలి " అంటూ మానవ జీవిత పరమార్థాన్ని విశ్వానికి చాటి చెప్పారు భగవాన్ శ్రీ సత్యసాయిబాబా!



అనంతపురం జిల్లాలోని **" పుట్టపర్తి "** అనే ఒక సుగ్రామంలో ధర్మపరాయణులైన **" ఈశ్వరమ్మ " " పెద్ద వెంకమరాజు "** అన్న పుణ్యదంపతులకు 1926 నవంబర్ 23వ తేదీన జన్మించారు **శ్రీ సత్యసాయి**.

సత్యనారాయణ వ్రత ప్రసాదంగా పుట్టిన ఈ బాలుడిని పురిటి గుడ్డపై పడుకోబెట్టగా ఒక సర్పం తన పడగ విప్పి ఆ పసిబిడ్డ దగ్గరే ఎంతో సేపు ఉండటం ఆ గ్రామ ప్రజలందరినీ ఆశ్చర్య పరచింది. బాలుడు **" శేషసాయి అవతారం "** గా భావించిన తల్లితండ్రులు అతనికి **" సత్యనారాయణ రాజు "** అని పేరు పెట్టి **" సత్యం "** అని పిలుచుకుంటూ అల్లారు ముద్దుగా పెంచసాగారు.

బాల్యం నుంచే **" సత్యం "** .. అనేక ప్రజ్ఞా విశేషాలను ప్రదర్శిస్తూ చదువులలో, ఆటలలో పాటలలో ప్రథముడిగా ఉంటూ .. వినయ విధేయతలతో కూడిన క్రమశిక్షణతో తోటి వాళ్ళందరికీ ఆదర్శంగా ఉండేవారు. తమ ఇంట్లో మాంసాహారం వండినప్పుడల్లా .. ఆ ఇంటి ఛాయలకు కూడా పోకుండా .. ఆ దగ్గరలోనే ఉన్న అగ్రహారంలోని **కరణం సుబ్బమ్మ** గారింటికి వెళ్ళి భోజనం చేస్తూండేవారు.

**సత్యనారాయణరాజు** చెప్పే గొప్ప గొప్ప విషయాలనూ, బోధనలనూ వింటూ **కరణం సుబ్బమ్మ *" ఈ బాలుడు ఏదో ఒకనాడు గొప్ప లోకోద్ధారకుడు అవుతాడు "*** అని గట్టిగా నమ్మేది. దీనికి తోడు **" సత్యం "** అనేక మహిమలను చూపిస్తూ .. పశువుల కాపరులూ, తన సన్నిహితులూ కోరిన చిన్న చిన్న కోరికలను సరదాగా తీరుస్తూండేవారు.

**" పుట్టపర్తి "** లోని ప్రాథమిక పాఠశాలలో 1931 నుంచి 1936 వరకు విద్యాభ్యాసం చేసిన **సత్యం** .. ఆ తరువాత అన్నగారైన **" శేషమరాజు "** దగ్గర ఉంటూ .. బుక్కపట్నం మరి ఉరవకొండలో 9వ తరగతి వరకు విద్యాభ్యాసం చేసి ఇక ప్రాపంచిక విద్యలకు స్వస్తి చెప్పారు.

1940 ప్రాంతంలో ఒకసారి ఒక నల్లని తేలు కుట్టడం వల్ల తీవ్ర అస్వస్థతకు లోనైన **సత్యం** .. అపస్మారకంలో పడిపోయాడు. క్రమంగా కోలుకున్న తరువాత వింతగా మాట్లాడడం, సంస్కృత శ్లోకాలను అనర్గళంగా పాడటం .. ఒక్కోసారి ఎవ్వరితోనూ మాట్లాడకుండా గాఢ ధ్యానంలోకి వెళ్ళిపోవడం జరిగేది. తన గురించి ఆందోళన చెందుతూన్న తల్లితండ్రులనూ ఇతర కుటుంబ సభ్యులనూ మరి గ్రామస్థులనూ ఉద్దేశించి ***" నేను పతితులైన మానవాళిని ఉద్ధరించడానికి అవతరించిన ' సాయిబాబా ' ను. నన్ను ఆవరించుకుని ఉన్న మాయ తొలగిపోయింది. ఇక నేను ఏ కార్యం కోసం అవతరించానో ఆ కార్యారంభం కోసం సర్వసంగపరిత్యాగినై వెళ్తున్నాను "*** అని ప్రకటించి తన చేతిలోని మల్లెపూవులను నేలపై చల్లారు. చిత్రంగా అవి ***" సాయిబాబా "*** అన్న అక్షరాలుగా ఏర్పడటంతో .. అందరూ ఆ బాలుడి అద్భుత మహిమను గుర్తించి దైవ సమానంగా చూడసాగారు.

1945లో ***" కరణం సుబ్బమ్మ "*** బాబా కోసం ఒక చిన్న భజన మందిరం నిర్మించి పూజకు అవసరమైన సామగ్రి, ప్రసాదం ఏర్పాటు చేసారు. భజన చేయడం, పిల్లలకు భక్తి పాటలు నేర్పడం, వారికి లడ్డూలూ, పండ్లూ సృష్టించి ఇవ్వడం వంటి మహిమలను చూపిస్తూండేవారు **సత్యసాయి**. ఆ నోటా, ఈ నోటా సాయి గురించిన సమాచారం విన్న ఇతర ప్రాంతాల ప్రజలు కూడా సాయిదర్శనార్థం విపరీతంగా వస్తూండేవారు. దాంతో 1950లో కర్ణాటకకు చెందిన ***" సాకమ్మ "*** అనే భక్తురాలు **పుట్టపర్తి** లోనే ***" ప్రశాంతి మందిరం "*** ను నిర్మించి ఇచ్చారు.

***" ' ఆధ్యాత్మికత ' అంటే వేదాంతం, దైవ భజన మాత్రమే కాదు! మానవసేవే మాధవసేవ ! "*** అంటూ ప్రజలను సన్మార్గంవైపు ప్రయాణింప చేయడానికి .. ***" సత్యసాయి ట్రస్ట్ "*** ను ఏర్పరచారు బాబా. ఈ ట్రస్ట్ ద్వారా ***" సత్యసాయి త్రాగునీటి పథకం "*** ప్రారంభించి .. అనంతపురం జిల్లాతోపాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, రాష్ట్రాల్లోని అనేక గ్రామాలకు మంచినీరు, మరి సాగునీరు అందించే చర్యలు చేపట్టి కోట్లాది ప్రజల దాహార్తిని తీర్చారు.

తల్లి ఈశ్వరమ్మ కోరిక మేరకు ఒక చిన్న పాఠశాలగా ప్రారంభించిన ***" ఈశ్వరమ్మ విశ్వ విద్యాలయం "***.. 1982లో సమాజంలో ఉన్నత విలువలతో కూడిన విద్యను బోధించే అత్యుత్తమమైన ***" డీమ్డ్ యూనివర్సిటీ "*** గా రూపుదిద్దుకుని .. గత మూడు దశాబ్దాలుగా లక్షలాది మందికి శీలవిద్యను అందిస్తోంది. ***" కేజీ నుంచి పీజీ "*** వరకు సాంప్రదాయ విద్యతోపాటు ఆధ్యాత్మిక విద్యనూ, వేదాలనూ బోధిస్తూ **UGC** నుంచి **A+** గ్రేడును కూడా పొందిన ఈ విద్యాలయాల నుంచి ప్రతి యేటా వేలాది మంది విద్యార్థులు పట్టభద్రులై .. ప్రపంచవ్యాప్తంగా తమ ధార్మిక సేవలను అందిస్తున్నారు.

ఆపదలో ఉన్న రోగులకు అతి ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా అందించడానికి అతి ఆధునిక హంగులతో కూడిన ***" సత్యసాయి సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ "*** ను కూడా స్థాపించారు శ్రీ సాయిబాబా.

ప్రపంచం ఏ మార్గంలో నడవాలో .. ఏడు దశాబ్దాల పాటు ఆచరణయుక్తంగా చూపిన సత్యసాయిబాబా .. విశ్వశాంతి కోసం మనిషిలో ప్రేమతత్వాన్ని పెంపొందించడం కోసం తమ బోధనల ద్వారా ఎనలేని కృషి చేసారు. వారి ఆధ్వర్యంలో వెలువడే ***" సనాతన సారథి "*** అన్న ఆధ్యాత్మిక మాసపత్రిక సాయిబోధనలను ఎన్నెన్నో దేశాలకు చేరవేస్తూంటుంది. ***" డా॥ N. కస్తూరి "*** గారు రచించిన ***" Man with Miracles "***, శ్రీమతి విజయకుమారి రచించిన ***" అన్యధా శరణం నాస్తి ", " తపోవనం ", " సత్యం శివం సుందరం "*** అన్న సాయి జీవిత చరిత్ర గ్రంధాలతో పాటు అనేక భాషల్లో రచించబడ్డ సాయి లీలలకు సంబంధించిన గ్రంధాలు ప్రపంచవ్యాప్తంగా ఎంతో మందిని **సాయి భక్తులు** గా మార్చివేసాయి.

❊ ❊ ❊

ఒకానొకసారి బాబావారు ***" నా లీలలు .. ' మెస్మరిజం ' కానీ, ' మిరాకిల్స్ ' కానీ, ' మ్యాజిక్ ' కానీ కావు. అవి నా అనంత శక్తిని మీకు పరిచయం చేస్తున్న విజిటింగ్ కార్డులు మాత్రమే! "*** అని ఎంతో అర్ధవంతంగా ప్రకటించారు. మహాత్ములు, మహాపురుషులు, యోగిపుంగవులు అప్పుడప్పుడూ చూపించే మహిమలు .. మన సంస్కారాన్ని పెంచటానికేకానీ .. మన నమస్కారాలు అందుకోటానికి కాదు. అందుకే .. ఏ విధమైన మారణాయుధాలూ, అధికార ప్రాబల్యం లేకుండా వారు మానవ హృదయంలో దాగిన కామక్రోధాది అంతశ్శత్రువులను కేవలం పరమాద్భుత ప్రేమాయుధంతోనే అంతంచేసి .. దుష్టగుణ సంహారక క్రియను ఒక రక్తబిందువు కూడా చిందకుండా జరిపించారు.

## " కర్తవ్య బోధ "

***" మీ సంకెళ్ళు మీరే తయారు చేసుకుంటున్నారు! నాకు మీలో ప్రతి ఒక్కరి భూత, భవిష్యత్ వర్తమానాలు తెలుసు. అందువల్ల నేను జాలితో కరిగిపోను, నాకు దయలేదు. కానీ .. నాది కఠిన హృదయం కాదు. మీరు తలుపులు మూసుకుంటే నా కారుణ్య కిరణాలు లోపలికి ఎట్లా ప్రవేశించగలవు? ' నాకు కన్నులు లేవు స్వామీ ' అని ఓ భక్తుడు విలపిస్తే .. అతని పరిస్థితి చూసి మిగతా వారి హృదయాలు జాలి పడతాయి .. కానీ నా హృదయం ఎందుకు ద్రవించదు? ఎందుకంటే నాకు అతని గత జీవితం, పరిస్థితులు తెలుసు కనుక. నా ప్రతి క్రియ భిన్నంగా ఉంటుంది. గత జన్మలో బుద్ధిపూర్వకంగా నేను చేసిన కొన్ని పనుల ప్రతిఫలం ఇది కాబట్టి .. ఆ దుష్టచర్యల ప్రతిఫలం అనుభవించనిస్తాను .. కొన్ని ప్రతిఫలాల వల్ల ఆ ఫలాల ప్రభావం కొద్దిగా మారుతుంది. నేను మీ సుఖానికీ, దుఃఖానికీ కారకుడిని కాను. మిమ్మల్ని బాధించే ఈ రెండు సంకెళ్ళను మీరే తయారు చేసుకుంటున్నారు "*** అంటూ ఎరుకతో కర్మలను ఆచరించమని ఉద్బోధించే వారు **సాయి**.

❊ ❊ ❊


తమ 60వ జన్మదినోత్సవాన్ని ఘనంగా చేయాలని ఉవ్విళ్ళూరుతున్న అసంఖ్యాకమైన భక్తులను ఉద్దేశించి స్వామి ***“ ఆకలితో అల్లాడే వానికి ఆధ్యాత్మికతను చెవిలో పోస్తే అది అతన్ని చేరదు. మొట్టమొదట అతని ఆకలి తీర్చే అన్నమే అతనికి పరమాత్ముడు. అన్న స్వరూపుడైన పరమాత్ముడిని అందించండి. ఈ విధంగా ఎవరు ఏ బాధను అనుభవిస్తుంటారో వారికి ఆ బాధ నివారణ రూపంలో పరమాత్ముడిని అందించి నపుడే అతనికి ఆధ్యాత్మికత కొంతవరకు హృదయంలో చేరవచ్చు. కానీ దానికి భిన్నంగా ప్రవర్తిస్తే ఆధ్యాత్మికతకు బదులు నాస్తికత్వమే బయలుదేరుతుంది. నా 60వ పుట్టిన రోజు పండుగ జరిపే ముందు .. ఆరు వేల గ్రామాలను మీరు దత్తత తీసుకుని వాటిని ఆదర్శ గ్రామాలుగా తయారు చేయండి ”*** అంటూ తమ అనుయాయులకు చక్కటి కర్తవ్య బోధ చేస్తారు స్వామి.

అతి నిరుపేద నుంచి అధినేతల వరకూ ప్రతి ఒక్కరినీ ప్రేమగా ***“ బంగారూ .. ”*** అని పిలిచే **భగవాన్ శ్రీ సత్యసాయి** ***“ ప్రేమే నా స్వరూపం; సత్యం నా శ్వాస, ఆనందం నా ఆహారం; అనంతం నా జీవితం; ప్రేమకు కాలం లేదు, చావు పుట్టుకలు లేవు! నా జీవితమే మీకు సందేశం! ”*** అంటూ ఈ లోకానికి తమ దివ్య ప్రబోధాన్ని అందజేసి ఆధ్యాత్మిక జగత్తులో చరితార్థులయ్యారు!



# " ముమ్మిడివరం పెద్దబాలయోగి " (1930-1985)

శాస్త్రజ్ఞానం, సద్గురువు, దేశాటనం ఏమీలేకుండా 16 సంవత్సరాలు నిండక పూర్వమే .. పూర్వజన్మ సుకృతఫలం అనే ఖడ్గంతో .. సంసార పాశాలు ఖండించి .. పరమేశ్వరునిలో స్థిరచిత్తం నిలిపి పరమహంస పదవిని అలకరించిన మహాత్ముడు ముమ్మిడివరం శ్రీ బాలయోగి! లక్షలాదిగా భక్తులు తమను చుట్టుముట్టినా .. రాజులూ, కోటీశ్వరులూ మరి అధికారులూ వచ్చినా కూడా కళ్ళు విప్పి చూడని పరమవిరాగి .. శ్రీ బాలయోగీశ్వరులు!!



తూర్పు గోదావరి జిల్లా అమలాపురానికి 17 కి.మీ దూరంలో ఉన్న **" ముమ్మిడివరం "** గ్రామానికి తూర్పున కుండలేశ్వరం, ఉత్తరాన కోటిపల్లి, దక్షిణాన అంతర్వేది పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. అక్కడి **" సూర్యేశ్వర కేశవ స్వామి "** దేవాలయం ప్రసిద్ధి చెందినది. ముమ్మిడివరం గ్రామం దక్షిణాన ఉన్న హరిజనవాడలో కౌలు వ్యవసాయం చేసుకుంటూ ఉండే నిత్యతృప్తులైన .. ***" గంగయ్య "***, ***" రామమ్మ "*** లకు మూడవ సంతానంగా జన్మించిన ***" సుబ్బారావు "*** గారే .. మన ***" బాలయోగీశ్వరులు "***.

1930 అక్టోబర్ 23వ తేదీన జన్మించిన సుబ్బారావు ఆకారం తండ్రిది మరి పచ్చని బంగారు రంగు మేనిఛాయ తల్లిది. విశాల నేత్రాలు ఆజానుబాహువులతో సుబ్బారావు చూడచక్కగా వుండేవాడు. సుబ్బారావుకి మూడేళ్ళవయస్సు ఉన్నప్పుడు కన్నతల్లి రామమ్మ చనిపోవడంతో అతని తండ్రి మళ్ళీ వివాహం చేసుకున్నాడు.

పది సంవత్సరాల వయస్సు వచ్చేవరకు సుబ్బారావు బడికి వెళ్ళకుండా సవతితల్లి వాత్సల్యం చూరగొంటూ ఇంటిదగ్గరే ఉండేవాడు. ఆ సమయంలోనే అతనిని ***" దొమ్మేటి బాపన్న "*** అనే శెట్టిగారి దగ్గర పశువుల కాపరిగా ఉంచారు.

ఒకసారి 1946వ సంవత్సరం మే .. నెలలో జరిగిన ఒకానొక తిరుణాళ్ళకు వెళ్ళిన సుబ్బారావు .. శ్రీకృష్ణపరమాత్ముడు, నారదుడు ఉన్న చిత్రపటం కొనుక్కుని ఇంట్లో పెట్టుకున్నాడు. ప్రతిరోజూ ఆ చిత్రపటాన్ని చూస్తూ అలాగే మైమరచి పోయేవాడు. ఒకనాటి సాయంకాలం గోవులను రైతు ఇంట్లో తోలి .. ఇంటికి పోయి అన్నం తిని నిద్రపోయాడు. మర్నాడు ప్రాతఃకాలమే లేచి ఆ చిత్రపటాన్ని తీసుకుని గ్రామం దక్షిణాన మూడు ఫర్లాంగుల దూరంలో వున్న **ఇళ్ళ గోవిందరావు**

గారి కొబ్బరితోట మధ్యలో వున్న ఒక కొబ్బరిచెట్టు మొదట్లో .. ఉత్తరదిశగా ఆసనం వేసుకుని కూర్చుని .. పటాన్ని పూజించి నారికేళ కదళీ నైవేద్యం సమర్పించి .. ధ్యానంలోకి వెళ్ళిపోయాడు.

❀ ❀ ❀

ఈ వింత చూసినవారు చెప్పితే తల్లిదండ్రులు కూడా వచ్చారు. అప్పటికే ధ్యానం మొదలుపెట్టి పది గంటలైంది మరి సుబ్బారావుకు దేహస్మృతి లేక .. నిర్వాణదీపకళికవలె వెలుగుతూ ఉన్నాడు. వెంకమ్మ **" ఇంటికి పోదాం "** అని ఎంతో బ్రతిమలాడింది. సుబ్బారావు ఉలకలేదు, పలుకలేదు. బలవంతాన లేవనెత్తి తీసుకుని పోయినా .. ఇంటిముందు అరుగుపై కూర్చుని **" సుబ్బారావు "** మళ్ళీ ధ్యానమగ్నుడయ్యాడు.

ఎంతో బ్రతిమాలితే కొద్దిగా ఆవుపాలు మాత్రం త్రాగాడు కానీ అన్నం ముట్టలేదు. ఈ వింత చూడడానికి జనం తండోపతండాలుగా వచ్చి సుబ్బారావుకు దండాలు పెట్టసాగారు! అక్కడ ఇంత జనం రావడానికి స్థలం చాలక తల్లిదండ్రులు తమ ఇంటికి ఉత్తరాన ఫర్లాంగు దూరంలో వున్న పోరంబోకు స్థలంలో ఒక **పర్ణశాల** నిర్మించారు. అన్నాపానీయాలు మరచిన **" సుబ్బారావు "** ఆ పర్ణశాలలో తపస్సు ప్రారంభించాడు.

పదహారు యేళ్ళ బాలుని ఈ ఘోరతపస్సు గమనించిన పెద్దలు .. ***" బాలయోగీశ్వరుడు "*** అన్నారు. అప్పటినుంచి సుబ్బారావు .. ***బాలయోగీశ్వరులు***గా ప్రసిద్ధులు అయ్యి ముమ్మిడివరం యాత్రాస్థలం అయ్యింది.

బాలయోగీశ్వరులు అష్టాంగయోగంలో ఆరితేరి .. సమాధిలో ప్రవేశించి ఆకలిదప్పులు మరచిపోయారు. దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య బాగా పెరిగి .. వారు వచ్చి ఆయన పాదాలు తాకుతూ చుట్టూ కూర్చుండడంచేత వారికి తపోభంగం కలిగేది. బాలయోగీశ్వరులు ఆ సందడి భరించలేక మందిరానికి తాళాలు వేయవలసిందిగా ఆదేశించారు. దాదాపు రెండు సంవత్సరాల ఎనిమిది నెలలపాటు కళ్ళు విప్పక .. ఎవరితోనూ మాట్లాడక ఆకలి దప్పులను మరచి మందిరంలోనే ఉండిపోయిన బాలయోగీశ్వరులు .. మొదటిసారి కళ్ళు తెరిచి రాజమండ్రి సబ్‌జడ్జి గారితో మాట్లాడారు.

***" నేను నిద్ర, ఆకలి దప్పులు, జలమల విసర్జనలు నా యోగ బలంతో అరికట్టి .. నా జననమరణ చక్రంలోని కడపటి మెట్టులో తపస్సు చేస్తున్నాను. నా జన్మపరంపరలో ఇది చివరిది. ఆచిరకాలంలోనే నా తపస్సు సిద్ధిస్తుంది. నాకు ఏ మాత్రం భంగం కలిగించకూడదు. ఏకాంతం సమకూర్చండి .. తలుపులన్నింటికీ తాళాలు వేయండి "*** అన్నారు.

అది విన్న భక్తులందరూ కూడా **" సంవత్సరానికి ఒకసారైనా మాకు దర్శనం ప్రసాదించండి "** అని కోరగా ***" ప్రతి శివరాత్రి రోజు నేను అందరికీ దర్శనం ఇస్తాను "*** అని మాట ఇస్తూ ..

శివరాత్రి దర్శనానికి వచ్చేవారు పాటించవలసిన విధులను చెప్పారు. వాళ్ళు అడిగిన సందేహాలకు సమాధానాలు చెప్పుతూ .. ఆ రాత్రి చాలా ప్రొద్దుపోయే వరకు తమ చరిత్రతో పాటు అనేక ఆధ్యాత్మిక విషయాలు వివరించారు. ఇదే శ్రీ బాలయోగీశ్వరుల తుది సంభాషణం. అటు తరువాత వారు క్లుప్తంగా సైగలతో చెప్పటమే కానీ .. నోరు విప్పి మాట్లాడలేదు.

భక్తులు కొన్ని రోజులవరకైనా నిత్యదర్శనం ప్రసాదించమని కోరగా .. వారి ప్రార్థన మన్నించి బాలయోగీశ్వరులు ప్రతిదినం ఉదయం 4–5 గంటల మధ్యన దర్శనం ప్రసాదించేవారు. ఆ సమయంలో తాళాలు తీసి వారు లోపలికిపోయేసరికి సువాసనలు గుభాళిస్తూ, కాంతిపుంజాలు మందిరంలో వ్యాపించి ఉండేవి.

ఒకసారి నిత్యదర్శనం సమయంలో శ్రీవారి జటాజూటం శివునికి వలె చక్కదిద్ది ఉండి వారు నూతన ధవళవస్త్రధారులై పద్మాసనంలో కూర్చుని ఉన్నారు. ముఖంలో బ్రహ్మతేజం ఉట్టిపడుతూ వారు ***" బాలశివ స్వరూపం "*** వలె ప్రకాశిస్తూ ఉండగా .. కాస్సేపటికి కాంతిపుంజాలు క్రమంగా తగ్గాయి. ఆ దృశ్యం చూసిన వారి భక్తుడు ***జయంతి స్వామి నాయన*** ఆశువుగా స్తవం చేసారు.

❀ ❀ ❀

ఆ తరువాత బాలయోగీశ్వరుల మందిరంలో ఎన్నెన్నో మహిమలు జరుగుతూ ఉండేవి. ఒకానొకరోజు శ్రీవారి చెంత ఉండే చెంబులోని నీరు చిక్కని మధురక్షీరంగా మారిపోయింది. వారి మందిరం నుంచి పసుపు నీరు, ఆగరు వాసనలు వెలువడేవి. మందిరం పడమటి గోడపై రెండు చిత్తరువులు ఏర్పడి .. భేరీతాళ నినాదాలు వినిపించాయి. వీటితోపాటు ఇంకా ఎన్నెన్నో వింతలు భక్తులను ఆనందాశ్చర్యాలకు లోనుచేసేవి.

1950 ఫిబ్రవరి 16వ తేదీన మహాశివరాత్రి దర్శనానికి భారతదేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు ముమ్మిడివరం తరలివచ్చారు. అప్పుడు బాలయోగీశ్వరులు ఉదయం 4.00 నుంచి 6.00 గంటల మధ్యన వారికి దర్శనం ఇచ్చి మందిరంలోపలికి వెళ్ళిపోయారు. మళ్ళీ సాయంకాలం 6.00 నుంచి 12.00 గంటల మధ్యన దర్శనం ఇచ్చారు.

అదే సంవత్సరం ఆశ్రమ నిర్వహణ కోసం ఒక కమిటీ కూడా ఏర్పాటు చేయబడింది. వారి ఆధ్వర్యంలో దర్శన మండపం మార్పు చేయించి విశాలంగా కట్టించారు. అప్పటి నుంచి ప్రతియేటా శ్రీ బాలయోగీశ్వరులు మండపంలోని శేషపీఠంపై మౌనంగా కూర్చుని ఉదయం 4.00 గంటల నుంచి రాత్రి 12.00 గంటల వరకు దర్శనం ఇచ్చేవారు. ఆ దర్శనం రోజు దేశం నలుమూలల నుంచి వచ్చే లక్షల జనంతో ముమ్మిడివరం కిటకిటలాడేది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా .. ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసేది.

❀ ❀ ❀

బాలయోగీశ్వరులు తపస్సమాధిలో ఉండే మందిరం తలుపులు ఏడాదికొక్కసారి శివరాత్రికి మాత్రమే .. తమంత తాముగా తెరచుకునేవి. కానీ .. ఒకసారి 1970-71 శివరాత్రికి వారం రోజుల ముందే తలుపులు తెరచుకున్నాయి. అందరూ ఆశ్చర్యపోతూ ఉండగా ఆశ్రమ కమిటీ సభ్యులు ముగ్గురినీ బాలయోగీశ్వరులు పిలిచి .. ***“ రాజమహేంద్రవరం వెళ్ళి శ్రీ ఎక్కిరాల వేదవ్యాస IAS గారిని తోడ్కొని రావలసింది ”*** అని ఆదేశించారు.

వెంటనే వారు రాజమహేంద్రవరం వెళ్ళి బాలయోగీంద్రుల వారి ఆదేశాన్ని శ్రీ వేదవ్యాస గారికి అందించి .. వారిని వెంటనే తోడ్కొని వచ్చారు.

బాలయోగీశ్వరులు వేదవ్యాసగారిని తమ చెంతకు పిలుచుకుని ప్రక్కన కూర్చుండబెట్టుకున్నారు. ఆ ఇరువురూ సమాధిస్థితిలో ఏ మౌన సంభాషణలు జరిపారో కానీ .. రాత్రి 8.00 గంటల నుంచి తెల్లవారు 6.00 గంటల వరకు ఆ ధ్యాన స్థితిలోనే ఉండిపోయారు. ఆ తరువాత రెండు శివరాత్రుల వరకు శ్రీ వేదవ్యాసగారే ఆశ్రమ కమిటీకి అధ్యక్షులుగా ఉన్నారు.

1951 నుంచి బాలయోగీశ్వరుల సవతితల్లి వెంకమ్మగారి జ్యేష్ఠపుత్రుడు ***“ శ్రీ భూషణం ”*** కూడా అన్నగారి అడుగుజాడల్లో .. కఠిన తపస్సు చేసి సిద్ధుడై .. ***“ చిన్న బాలయోగీశ్వరులు ”*** గా ప్రసిద్ధులు చెందారు. అన్నగారి ఆశ్రమం వెనుక తమ్ముని ఆశ్రమంతో పాటు తపోమందిరాలు కూడా వెలసి .. ప్రపంచవ్యాప్తంగా ముమ్మిడివరం ప్రశస్తి మరింతగా ఇనుమడించింది. సోదరయోగుల దర్శనానికి లక్షలాదిగా భక్తులు ముమ్మిడివరం రావడంతో .. ముమ్మిడివరం గ్రామం భారతదేశంలోని యోగభూమిగా, పుణ్యభూమిగా ప్రసిద్ధిగాంచింది.


❊ ❊ ❊

1985 జూలై నెల మధ్యలో ఒకసారి బాలయోగీశ్వరులు తమ భక్తులకు స్వప్నంలో కనబడి .. ***“ లోకకల్యాణార్థం నేను నా అవతారం సమాప్తి చెయ్యాల్సిన సమయం వచ్చేసింది! ఇక నేను నా దేహం చాలించదలిచాను ”*** అని స్పష్టంగా చెప్పారు. దాంతో వారి భక్తులు ఆందోళన చెంది మందిరం వద్దకు వచ్చి తలుపులు తెరిచి చూడగా .. వారికి శ్రీవారి మృతకళేబరం కనబడింది.

శ్రీవారి నిర్యాణ వార్త తెలిసిన తరువాత .. దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది తరలిరాగానే వారి భక్తుల సమక్షంలో .. 19-07-1985 నాడు శ్రీవారి భౌతికకాయాన్ని మందిరంలో సమాధి చేసారు. ఆనాటి నుంచి ఏటేటా శ్రావణ శుద్ధ విదియనాడు తమ .. భక్తి, తపో మహిమల ద్వారా లోక కల్యాణం కోసం శ్రమించిన ***“ శ్రీ ముమ్మిడివరం బాలయోగీశ్వరులకు ”*** ఆరాధనోత్సవాలు మరి  నిత్యపూజలు అక్కడ జరుపబడుతున్నాయి.

# " కొత్తలంక .. సయ్యద్ అహ్మదలీ షా ఖాదర్‌వలీ "

**( 1818-1948 )**



ప్రపంచంలోని వివిధ ధర్మాలు పరమాత్మను చేరుకునే మార్గాలు. బ్రహ్మ కోవిదులూ, పరమాత్మతో ఆత్మానుసంధానం సాధించిన యోగులూ, సిద్ధ పురుషులూ .. అన్ని కులాలలోనూ, అన్నిమతాలలోనూ ఉన్నారు. భారతీయ సనాతన ధర్మం కుదురులో పుట్టిన వివిధ సంప్రదాయాలలో మహా పురుషులు జన్మించినట్లే భారతదేశంలోకి చొచ్చుకుని వచ్చిన ఇస్లాం మతంలో కూడా .. మహానుభావులూ, సిద్ధపురుషులూ అనేకమంది జన్మించి .. పూజలు అందుకుంటున్నారు. అలాంటి వారిలో తూర్పుగోదావరి జిల్లా అమలాపురం తాలూకా ముమ్మిడివరం మండలం, **" కొత్తలంక "** గ్రామంలో క్రీ.శ. 1948లో సిద్ధిపొందిన ***" సయ్యద్ అహ్మదలీ షా ఖాదర్‌వలీ "*** గారు ముఖ్యులు.

1931 జనాభా లెక్కలప్పుడు కొత్తలంక నివాసి కొండపల్లి యజ్జన్న .. తన బ్లాకులో నివాసం వున్న ఈ యోగిగారిని ప్రశ్నించి అతి కష్టం మీద కనుక్కున్న సమాచారం ప్రకారం .. ఈ మహా పురుషుడు .. నిజాం రాజ్యంలోని నల్లగొండ జిల్లా గొల్లపల్లి జాగీరుదార్ల వంశంలో జన్మించారు. అప్పటికే వారి వయస్సు 125 సంవత్సరాలు కనుక దీని ప్రకారం వారు క్రీ.శ. 1818లో జన్మించారని జనాభా లెక్కల వాళ్ళు నిర్ధారణకు వచ్చారు. వీరి తల్లిదండ్రుల పేర్లు తెలియవు.

1850 ప్రాంతాలలో ***" కుండలేశ్వరం "*** గ్రామం గౌతమీతటాన గల మిఠాయిపాక దగ్గర ఈ మహానుభావుడు కౌపీనమాత్ర ధారియై .. చెంతన ఒక మట్టి పాత్రతో ఉంటూండేవారట. శీతతాపాలు లెక్కచేయకుండా ఇష్టం వచ్చినప్పుడు ఎవరేది పెడితే అది తిని ఉండేవాడట. ఒకటి రెండు సార్లు ఈ ***వలీబాబా*** తమ శరీరం తడవకుండా గౌతమీ నదిని అవలీలగా దాటడం గమనించిన ఆ ఊరి వాళ్ళు ***" ఇతడు సిద్ధపురుషుడు "*** అని గుర్తించారట.

***వలీబాబా*** కుండలేశ్వరంలో ఉంటున్నప్పుడే, రాజమహేంద్ర వరం కోటిలింగాల మఠంలో ఉంటున్న ***" కృష్ణావధూత "***.. వారి అనుగ్రహం కోసం వెంటబడి తిరిగేవాడట. వారించినా తమ వెంటపడి వస్తున్న కృష్ణావధూతను ***వలీబాబా*** రాళ్ళతో కొడితే చూసినవారు ***" తురక పిచ్చివాణ్ణి ఆశ్రయించినందుకు మంచి శాస్తి జరిగింది "*** అని పరిహాసం చేసారట. అయితే .. ***" శ్రీవారు నన్ను పరీక్షించడానికే అలా చేస్తున్నారు కానీ, కోపంతో కొట్టలేదు "*** అని సమాధానం చెప్పిన కృష్ణావధూత .. పట్టుదలతో ***వలీబాబా*** గారిని సేవించి చివరకు కృతార్థుడైనాడట.

❀ ❀ ❀

***వలీబాబా*** ద్వంద్వ రహితులై ఒకప్పుడు కౌపీనంతోనూ .. మరొకప్పుడు దిగంబరంగా .. చెట్లు, పుట్టలు, గుట్టలు తిరుగుతూ  చేతికి అందిన ఆకులు వాసన చూస్తూ .. ఎవరైనా సమీపిస్తే

వారిని అదలిస్తూ తిరుగుతూండేవారు. చూపరులకు అసహ్యంగా కనబడే వీరు పవిత్రులైనా .. అపవిత్రంగా గోచరించేవారు. ఎక్కడపడితే అక్కడే పడుకునేవారు. భక్తి ప్రపత్తులతో తమ దర్శనార్థం వచ్చిన వారు ఏమిచ్చినా తినేవారు. శిష్యులను కఠినంగా పరీక్షించేవారు .. మరి ఆ పరీక్షల్లో నెగ్గిన వారినే అనుగ్రహించేవారు.

***వలీబాబా*** .. ఆశ్రితులు అడిగే శుభాశుభప్రశ్నలకు సమాధానాలు చెపుతూ లోకోపకారం చేసేవారు. ఒకసారి గేదెల వెంటరత్నం .. ***" నల్లగొండ మండలం నుంచి మీరు ఇంత దూరం ఎందుకు వచ్చారు ?"*** అని అడిగితే ***" ప్రారబ్ధం కొట్టుకు వచ్చింది "*** అన్నారట.

***నాగపూర్*** లో దేహం చాలించిన ***తాజుద్దీన్ బాబా (1861-1925)*** గారికి ***వలీబాబా*** మిత్రులు. ***వలీబాబా*** తాజుద్దీన్ బాబాతో కలిసి నాగపూర్‌లో కొంత కాలం ఉన్నారట. షిర్డీ సాయిబాబా .. తాజుద్దీన్ బాబాను తమ సోదరుడుగా భావించినట్లు ***" సాయిలీలామృతం "*** లో ఉంది.

❀ ❀ ❀

కేశనకుఱ్ఱు వాసి మాధవరపు కొండయ్య భార్య కుసుమ వ్యాధితో బాధపడుతూ ***వలీబాబా*** ని సేవించి ఆరోగ్యంతో పాటు సంతానాన్ని కూడా పొందింది. ఒకానొకరోజు ఆమె తన భర్తనూ, కొడుకునూ, తీసుకుని కుండలేశ్వరం వెళ్ళి ***వలీబాబా*** కి పాయసం సమర్పించింది. ఆయన కొద్దిగా త్రాగి కొంత మిగిలించి ఇవ్వగా వాళ్ళు ఆ భుక్తశేషాన్ని ప్రసాదంగా తిన్నారు. ***వలీబాబా*** సంతోషించి ఆ దంపతులను ఆశీర్వదించడంలో ఆ కుటుంబానికి ఆయురారోగ్యాలతో పాటు అనుకోని సిరిసంపదలు కూడా కలిసి వచ్చాయి.

***వలీబాబా*** కుండలేశ్వరంలో వుంటూండగా పొరుగూరు కొత్తలంక వాసి ***" గేదెలస్వామి "*** అనే గృహస్థుడు .. తన రెండవ కొడుకు ***" గోవిందరాజులు "*** సంతానవంతుడు కాకపోవడం చేత వారిని ఆశ్రయించడానికి పంపిస్తే .. అతడు రెండు కొబ్బరి బొండాలు తీసుకువెళ్ళి సమర్పించాడు. ***వలీబాబా*** గారు కోపించి గోవిందరాజులను తరిమివేసాడు. ఓపికతో మరునాడు మళ్ళీ రెండు బొండాలు పట్టుకుని వెళ్ళగా ***వలీబాబా*** ఆరగించారు.

గోవిందరాజులుకు క్రమంగా ***వలీగారు*** పట్ల ఆసక్తి, ప్రేమ పెరిగి .. లభించిన ఫలాలు సమర్పిస్తూ వెంట తిరుగుతూ సేవలు చేయడం అలవాటైంది. గురుసేవలో గోవిందరాజులు తన కోరిక మరచిపోయాడు. అతనిలో గురుసేవాతత్పరతతో పాటు వైరాగ్యం పెరిగింది; అస్థిరమైన సంపద పైన కాకుండా స్థిరమైన ఆధ్యాత్మిక సంపదపైన దృష్టి మరలింది. గురువు గారి ఆశీస్సులబలమో, దైవయోగమో గోవిందరాజులుకు నలుగురు కూతుళ్ళు, ఒక కొడుకు పుట్టారు.

గేదెలస్వామికి మనుమరాండ్రు- మనుమడు కలిగిన సంతోషం కంటే గోవిందరాజులు నిరంతరం ***వలీబాబా*** వెంట తిరుగుతూ సంసార విముఖుడైపోతున్నాడన్న చింత ఎక్కువైంది.

గోవిందరాజులు ఇంటికి రావడం మానివేసి గురువుగారికి నీడవలె తిరుగుతూంటే .. గేదెల స్వామి తన పెద్ద కొడుకు గేదెల వెంకటరత్నంతో కలిసివెళ్ళి గురువునూ, శిష్యుడినీ బ్రతిమిలాడి **వలీబాబా** గారిని కుండలేశ్వరం విడిచి కొత్తలంకలో ఉండడానికి ఒప్పించారు.

**వలీబాబా** గారు ***" కొత్తలంక "*** కు మారితే గోవిందరాజులు స్వగృహంలో ఉంటూ గృహకృత్యాలు నెరవేరుస్తూ గురుసేవ చేస్తూ ఉండవచ్చు అనుకున్నారు. వారనుకున్నట్లు **వలీబాబా** కొత్తలంకకు రావడంతో గోవిందరాజులు స్వగృహం చేరాడు.

**వలీబాబా** కొత్తలంకకు వచ్చారే కానీ, ఎప్పుడూ ఏకాంతంగా కొబ్బరి తోటల్లో తిరిగేవారు. ఇల్లు విడిచి గురువు వెంట తిరగడం శిష్యుని పని. శిష్యునిలో పెరుగుతున్న వైరాగ్యం సంసార వైముఖ్యం హద్దులు దాటుతున్నాయి. కలతపడిన తండ్రి, సోదరులు గోవింరాజులు పై సామ దాన భేద దండోపాయాలు ప్రయోగించ పూనుకున్నారు.

***" నీ గురువు మహత్యం ఏమిటో చెప్పు! చెప్పలేకపోతే ఆయనను విడిచి పెట్టి ఇంటి పనులు చూడు "*** అంటూ సంకటంలో పెట్టారు. అయినా అతడు నిర్లిప్తుడుగా ఉన్నాడు. గురువుగారు శిష్యుని సంకటం తొలగించే సమయం వచ్చింది.

ఒకరోజు **వలీబాబా** నిర్జనస్థలంలో ఉండగా అకస్మాత్తుగా వివపరీతమైన గాలివాన వచ్చి ఊరంతా జలమయమైపోయింది. ***" ఇంత వానలో వలీబాబా ఎక్కడున్నారో "*** అంటూ గోవిందరాజులు తోటలు దొడ్లు తిరిగి .. చివరకు పెద్ద కాలువ గట్టుమీద ముఖానికి తాటిమట్ట అడ్డం పెట్టుకుని కూర్చున్న **వలీబాబా** గారిని కనుగొని భుజానికెత్తుకుని తన ఇంటికి మోసుకుని వచ్చాడు.

వానలో తడిసి ముద్దయి గజగజ వణుకుతున్న గురువుగారిని ఒక గదిలో ఉంచి .. చలిమంట వేసి .. నిద్రాభంగం కలుగకుండా తలుపు పెట్టి, అన్న వెంకటరత్నంతో మాట్లాడుతూ గది బయటే కాపలా కాస్తున్నాడు. నాలుగు గంటల తరువాత తలుపు తీసి చూస్తే **.. వలీబాబా** గదిలో లేరు. ఆ గదికి వేరే వాకిలి కూడా లేదు. ఉన్న వాకిలి మూసి తామే కాపలా ఉన్నారాయె!

ఇల్లంతా వెదకి అన్నదమ్ములు బయలుదేరారు. ఊరంతా తిరుగుతూ గురువు జాడ అడుగుతూంటే .. ఊరివారు గుంపులు గుంపులుగా చేరి జరుగగూడనిది ఏదో అశుభం జరిగిందను కున్నారు. ఇంతలో **వలీబాబా** ఉత్తర వీథిలో తిరుగుతున్నట్లు వార్త వస్తే అన్నదమ్ములు పరుగెత్తుకుని పోయి వారిని తీసుకుని వచ్చారు.

తలుపులు మూసిన గదిలో సశరీరంగా ఉన్న **వలీబాబా** .. మరొక వీథిలో కనిపించడంతో వెంకటరత్నం కళ్ళు తెరచుకున్నాయి. ***" వలీబాబా సామాన్యయోగి కాదు"*** అనీ ***" మహా***

***మహిమాన్వితుడైన అవధూత "*** అనీ వెంకటరత్నం గుర్తించడమే కాకుండా .. తమ్ముణ్ణి అనుసరించి తానూ ***వలీబాబా*** భక్తుడయ్యాడు. ఈ విధంగా గోవిందరాజులు సంకటం తొలగి .. అతని గురుసేవా వ్రతం నిరంతరాయంగా సాగింది.

కఠిన పరీక్షలు పెట్టిన గురువూ, గురువుపై అచంచల విశ్వాసంతో పరీక్షలకు తట్టుకున్న శిష్యుడూ ఇద్దరూ ఇద్దరే!

పుత్ర సంతానార్ధులైన స్త్రీలు వలీగారిని ప్రార్థిస్తే దీవించేవారు; పుత్రవతులు వచ్చి శిశువులకు పేరేమి పెట్టవలెనని అడిగితే రాముని పేరు పెట్టమనేవారు. ఇది వారి రామభక్తికి నిదర్శనం.

***వలీబాబాకి*** భక్తితో చేసే భజనలే ఇష్టం. గొప్ప సంగీత విద్వాంసులు వచ్చి పాడుతాం అంటే వద్దనేవారు. గోవిందరాజులు, సుంకరి రామదాసు భక్తితో భజన చేస్తూంటే శ్రద్ధగా వినేవారు. ***వలీబాబా*** భక్తి ప్రధానంగానీ సంగీతం కాదు.

ఒకనాడు ***వలీబాబా*** గారు పచ్చుమట్ల రామకృష్ణంరాజు కొబ్బరి తోటలో పడుకుని ఉండగా ఒక పాము వారితలపై ఎండ పడకుండా పడగ విప్పి గొడుగులా అడ్డం పట్టిన దృశ్యాన్ని ఆ గ్రామస్థులంతా చూసారు! ఎవరైనా ఊళ్ళోకి తీసుకువస్తే ***వలీబాబా*** మారుమాట్లాడకుండా వచ్చేవారు. ఎవ్వరూ తీసుకురాకపోతే నెలల తరబడి కొబ్బరితోటలలో నిర్జనస్థలాలలో ఉండిపోయేవారు.

***వలీగారు*** గొప్ప భక్తుల్లో ఆకుండి సుబ్రహ్మణ్యశాస్త్రి గారు ఒకరు! ***వలీబాబా*** అధికసంఖ్యలో అన్ని వర్ణాల వారు ప్రేమించి సేవించారు. ఒకసారి అమలాపురం వాస్తవ్యులు కొందరు వచ్చి వలీబాబా చేయిపట్టి బండి ఎక్కించి అమలాపురం తీసుకునిపోయి ఒక ఇంట్లో విడిది చేయించి ఉత్సవ ప్రయత్నాలు చేస్తూండగా .. వాళ్ళందరి ముందే మాయమై కొత్తలంకలో ప్రత్యక్షమయ్యారు.

❀ ❀ ❀

***వలీబాబా*** ప్రదర్శించిన ఖండయోగం , రంగూన్ సైనికాధికారితో ఆ దేశంపై బ్రిటిష్‌వారు దాడి చేస్తారని చెప్పిన కాలజ్ఞానం, కొబ్బరికాయలకు కొమ్ములు మొలిపించిన అద్భుత లీలలు ***' ఆంధ్రభూమి '*** పత్రికలో అప్పట్లో సంచలనం రేపాయి!

ఒకానొకసారి గ్రామస్థులు ***వలీబాబాని*** వెంట బెట్టుకుని వస్తూ ఉండగా త్రోవలో ఒక పాము వారి కాలుకు చుట్టుకుని కరచింది. ***వలీబాబా*** ఆ పామును బలవంతంగా లాగివేసారు. అది పరుగెత్తివచ్చి మళ్ళీ కరచింది. ప్రక్కన్న ఉన్న వాళ్ళు దానిని చంపడానికి ప్రయత్నిస్తే ***వలీబాబా*** వారించారు. ఊళ్ళోకి వచ్చి ఏ బాధ లేకుండా రాత్రి గడపినారు. వారికేమీ కాలేదు గాని తెల్లవారే సరికి ఆ పాము చచ్చిపడి ఉంది. అది వలీబాబా అద్భుత లీల!

అహింసావ్రతులైన ***వలీబాబా***ని నిజంగా ఆ పాము కరిచిందా? క్రూర సర్పాలు తమ సహజగుణాన్ని అహింసావ్రతులముందు మరచిపోతాయి అన్న దానికి భగవంతుడే సర్పరూపంలో వచ్చి ***వలీబాబా*** అహింసావ్రతం పరీక్షించి ఆయన ప్రభావాన్ని లోకానికి చాటడానికై సర్పశరీరం అక్కడే వదలిపోయాడా?

❀ ❀ ❀

***వలీగారు*** ఉర్సు సందర్భంగా 1996 జూలై 28, ***' ఈనాడు', ' ఆంధ్రభూమి '*** పత్రికలు తూర్పు గోదావరి అనుబంధాల్లో ప్రత్యేక వ్యాసాలు ప్రచురించారు. ***' ఈనాడు '*** పత్రికలో ***వలీబాబా*** క్రీ.శ. 1818లో జన్మించారనీ 22-1-1948 నాడు శరీరం చాలించారనీ, 1953లో వారి సమాధి పై దర్గా నిర్మించారనీ వ్రాయబడింది. 1947లో అప్పటి కాంగ్రెస్ నాయకులు ***బ్రహ్మశ్రీ కళా వెంకట రావు, బ్రహ్మశ్రీ బులుసు సాంబమూర్తి*** గార్లు కొత్త లంకకు వెళ్ళినప్పుడు ***వలీబాబాను*** దర్శించారనీ, అప్పటికే వారి వయస్సు 130 సంవత్సరాలనీ ఉంది.

***వలీబాబా*** 22-1-1948 .. మహమ్మద్ ప్రవక్త జన్మదినం ***" మిలాద్ -ఉన్ - నబీ "*** పండగ నాడు జీవసమాధి అయ్యాక .. వారి ఉర్సుకు దేశం నలుమూలల నుంచి మరి ఆంధ్రేతర ప్రాంతాల నుంచి కూడా లక్షలాది హిందువులు, ముస్లింలు వచ్చేవారు. వలీబాబా నీళ్ళ మీద నడవడం, మంచులో పడుకోవడం వంటి మహిమలు, తమ దర్శనానికి వచ్చేవారికి మౌనభాషలోనే చక్కని జీవితగమనం నేర్పడం వంటి విషయాలు అందరూ ఈనాటికీ చెప్పుకుంటూంటారు.



# " H.P. బ్లవాట్స్కీ "

**" మేడమ్ బ్లవాట్స్కీ "** ఆధ్యాత్మిక జగత్తులో ఒక నవీన విప్లవం! రష్యాలో పుట్టి, దేశ దేశాలు పర్యటించి, ఆత్మల ఆచూకీ తెలుసుకుని .. భారతీయ సనాతన ధర్మాన్ని బౌద్ధ ధర్మంతో మేళవించిన గొప్ప విప్లవపతాక ఆమె!! ప్రపంచ వ్యాప్తంగా థియోసోఫికల్ సొసైటీ ఉద్యమాన్ని చేపట్టిన ఈ ధీమణి .. ప్రాచీన యోగసూత్రాలను వెలికి తీసి మతాలనూ, ఛాందసాలనూ, అంధవిశ్వాసాలనూ కరిగించి భౌతిక జీవితపు సరిహద్దులను చెరిపి వేశారు.



***" ఈ భూమ్మీద జన్మతీసుకున్న ప్రతిఒక్క మనిషి కూడా మానవత్వంలో జీవిస్తూనే దైవత్వాన్ని పొందాలి "*** అన్నదే సృష్టి లక్ష్యం. విశ్వకల్యాణం కోసం మనిషిని ఉద్ధరిస్తూ వారిని మంచి మార్గంలో నడపడానికి పైలోకాలలో ఉన్న అమరత్వం సాధించిన సద్గురువులూ మరి పరమగురువులూ తిరిగి మళ్ళీ మానవ జన్మకు రాకుండా .. తమ పరేగింత ప్రజ్ఞను మాత్రం ఉన్నతమైన జీవితాలను గడుపుతోన్న కొందరిలోకి పరకాయ ప్రవేశం చేయిస్తూ తాము అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తూంటారు. అందుకు గాను వారు ఆత్మ జాగృతి చెందిన ఉన్నతాత్మలను ఎంపికచేసి .. వారిని ఈ భూమి మీదకు పంపిస్తూ .. వారి ద్వారా ఆత్మల ప్రగతిని సమీక్షిస్తూంటారు!! అలా పరమ గురువులచే ఎంపిక చేయబడిన స్త్రీ మూర్తే .. ***" మేడమ్ బ్లవాట్స్కీ "***.

**హెలెనా పెట్రోవ్నా బ్లవాట్స్కీ** .. 1831 ఆగస్టు 12వ తేదీ అర్ధరాత్రి .. అంటే **మెరీడియన్ టైమ్** (జీరో అవర్) లో **దక్షిణ రష్యాలోని " ఎకాటరని స్లోవ్ "** పట్టణంలో జన్మించింది.

తండ్రి **కల్నల్ పీటష్,** తల్లి **హెలెనా ఫదయేవ్.** బ్లవాట్స్కీ తల్లి, అమ్మమ్మ ఇద్దరూ కూడా సాహితీవేత్తలు! వారు రష్యా ప్రభువు ***గ్రాండ్ డ్యూక్ రోరిక్*** రాజవంశానికి చెందిన అతి సంపన్నులైన వారసులు.

బాల్యంలో **హెలెనా** ప్రవర్తన అందరి పిల్లల్లా కాకుండా విచిత్రంగా ఉండేది. ఆమె తన మీద ఎవరి పెత్తనాన్ని కూడా సహించేది కాదు. సాంప్రదాయాలపైన, ఆచారాలపైన తిరగబడడం ఉగ్గుపాలతోనే మొదలుపెట్టింది. ఒంటరిగా తోటలలో, నిర్జన ప్రదేశాలలో గడపడానికే ఆమె ఇష్టపడేది. అయితే ఆమె ప్రజ్ఞ మాత్రం బహుముఖంగా ఉండేది. అద్భుతమైన తెలివితేటలు, చక్కటి భాషా పటిమతో ఆమె మాట్లాడుతూంటే బంధువులకూ, స్నేహితులకూ మతులు పోయేవి.

ఎక్కడా నేర్చుకోకపోయినా .. **పియానో** అద్భుతంగా వాయించేది! మరి అందమైన బొమ్మలను బహుచక్కగా చిత్రీకరిస్తూండేది!

ఒకసారి **హెలెనా** తన అక్కతో కలిసి .. తమ ఊరుకి దగ్గరలో పండు ముసలి జ్ఞాని అయిన ఒక యోగి వచ్చాడని తెలిసి ఆయనను దర్శించుకోవడానికి వెళ్ళింది. ఆయన హెలెనాను చూసి ***" ఈ అమ్మాయి అందరిలాగా జీవించదు; ఆమెలో దివ్యశక్తులు గూడుకట్టుకుని ఉన్నాయి కనుక భవిష్యత్తులో చాలా గొప్ప వ్యక్తి అవుతుంది; నా మాటలు నిజమయ్యే నాటికి నేను బ్రతికి వుండను "*** అని చెప్పాడు.

1860 లో .. రష్యా దేశంలో కెల్లా ముఖ్యులైన ముగ్గురు *ప్రధాన మతాచార్యులలో ఒకరు* .. ***" అమ్మాయీ! నీలో మహాశక్తులు నిగూఢంగా ఉన్నాయి; వాటిని కానిపనులకు వినియోగించి కష్టాలు కొని తెచ్చుకోకుండా .. విశ్వప్రయోజనాలకు మాత్రమే ఉపయోగించు "*** అని సలహా ఇచ్చారు.

❀ ❀ ❀

**హెలెనా** చిన్నతనంలోనే తండ్రి వెంట ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, ఇంగ్లాండు దేశాలకు వెళ్ళి కళలు, సంగీతంలో మంచి ప్రావీణ్యాన్ని పొందింది. సహజ సౌందర్యంతో పాటు, విశేష ప్రజ్ఞ మరి కళా చాతుర్యం .. ఆమెను ఒక విశిష్టమైన ప్రత్యేక మహిళగా మలిచాయి.

కొంతకాలానికి తల్లి మరణించడంతో **హెలెనా** తన అక్కతో కలిసి ***సారటోవ్*** లోని అమ్మమ్మగారింటికి వెళ్ళిపోయింది. పెద్ద రాజప్రాసాదాన్ని పోలిన ఆ గొప్ప కోటలాంటి భవంతిలో ఎక్కడో ఏ మూలనో ఒంటరిగా కాలం గడుపుతూండేది **హెలెనా!** ఎవ్వరితోనో మాట్లాడుతున్నట్లూ .. తన చుట్టూ పదిమంది ఉన్నట్లూ సంభాషణలు జరుపుతూండేది! అలా అదృశ్యంగా ఉన్నవాళ్ళతో ఆమె అప్పటినుంచే సంబంధాలు నెరపుతూ ఆ భవంతిలోని లైబ్రెరీలో కూర్చుని గంటల తరబడి పుస్తకాలు చదువుతూ గడిపేసేది!

**హెలెనా**లోని ఈ విచిత్రప్రవర్తన పెద్దవాళ్ళను ఖంగారు పెట్టేది. ***" పెళ్ళి అయితే పిచ్చి కుదురుతుంది "*** అనుకుని ఆమె ఆలనా పాలనా చూసే గవర్నెస్ .. హెలెనా కంటే మూడింతల వయస్సున్న ***నికిఫర్ బ్లవాట్స్కీ*** అనే రష్యన్ ముసలివాడికి ఆమెను ఇచ్చి పెళ్ళి చేసింది.

***" నేను భర్తకు విధేయురాలిగా, భార్యగా ఉంటాను "*** అని పెళ్ళినాడు చర్చిలో ప్రమాణం చెయ్యమని ఫాదర్ చెప్పగా ***" నేను చచ్చినా విధేయంగా ఉండను; అతడితో కాపురం చెయ్యను "*** అని ముఖం మీదే చెప్పేసి .. అదే రోజు ఇల్లూ ఊరు వదిలి వెళ్ళిపోయింది హెలెనా !!

అలా ఇల్లూ, ఊరూ, వదిలి వెళ్ళిన ఆమె దేశ దేశాలూ తిరుగుతూ తన క్షేమ సమాచారాలను మాత్రం తండ్రికి ఎప్పటికప్పుడు ఉత్తరాల ద్వారా తెలియజేస్తూండేది. ఆమె అవసరాలకు మించిన

డబ్బుని తండ్రి పంపుతూండేవాడు. ***టర్కీ, ఈజిప్టు*** దేశాలను విస్తృతంగా పర్యటించిన **హెలెనా ..** పిరమిడ్‌లను గురించిన విజ్ఞాన విశేషాలను పరిశోధనాత్మకంగా తెలుసుకుంది. ఒంటరిగా ***" గ్రేట్ గిజా పిరమిడ్ "*** లో గడిపిన మొట్టమొదటి ధీర వనిత ఆమె! నిగూఢ రహస్యాలను వివరణాత్మకంగా తెలుసుకుని వాటి అంతుచూసేదాకా ఆమె వదిలేది కాదు!!

❀ ❀ ❀

1851 నాటికి ఇరవై యేళ్ళ వనితగా ఉన్న ***బ్లవాట్‌స్కీ .. లండన్*** చేరుకుని తన ఇరవయ్యవ పుట్టినరోజునాడు తనను జన్మజన్మల నుంచి నడిపిస్తోన్న తన **పరమగురువు** .. ***" మహాత్మా మోరియా "*** ను కలుసుకోవడం జరిగింది! ఆనాటి నుంచీ ఆయన దృశ్య-అదృశ్య రూపాల్లో ఆమె ఆధ్యాత్మిక జీవితానికి దిశా నిర్దేశనం చేస్తూ .. ఆమె హృదయంలో గురుస్థానాన్ని పొందారు. భారతదేశానికి చెందిన కొన్ని వందల యేళ్ళ క్రిందటి రాజపుత్రుడు అయిన ***" మహాత్మా మోరియా "***.. ఒకానొక రష్యన్ వనితకు పరమగురువు కావడం అద్భుతాలలో కెల్లా పరమాద్భుతం!!

గురు దర్శనంతో వెయ్యి ఏనుగుల బలం అంతరంగం లో నిండిన ***బ్లవాట్‌స్కీ*** .. ***" ఈ విశాల విశ్వం అంతా కూడా నాకు ఒకానొక విహార వేదిక "*** అనుకుంది. కేవలం ఒక్క రష్యా దేశానికే చెందిన మహిళగా కాకుండా .. ***విశ్వ మహిళ***గా నిర్భయంగా ప్రపంచయాత్రకు బయలుదేరింది. విదేశీయానాలే కష్టం అయిన ఆ రోజుల్లో .. ఒక మహిళ అయి ఉండి కూడా **హెలెనా** ఎంతో ధైర్యంతో **కెనడా, అమెరికా, మెక్సికో, *దక్షిణ అమెరికా*, వెస్టిండీస్, *శ్రీలంక*** దేశాలు తిరుగుతూ ***భారతదేశం*** చేరుకుంది! అందమైన చిన్నవయస్సు మహిళ, రాజకుటుంబీకురాలు పైగా భర్తను వదిలి వేసిన అపవాదు కూడా ఉండటంతో .. ఆమె ఎన్నెన్నో అపనిందలను ఎదుర్కోవాల్సి వచ్చింది. ***" ఆమె ఆరాటం అంతా సత్యాన్వేషణ "*** అని చెప్పినా అర్థం చేసుకునే స్థితిలో ఆనాటి సమాజం లేదు.

❀ ❀ ❀

ఈ క్రమంలో హెలెనా ఒకానొకరోజు ***లండన్*** లోని **' హైడ్ పార్క్ '** లో ఒంటరిగా కూర్చుని ఆలోచిస్తూ ఉన్నప్పుడు ఆమె పరమగురువు ***మాస్టర్ మోరియా*** ప్రత్యక్షమై .. ఆధ్యాత్మిక విషయాలను విస్తారంగా చర్చించి .. ***భారతదేశా***నికి వెళ్ళి ***" థియోసోఫికల్ సొసైటీ "*** ని స్థాపించమని సూచించారు. అందుకు గాను ముందుగా ***టిబెట్*** వెళ్ళి తాంత్రిక గురువులను కలుసుకోమని మార్గనిర్దేశనం చేసారు.

భృక్తంగా ఉన్న విజ్ఞాన భాండాలను బయటకు తీయడమే ఆమె అవతార లక్ష్యంగా తెలియజేసి .. ***" నీకు అందుకు గాను పరమగురుమండలి నుంచి ఎప్పటికప్పుడు ఆత్మజ్ఞానం, దివ్యజ్ఞానం***

***అందుతూంటుంది "*** అని తెలియజేసి అంతర్ధానం అయ్యారు. ఇక అప్పటి నుంచి ఆమెకు మాస్టర్లు స్వప్నాలలో, జాగృతిలో మరి సూక్ష్మ రూపాలలో దర్శనం ఇస్తూ ప్రేరణ ఇస్తూండేవారు.

❋ ❋ ❋

***భారతదేశానికి పయనం*** అయ్యేముందు ఈజిప్టులోని ***కైరో*** పట్టణంలో ఒక ***తాంత్రిక స్వామి***ని ఆశ్రయించి అనేక తంత్ర రహస్యాలను నేర్చుకుంది ***హెలెనా.*** ఆ తరువాత ***మౌంట్ లెబెనాన్*** కూటముల్లోని ***మర్మయోగుల*** సహచర్యంలో మంత్ర విద్యలన్నింటినీ ఔపోసన పట్టింది. కెనడాలోని రెడ్ ఇండియన్స్ మరి ఆఫ్రికాలోని ఆటవిక తాంత్రిక జాతులతో కలిసి ఉంటూ .. ***దాంజువన్, వూ-దూ*** అనబడే ఆటవిక విద్యలన్నీ నేర్చుకుంది. ఇలా వివిధ దేశాలు పర్యటిస్తూ కాలగర్భంలోంచి వెలికి తీసిన జ్ఞానాన్ని క్రోడీకరించుకుంటూ ***భారతదేశం*** చేరుకుంది ***బ్లవాట్స్కీ .***

దాదాపు మూడేళ్ళు భారతదేశంలోని వివిధ ప్రాంతాలు పర్యటించిన తరువాత ***1857 సిపాయి తిరుగుబాటు***తో మొదలైన ప్రధమ స్వాతంత్ర్య సంగ్రామం నాటికి .. ***మాస్టర్ మోరియా*** సూచనలతో మళ్ళీ ***జావా*** మీదుగా ***యూరోప్*** చేరుకుంది ***బ్లవాట్స్కీ ..***

ఆమెలోని అతీంద్రియ శక్తులూ, ఆధ్యాత్మికత రోజురోజుకూ పెరిగిపోవడంతో సంకల్పమాత్రం చేత ఎంత జటిలమైన సమస్యకయినా ఇట్టే పరిష్కారం చేసేది. ఎక్కడెక్కిడనుంచో జనం వచ్చి ఆమెకు తమ సమస్యలను నివేదించుకుని వాటికి తక్షణమే పరిష్కారాలు పొందేవారు. క్రమంగా ఆమె చూపు పాశ్చాత్యదేశాల వైపు సాగింది.

శాస్త్ర సాంకేతిక విజ్ఞానరంగంలో ఎంతో ఉన్నత దశకు చేరుకున్న పాశ్చాత్య దేశాలవారికి .. ***ఆత్మవాదం*** అస్సలు ఒంటికి పట్టదు. ***" మా కంటికి కనపడలేదు కాబట్టి అవి అస్సలు లేనేలేవు "*** అని వాదించేవారు. పైగా దానికి ***" పలాయన వాదం "*** అని కూడా పేరు పెట్టారు. ఇందుకు ధీటుగా మేడమ్ ఆయా దేశాలలో ***" థియోసోఫికల్ సొసైటీ "*** లను విరివిగా స్థాపిస్తూ ***పరిపూర్ణ జీవితం కోసం ఆధ్యాత్మికత*** యొక్క అవసరాన్ని ఎత్తి చూపించింది !!

***" ప్రపంచాన్ని సమూలంగా మార్చివేసి నవచైతన్యంతో దానిని నింపివేయాలి "*** అన్న బృహత్ లక్ష్యంలో ***బ్లవాట్స్కీ*** రెండు సమాంతర మార్గాలను ఏర్పరచుకుంది.

<u>ఒకటి</u> : బూజుపట్టిన అంధమత విశ్వాసాలనూ, ఆచారాలనూ సమాజంలోంచి తొలగించడం.

<u>రెండవది</u> : ప్రతి ఒక్క పనికీ భౌతిక ప్రయోజనాన్ని ఆశించకుండా, ***' శాస్త్రీయత '*** అంటూ సైన్సుతో ముడిపెట్టకుండా .. ఆధ్యాత్మికతకు స్థానం కల్పించడం.

రెండూ జటిలమైనవే కానీ .. ఆధ్యాత్మిక అవగాహనతో మానసిక పరిణామాన్ని సాధిస్తూ .. వాటిని సుసాధ్యాలు చేస్తూ .. సమాజంలో ఆధ్యాత్మికత ఒక ముఖ్య అవసరంగా గుర్తించ గలిగేట్లు చేయాలి.

**" అమెరికా వంటి సంపన్న దేశంతో పాటు కేవలం సుఖ భోగాలకు ప్రాధాన్యం ఇచ్చే ఈ ప్రపంచంలో అది ఎంతవరకు సాధ్యం? "** అని ఆమె ఏనాడూ అధైర్యపడలేదు పైగా .. **" ఆ లక్ష్యాన్ని సాధించడమే నా జీవిత లక్ష్యం! అసలైన ఆత్మ తత్వాన్ని అన్ని దేశాలూ అర్థం చేసుకోవాల్సిందే .. మరి సనూతన ఆధ్యాత్మికత అందరి జీవితాల్లోకి రావాల్సిందే "** అంటూ కుండబ్రద్దలు కొట్టినట్లు తెలియజేసింది.

**మేడమ్ బ్లవాట్స్కీ** లక్ష్యసాధనలో సంపూర్ణంగా సహకరించిన వారిలో ముఖ్యులు **న్యూయార్క్ సిటీ**లోని న్యాయవాదవృత్తిలో ఉన్న నీతీ నిజాయితీ కల **కల్నల్ హెన్రీ స్టీల్ ఆల్కాట్!** ఆయనకు అమెరికన్ మేధావి వర్గంతో చక్కటి సంబంధాలు ఉండటంతో **" థియోసోఫీ "** ఉద్యమాన్ని ముందుకు నడిపించడంలో ఆయన చాలా అద్భుతమైన పాత్రను పోషించారు. మేడమ్‌లో ఉన్న అతీంద్రియ శక్తులు అతడిని అమితంగా అబ్బురపరచేవి.

**1875 సెప్టెంబర్ 7వ తేదీన** థియోసోఫికల్ సొసైటీకి సంబంధించిన తన ఆశయాలను వివరించారు బ్లవాట్స్కీ :

- ▲ మనిషి ప్రగతి సాధనకూ, ఆత్మపూర్ణత్వానికీ అదృశ్యశక్తుల అవసరం ఎంతగానో ఉంది.
- ▲ ఆ శక్తులు మనకంటే ఎంతో ఉన్నత స్థానంలో ఉన్నాయి కనుక వాటిని చిన్న చిన్న ప్రయోజనాలకు ఉపయోగించుకోకూడదు.
- ▲ విశ్వవిజ్ఞానం పై పరిశోధనలకు మాత్రమే మాస్టర్స్ సహాయాన్ని తీసుకోవాలి.

క్రమంగా సంస్థ కార్యకలాపాలు ఊపందుకోవడంతో అతీంద్రియశక్తుల పట్ల విద్యావంతులలో కూడా ఆసక్తి మొదలై **బ్లవాట్స్కీ** చుట్టూ ఎందరెందరో జిజ్ఞాసువులు చేరడం మొదలైంది. వారిలో ముఖ్యులు మరి **కార్నెల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ .. హిరం కోర్సన్** ఒకరు. వారి కోరిక మేరకు వారి ఇంట్లోనే ఉండి ఆమె .. **" ఐసిస్ అన్వీల్డ్ "** అనే పరిశోధనాత్మకమైన గ్రంథ రచన ప్రారంభించింది.

ఆ రచన అంతా కూడా ఆమె ఛానెలింగ్ ద్వారా ఉన్నత తలాల మాస్టర్స్ నుంచి అందుకున్న సందేశాలతో కూడి ఉండేది. ప్రొఫెసర్ ఆమెకు యూనివర్సిటీ లైబ్రెరీ నుంచి ఎన్నెన్నో పుస్తకాలను పరిశోధించి మరీ కొటేషన్లు తెచ్చి ఇస్తూండే వాడు కానీ .. ఆయన వాటిని తెచ్చి ఇచ్చేకంటే ముందే .. **బ్లవాట్స్కీ** వ్రాసిన పేజీలలో అవి కనబడి ఆయన్ను ఆశ్చర్యానికి గురిచేసేది. ఆఫ్రికా ఆటవికులతో కలిసి నేర్చిన అనేక తాంత్రిక గుహ్యవిద్యలను కూడా ఆవిడ **" ఐసిస్ అన్వీల్డ్ "** లో పొందుపరచడం జరిగింది.

ప్రపంచంలోని అన్ని దేశాల సద్గురువులందరూ తమ భౌతిక శరీరాలను వదిలి వెళ్ళిన తరువాత **అమృతులై, దివ్య తేజోరూపాలలో** సూక్ష్మలోకాలలో విహరిస్తూంటారు. మన మనస్సులపై

ఉన్న మాయతెర తొలగితే తప్ప మనకు వారి దర్శనం కాదు మరి మనకు వారితో ఆత్మసంబంధం ఏర్పడదు. మనల్ని కూడా తమంతటి వారిని చేయాలి అన్న వారి ఆకాంక్షను మనం అర్థం చేసుకుని సిద్ధంగా వుంటే.. ఈథర్ శరీరాలతో కూడిన వాళ్ళు .. ఎన్నెన్నో దివ్యజ్ఞాన సందేశాలను మనకు ఇస్తూంటారు.

***" ఐసిస్ "*** రచనలో ***బ్లవాట్‌స్కీ*** ఇలా మహాత్ములను ప్రసన్నం చేసుకుని .. ఎంతెంతో సమాచారాన్ని ఆమె కూర్చున్న చోటు నుంచి కదలకుండా పేజీలకు పేజీలు ఎవరో డిక్టేట్ చేస్తూన్నట్లు అలా వ్రాస్తూనే ఉండేది. ముఖ్యంగా పరమ గురువులైన ***మాస్టర్ మోరియా*** మరి ***మాస్టర్ కుతుహోమీలు*** ఆమెకు విశ్వసమాచారాన్ని విశేషంగా అందిస్తూండేవారు !

1877లో అచ్చయిన ***" ఐసిస్ అన్వీల్డ్ "*** ఆధ్యాత్మిక జగత్తులోనే ఒక సంచలనంగా మారింది. గొప్ప గొప్ప పరిశోధనలకు వాకిళ్ళు తెరిచిన ఆ మహాగ్రంథం ఎందరెందరో ఆధ్యాత్మిక జిజ్ఞాసువులను తట్టిలేపి *" **A Master Key to the Mysteries of Ancient and Modern Science** "* గా పేరు సంపాదించుకుంది.

❋ ❋ ❋

ఇంగ్లాండు, అమెరికా దేశాలలో ***థియోసోఫీ*** బాగా ప్రాచుర్యం పొందాక 1875లో పరమ గురువుల ఆదేశాలతో ***బ్లవాట్‌స్కీ*** మళ్ళీ ***ఇండియా*** కు చేరుకున్నారు.

ముంబయిలో ***" పయొనీర్ "*** పత్రిక ఎడిటర్ ***ఆల్‌ఫ్రెడ్ పెర్సీ సిన్నెట్ .. బ్లవాట్‌స్కీ కి*** స్వాగతం చెప్పి .. ఆ తరువాత థియోసోఫీ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు.

భారతదేశంలో ***థియోసోఫీ*** ఉద్యమాన్ని నడిపించడానికి ఆమె రష్యన్ పత్రికలకు రచనలు పంపి ఆదాయం సమకూర్చేది. ఆ తరువాత ***" థియోసోఫీ "*** అనే పత్రిక మొదలు పెట్టి దాని ద్వారా కూడా కొంత ఆదాయం పొందుతూ ఆ ఉద్యమానికి వెచ్చించేది. 1882లో ***మహిళా థియోసోఫికల్ సొసైటీని*** ప్రారంభించి మహిళల హక్కుల కోసం సరిక్రొత్త పోరాట స్ఫూర్తిని అందించింది!

***బౌద్ధ సాహిత్యం, యోగం*** మరి విజ్ఞానంతో ***బ్లవాట్‌స్కీ*** కి సంపూర్ణ పరిచయం ఉండటం వల్ల ***టిబెటన్ గురువులు, లామాల*** బోధనల మణిహారం అయిన ***" ది వాయిస్ ఆఫ్ ది సైలెన్స్ "*** అన్న గ్రంధాన్ని ప్రచురించడం జరిగింది!

కొంతకాలానికి 1882 లో థియోసోఫీ కార్యకలాపాలు మద్రాసు సమీపంలోని ***అడయార్ స్వంత ఎస్టేట్*** లోకి మార్చబడ్డాయి. మద్రాసుకు చెందిన గొప్ప మాస్టర్లు **T. సుబ్బారావు, *దామోదర్*** లు చక్కటి సహకారం అందించడంతో దక్షిణ భారతదేశంలో థియోసాఫికల్ సొసైటీ కార్యకలాపాలు విస్తృతమై ప్రజల నుంచి మంచి స్పందన రావడం జరిగింది!

1884 లో మేడమ్ .. తన ఆరోగ్యం చెడిపోవడంతో డాక్టర్ల సలహా మేరకు మళ్ళీ యూరోప్‌కు ప్రయాణమై .. ***థియోసోఫికల్ సొసైటీ*** నిర్వహణకు ఒక **కౌన్సిల్‌ని** ఏర్పాటు చేసింది.

***ఇండియా*** నుంచి బయలుదేరిన మేడమ్ ***ఇటలీ*** మీదుగా ప్రయాణం చేసి ***జర్మనీ***లోని **వుర్జ్ బర్గ్** చేరుకుంది. అక్కడ ఆమెకు ***జర్మనీ సైన్యాధికారి*** భార్య మరి ***స్వీడన్*** దేశానికి చెందిన **కౌంటస్ కాన్‌స్టన్స్** సహాయకురాలిగా ఉంటూ ***" సీక్రెట్ డాక్ట్రిన్ "*** అనే ***మహాద్భుత గ్రంథ*** రచనకు ఎంతో సహకరించింది.

***క్లెయర్‌వాయెన్స్, క్లెయర్‌ఆడియన్స్*** సహాయంతో ***పరమ గురువుల నుంచి సందేశాల***తో మేడమ్ .. ఊహకు అందని ఎన్నో విషయాల వ్రాస్తూంటే .. కౌంటిస్  ఆశ్చర్యపోతూండేది! ఆరోగ్యం సహకరించకపోయినా ఆమె పట్టుదలతో, దీక్షతో రోజుల తరబడి అలా వ్రాస్తూండిపోయేది. ఆ అద్వితీయ రచన పూర్తి కావడానికి పరమగురువులు ఆమెకు ప్రాణదానం చేసి ఆమె ఆయుర్దాయాన్ని కూడా పెంచారు!

❀ ❀ ❀

1885 అక్టోబర్ - డిసెంబర్ మధ్యకాలంలో మేడమ్ ***బ్లావాట్స్కీ*** బృహద్రచన ***" సీక్రెట్ డాక్ట్రిన్ "*** అచ్చవ్వడం జరిగింది. ***బెర్ట్రం కైట్లె, అర్చిబాల్డ్ కైట్లె*** దానిని ఎడిటింగ్ చేసి తమ స్వంత ఖర్చులతో ప్రింటింగ్ చేయించారు.

రెండు భాగాలుగా రచించబడిన ఈ పుస్తకంలో ..

***మొదటి భాగానికి*** " The Book of Dzyan " అని పేరు. ఇందులోని ***ఏడు పద్యాల ఆధారంగా .. సృష్టి, విశ్వ పరిణామం తో పాటు అన్ని మతాల ఆవిర్భావం మరి వాటి పరిణామం చర్చించబడింది.***

***రెండవ భాగానికి*** " Dyan Chohans " అని పేరు. ***ఇందులో మానవ వికాసం మరి మానవ పరిణామం  వివరించబడింది.***

***" సీక్రెట్ డాక్ట్రిన్ "*** .. ఒక దివ్యజ్ఞాన కల్పవృక్షం! మేడమ్ ఈ పుస్తకంలోని ఎన్నో ప్రూఫులను తానే స్వయంగా దిద్దేది .. మరి చివరి నిమిషం వరకు కూడా దానికి ఎన్నెన్నో మార్పులూ చేర్పులూ చేస్తూనే ఉండేది.

మనిషి తనలోని ఆత్మ జ్ఞానాన్ని ఆవిష్కరింపజేసుకునే మార్గాన్ని చూపించే ఆ మహాగ్రంథం .. వ్యక్తి గమ్యానికీ, సమాజ లక్ష్యానికీ ఒక దివ్య సూచిక!

ఆ గ్రంథం పై సమీక్షను వ్రాయడానికి ***" రివ్యూ ఆఫ్ రివ్యూస్ "*** అనే పరిశోధన పత్రిక ఎడిటర్ W.T. ***స్టీడ్ .. అనీ బిసెంట్*** అనే జర్నలిస్ట్‌ను కోరడంతో .. ఆమె ***బ్లావాట్స్కీ*** ని కలవడం జరిగింది. అప్పుడే ***అనీ బిసెంట్ .. థియోసోఫీ*** సిద్ధాంతాల పట్ల ఆకర్షితురాలై .. సంస్థ కార్యకలాపాలలో

పాలుపంచుకోవడం మొదలుపెట్టింది. ఈ క్రమంలోనే ఆమెలోని విద్వత్తును గుర్తించిన మేడమ్ .. ***అనీ బిసెంట్*** ను ***థియోసోఫీ సొసైటీ పత్రిక*** అయిన ***" ల్యూసిఫర్ "*** కు ఎడిటర్‌గా నియమించడం మరి ***" అనీ బిసెంట్ "*** ఆ పత్రికను ఎంతో విజయవంతంగా నడిపి సంస్థ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటడం జరిగింది.

ప్రపంచంలోని అన్ని మతాల పైనా మరి వాటి ఛాందస భావాలపైనా బాణాలు సంధిస్తూ .. మతాన్ని తూర్పార బట్టడమే ఏకైక లక్ష్యంగా ***ల్యూసిఫర్ పత్రిక రచన***లు ఉండేవి!

ప్రపంచానికి పరమగురువులనూ, మాస్టర్స్‌నీ, మహాత్ములనూ పరిచయం చేసి .. భృక్తంగా ఉన్న దివ్య జ్ఞానాన్ని తెరతీసి మరీ లోకానికి చూపించిన ***మహాయోగిని మేడమ్ బ్లవాట్‌స్కీ*** .. ***1891 మే 8 వ తేదీ తమ భౌతిక జీవిత ప్రయాణాన్ని ఎంతో ప్రశాంతంగా ముగించుకున్నారు.***


***" మనిషి తన ఆత్మ శక్తిని తాను తెలుసుకోక పోవడం అజ్ఞానం. ప్రయత్నిస్తే తానుకూడా దివ్యజ్ఞానం పొందగలననీ, దేవుడి అంతటి ఎత్తుకు ఎదుగలననీ గుర్తించాలి .. మరి ఆ ప్రయత్నంలో ఎదురయ్యే ప్రమాదాలనూ కష్టాలనూ ఎరుకతో ఎదుర్కోవాలి "*** అంటూ ***" ఐసిస్ అన్వీల్డ్ "*** ద్వారా ఆమె ఈ తరానికి గొప్ప సందేశం ఇచ్చారు.

***" ఐసిస్ అన్వీల్డ్ "*** కంటే ఇంకా విస్తృత జ్ఞానాన్ని పొందుపరుస్తూ ప్రాచీన ***మతాలు, విశ్వాసాలు, ఇజాలు, తాత్విక*** విషయాల పట్ల అవగాహనను విశేషంగా కలుగజేస్తూ కాలగర్భంలో దాగిన జ్ఞాన నిధులను వెలికి తీస్తూ ***" సీక్రెట్ డాక్ట్రిన్ "*** రచన సాగించి 20వ శతాబ్దంలో మనిషికి కావలసిన విజ్ఞాన వివేకాలను అందించిన మేడమ్ ***H.P. బ్లవాట్‌స్కీ*** .. ఆధ్యాత్మిక రంగంలో ***ఒక ధృవతారగా*** నిలిచి ధన్యతను పొందారు!

ప్రకృతిలో సహజంగా ఉన్నవే అయినా .. నిగూఢంగా ఉండిపోయిన ఇలాంటి జ్ఞానాన్నంతటినీ సైన్స్ ఇప్పుడు ఒక్కొక్కటిగా ఆవిష్కరిస్తోంది! 1887-97 మధ్యకాలంలో జరిగిన అనేకానేక ప్రయోగాల ద్వారా ప్రకృతిలోని ***పదార్థ విజ్ఞానం*** ఎక్కువగా బయటపడింది. మాస్టర్ల ద్వారా మేడమ్ ఆనాడు పొందిన చానెలింగ్ సందేశాలకు అనుగుణంగా .. అనేకానేక శాస్త్ర పరిశోధనలు ప్రస్తుత కాలంలో జరుగుతూ క్రొత్త .. క్రొత్త విజ్ఞాన విశేషాలతో మనల్ని ఆశ్చర్యపరుస్తూ ఉన్నాయి!!

# " హజ్రత్ తాజుద్దీన్ బాబా "

**తమ పుట్టుకనుంచే అద్భుతమైన లక్షణాలను ప్రదర్శిస్తూ ..** శక్తిపాతపు యోగత్వస్థితిని సంపూర్ణంగా అనుభవించిన **యోగీశ్వరులు .. హజ్రత్ తాజుద్దీన్ బాబా!** వారి దర్శనానికి వచ్చిన వారు ఎవ్వరయినా తమకు కావలసింది మనస్సులో అనుకుని వారి పాదాలను స్పర్శిస్తే చాలు .. వెంటనే వారి మనస్సులో ఉన్న కోరిక అద్భుతంగా నెరవేరేది. బాబా తమ అద్భుత శక్తి ద్వారా ఎంతో మందికి స్వస్థత చేకూర్చడమే కాకుండా వారి వారి ప్రాపంచిక మరి ఆధ్యాత్మిక కోరికలు తీరేట్లుగా తమ మహిమలను చూపించేవారు.



***హజ్రత్ తాజుద్దీన్ బాబా*** .. 1861 జనవరి 21వ తేదీన మహారాష్ట్రలోని **నాగపూర్** కు దగ్గర వున్న **" కిమ్తీ "** అన్న ప్రదేశంలో జన్మించారు.

***" యోగులు .. తమ పుట్టుకనుంచే అద్భుతమైన లక్షణాలను ప్రదర్శిస్తూంటారు "*** అన్న దానికి నిదర్శనంగా బాబా కూడా సాధారణ శిశువులు పుట్టగానే ఏడ్చినట్లు ఏడవలేదట! అప్పుడప్పుడూ కళ్ళు తెరిచి పరిశీలనగా చుట్టుప్రక్కల తన దృష్టిని సారించి .. మళ్ళీ నిశ్శబ్దంగా కళ్ళు మూసుకుని నిద్రలోకి జారిపోయేవారట!

నవజాత శిశువు యొక్క ఈ వింత ప్రవర్తనకు ఆశ్చర్యపోయిన పెద్దలంతా .. అతడిని ఏడిపించడానికి నానా రకాలుగా తంటాలు పడ్డారు. ఎంత ప్రయత్నించినా శిశువు నుంచి ఎలాంటి స్పందనా రాకపోవడంతో ఏ మాత్రం చదువు సంధ్యలు లేని ఆ గ్రామస్థులు మరి బాబా తల్లిదండ్రులు మొరటు పద్ధతిలో ఒక ఇనుప చువ్వను నిప్పుల కొలిమిలో కాల్చి దానితో అతడి నుదిటిపై కాల్చారు!

యోగస్థితిలో ఉన్న ఆ మహాత్ముడిని సాధారణ శిశువులా తలవడం వాళ్ళ అజ్ఞానం ! వేడి ఇనుప చువ్వతో కాల్చగానే అత్యంత గాఢ యోగ స్థితిలో వున్న బాబా ఉలిక్కిపడి లేచి గట్టిగా ఏడ్చి .. గ్రామస్థులందరికీ సంతోషాన్ని కలుగజేసాడు. కానీ కాల్చిన మచ్చ జీవితాంతం బాబా నుదుటిపై అలాగే ఉండిపోయింది.

**తాజుద్దీన్** ఒక సంవత్సరం వయస్సు బాలుడిగా ఉన్నప్పుడు తండ్రినీ .. తొమ్మిది సంవత్సరాల వయస్సున్నప్పుడు తల్లినీ కోల్పోయాడు. దాంతో అతని ఆలనాపాలనా అతని మేనమామ **అబ్దుల్ రహ్మాన్** సంరక్షణలో సాగింది. అతని విద్యాభ్యాసం కూడా **" కిమ్తీ "** గ్రామంలోని **మద్రసా** లోనే సాగింది.

ఈ సమయంలోనే .. ఆధ్యాత్మికంగా ఉన్నతస్థానాన్ని పొందిన ఒకానొక ఆత్మజ్ఞాని **" హజ్రత్ అబ్దుల్లా షా "**.. తాజుద్దీన్ బాబా చదువుకునే మద్రసాకు వెళ్ళడం తటస్థించింది. వారు తాజుద్దీన్‌ను చూసి ***" ఈ బాలుడు సామాన్యుడు కాదు; ఇతనికి బోధించడానికి మీ దగ్గర ఇంకా ఏమీ మిగలలేదు! అతడు తన పూర్వజన్మల్లోనే ఎంతెంతో జ్ఞానాన్ని సముపార్జించుకున్నాడు "*** అంటూ అక్కడి ఉపాధ్యాయులకు తెలియజేసారు.

తన భుజానికి వ్రేల్లాడుతోన్న చేతి సంచీలోంచి ***" ఖుబానీ "*** అనే ఒక ఎండు ఫలాన్ని బయటికి తీసి .. దానిని తాను సగం కొరికి తిని .. మిగతా సగం ఫలాన్ని తాజుద్దీన్ నోట్లోపెట్టి ***" తక్కువ తిను; తక్కువ మాట్లాడు; ఖురాన్ పారాయణ చెయ్యి "*** అంటూ అతని తలపై చేయి ఉంచి దీవించారు.

***తాజుద్దీన్*** ఆ ఫలాన్ని తిన్నవెంటనే అద్భుతమైన దివ్యత్వపు చైతన్య ప్రవాహం అతనిలోకి ప్రవేశించి మూడు రోజులపాటు అతనిని అనంత పారవశ్యంలో ముంచివేసింది. హజ్రత్ అబ్దుల్లా షా గారి ఆ శక్తిపాతం తరువాత ***తాజుద్దీన్*** .. ఏ మాత్రం సమయం దొరికినా అంతర్ముఖుడై తరచూ ఏకాంతంలో ఉంటూండేవాడు.

❊ ❊ ❊

తాజుద్దీన్‌కు పద్ధెనిమిది సంవత్సరాల వయస్సు వచ్చేసరికి ఊరిలోని వరదల వల్ల అతని మేనమామ ఆర్థిక పరిస్థితి దిగజారిపోయింది. దాంతో కుటుంబానికి ఆసరా కావడానికి తాజుద్దీన్ ఉద్యోగంలో చేరవలసిన అవసరం ఏర్పడి అతడు 1881లో ***" నాగపూర్ ఆర్మీ రెజిమెంట్ "*** లో ***సిపాయి*** గా చేరాడు.

ఈ క్రమంలో తాజుద్దీన్ రెజిమెంట్ .. సైనిక విధుల్లో భాగంగా ***" సాగర్ "*** అన్న ప్రదేశానికి పంపబడింది. అక్కడ అతడు తన విధులను నిర్వర్తిస్తూనే సమయం దొరికినప్పుడల్లా తనలో తాను అంతర్ముఖుడై .. ఆత్మానందాన్ని అనుభవిస్తూ వుండేవాడు. సాధారణంగా రాత్రిళ్ళు అతడు తన ***ఆధ్యాత్మిక మార్గదర్శి*** అయిన ***హజ్రత్ బావుద్ సాహెబ్ ఆత్మ***తో అనుసంధానమై ఉంటూ .. ఆ ఉన్నతాత్మ నుంచి అనేకానేక సందేశాలనూ, జ్ఞానాన్నీ పొందుతూండేవాడు.

యోగుల సాధనా క్రమం గురించి ఏ మాత్రం అవగాహన లేని అతని పై అధికారులు .. తాజుద్దీన్ రాత్రిళ్ళు బేస్ క్యాంప్‌లో ఉండకుండా ప్రకృతి ఒడిలో కూర్చుని ధ్యానమగ్నుడై ఉండడాన్ని ఎంతగానో ఆక్షేపించేవారు. దాంతో ఉద్యోగం తన ఆధ్యాత్మిక అభివృద్ధికి అత్యంత అవరోధకారకం అవుతోందని గ్రహించిన తాజుద్దీన్ .. ఉన్న పళంగా ఉద్యోగానికి రాజీనామా చేసారు. ***మిలిటరీ క్యాంప్*** నుంచి బయటపడి ***సాగర్ వీధుల్లో*** పిచ్చివాడిలా తిరగడం మొదలుపెట్టాడు.

ఈ సమాచారం తెలిసిన తాజుద్దీన్ అమ్మమ్మ .. సాగర్‌కు వచ్చి అతడిని ***" కిమ్తీ "*** కి తీసుకుని వెళ్ళింది. ***" అతడికి ఏదో చెడుగాలి సోకి ఉండవచ్చు "*** అన్న మూఢనమ్మకంతో డాక్టర్ల దగ్గరికీ

మరి **" హకీమ్ "** ల దగ్గరికీ త్రిప్పుతూ .. నానా రకాల వైద్యాలు చేయించేది. ఆత్మానంద స్థితిలోని బ్రహ్మానందాన్నీ మరి శక్తిపాతం యొక్క అద్భుత ఫలితాన్నీ అనుభవిస్తోన్న తాజుద్దీన్ మాత్రం పెద్దవాళ్ళు తన వైద్యం కోసం చేస్తోన్న ప్రయత్నాలను చూసి వారి అజ్ఞానానికి నవ్వుకునేవాడు. చిలిపి పిల్లలు అతని వైపు రాళ్ళు విసిరినా .. ఒక **' అవధూత '** లాగా అతడు దేనినీ లెక్క చేసేవాడుకాదు.

❀ ❀ ❀

సమాజం కూడా అతడిపై **" పిచ్చివాడు "** అన్న ముద్రవేసి ఇక అతనిని పట్టించుకోవడం మానివేసింది. 1892 ఆగస్ట్ 16వ తేదీన అధికారులు అతనిని అరెస్టు చేసి నాగపూర్‌లోని ***" పిచ్చివాళ్ళ సంరక్షణాలయం "*** లో బంధించారు.

సాధారణంగా అధికారులు అక్కడ పిచ్చివాళ్ళను బ్యారెక్‌లలో ఉంచి వాళ్ళకాళ్ళకూ చేతులకూ గొలుసులు వేసి తాళాలు వేస్తూంటారు. కట్టుదిట్టమైన కాపలా నడుమ ఆ సంరక్షణాలయాన్ని అధికారులు  పర్యవేక్షిస్తూండేవారు.

అలాంటి కట్టుదిట్టమైన కాపలాను కూడా ఛేదిస్తూ .. తాజుద్దీన్ విషయంలో అద్భుతం జరిగి అతడి పేరు పట్టణం అంతా మార్మోగిపోయింది! అదేమిటంటే .. తాజుద్దీన్ బాబాని నిర్బంధించి పిచ్చివాళ్ళ శిబిరంలో గొలుసులు వేసి బంధించిన రోజే చాలా మంది ప్రజలు అతనిని కిమ్టీ పట్టణంలోని వేర్వేరు ప్రదేశాలలో చూసాము అని చెప్పారు.

దానికి తోడు ఒక సిపాయి ఇచ్చిన సమాచారం ఆధారంగా తాజుద్దీన్‌ను వెదకడానికి బయలుదేరిన అధికారికి  కిమ్టీ గ్రామంలో అతడు ఒక చెట్టు క్రింద చిద్విలాసంగా నవ్వుతూ కూర్చుని కనిపించాడు. తన సిపాయిని అక్కడే తాజుద్దీన్‌కు కాపలావుంచిన అధికారి వెంటనే ***" ఆ వెఱ్ఱివాడు ఎక్కడ? "*** అంటూ నాగపూర్‌కి బయలుదేరి వెళ్ళి అక్కడి సంరక్షణాలయం వైద్యాధికారిని గద్దించాడు.

అంతవరకు సాధారణ దినచర్యలో భాగంగా తాజుద్దీన్‌తో పాటు అందరినీ పరీక్షించి వచ్చిన డాక్టర్ ఆశ్చర్యపోతూ .. బ్రిటిష్ అధికారిని బ్యారెక్‌లోనికి తీసుకుని వెళ్ళి అక్కడ గొలుసులతో బంధించబడి వున్న తాజుద్దీన్‌ని చూపించాడు. ఇంతకు ముందు **" కిమ్టీ "** లో చెట్టు క్రింద కూర్చుని నవ్వినట్లే .. ఇక్కడ గొలుసులతో బంధించబడి వున్న తాజుద్దీన్ కూడా అధికారిని చూసి నవ్వి .. ***" సోదరా! నీ డ్యూటీని నువ్వు చేస్తున్నట్లే .. నా డ్యూటీని నేను చేస్తున్నాను "*** అని చెప్పాడు.

దాంతో ఇక బాబా యోగిపుంగవుడైన ఒక అద్భుత చైతన్యమూర్తి అని గ్రహించిన బ్రిటిష్ అధికారి .. బాబాకు సంపూర్ణ శరణాగతి చెంది అతడి శిష్యుడిలా మారాడు. అప్పటి నుంచి ఆ పిచ్చివాళ్ళ సంరక్షణాలయంలో బాబాకు కొన్ని నిబంధనలను సడలించారు. బాబా లీలలు ఆ

నోటా ఈ నోటా ప్రజలలో వ్యాపించడంలో ఇక ఆ **" పిచ్చివాళ్ళ సంరక్షణాలయం "** కాస్తా .. **" బాబా దర్శనాలయం "** గా మారి భక్తులు అక్కడికి పోటెత్తసాగారు!

16 సంవత్సరాల పాటు ఆ సంరక్షణాలయంలో వుండిపోయిన బాబా తన అద్భుతశక్తి ద్వారా ఎంతో మందికి స్వస్థత చేకూర్చడమే కాకుండా వారి వారి ప్రాపంచిక ఆధ్యాత్మిక కోరికలు ఎన్నింటినో తీరేట్లుగా తన మహిమను చూపించేవారు. వేలాది మంది ప్రజలు ప్రతిరోజూ ఆ సంరక్షణాలయం ముందు **" క్యూ "** కట్టేవారు. స్థానిక డాక్టర్లే కాకుండా దేశ విదేశాల డాక్టర్లు కూడా బాబాను పరీక్షించి .. **" ఇన్నేళ్ళుగా పిచ్చి అనుకుంటున్న అతని స్థాయి ఒక దివ్యత్వపు ప్రభను కలిగి వున్న యోగస్థితి; అది ఏ మెడికల్ రికార్డులకు కూడా అందనిది "** అని తేల్చారు !!

ఈ క్రమంలో బాబా భక్తుడిగా మారిన నాగపూర్ మహారాజు **రఘోజీరావు భోంస్లే** .. తనకు కలలో బాబా కనిపించి నిర్దేశించిన విధంగా .. నిబంధనలకు అనుగుణంగా అతడిని సంరక్షణాలయం నుంచి విడిపించి **" షకర్‌దారా "** లో తన రాజభవనానికి తీసుకుని వెళ్ళాడు. ఇక అప్పటి నుంచి బాబా రాజభవనం నుంచే తన దివ్యప్రణాళికను అమలు చేయడం మొదలుపెట్టారు.

బాబా దర్శనానికి వచ్చిన వారు ఎవ్వరయినా తమకు కావలసింది మనస్సులో అనుకుని వారి పాదాలను స్పర్శిస్తే చాలు .. వెంటనే వారి మనస్సులో ఉన్న కోరిక అద్భుతంగా నెరవేరేది. కాలక్రమంలో బాబా లక్షలాది మంది భక్తుల కోరికలను తీర్చే కల్పవృక్షంలా బాబా మారిపోయారు.

***1925 వ*** సంవత్సరాని కల్లా ***65 సంవత్సరాల*** వయస్సున్న బాబా ఆరోగ్యం క్షీణించసాగింది. ఎందరో డాక్టర్లు బాబా ఆరోగ్యాన్ని పరిరక్షించడానికి శ్రమించారు కానీ లాభం లేకపోయింది. బాబా ప్రత్యేక అభ్యర్థన మేరకు **మహారాజు రఘోజీరావు .. బాబా** దర్శనం కోసం ఎదురుచూస్తోన్న ప్రజలను రాజభవనంలోకి అనుమతించడంతో .. లక్షలాది మంది ప్రజలు తమ **ప్రియతమ సద్గురు హజ్రత్ తాజుద్దీన్ బాబా**ను కడసారి దర్శించుకుని ధన్యులయ్యారు.

ఆత్మశక్తితో అద్భుతంగా ఒక వెలుగు వెలిగి .. శక్తిపాతపు యోగత్వస్థితిని సంపూర్ణంగా అనుభవించిన **" యోగీశ్వరులు హజ్రత్ తాజుద్దీన్ బాబా "** 1925 సంవత్సరం ఆగస్టు 17వ తేదీన తమ భౌతిక శరీరాన్ని వదిలి .. అనంత లోకాలకు వెళ్ళిపోయినా .. తమ భక్తుల హృదయాలలో మాత్రం వారు చెరగని ముద్రవేసారు.

# " జిల్లెళ్ళమూడి అమ్మ .. అనసూయమ్మ "

ప్రశాంతంగా, నిర్లిప్తంగా దిగంతాలవరకు సాగే చూపులతో .. **" కడలి రూపాన్ని ధరిస్తే ఇలాగే వుంటుంది "** అనిపించే గంభీరమైన ఆకృతితో కనిపించే అనసూయమ్మ .. అందరికీ అమ్మ. **" నాకు ఎవ్వరూ శిష్యులు లేరు; అందరూ శిశువులే "** అంటూ తమ మాటలలో, చూపులలో మరి హృదయంలో అనంతమైన మాతృత్వాన్ని నింపుకున్న సాంప్రదాయాలపై తిరుగుబాటును బోధించడమే కాకుండా తాము స్వయంగా ఆచరించి అందరితో ఆచరింప జేశారు.



***గుంటూరు*** జిల్లా, పొన్నూరు తాలూకాలోని **" మన్నవ"** గ్రామంలో **వల్లూరు సీతాపతిశర్మ, *రంగమ్మ*** గార్లకు .. 28-3-1923 బుధవారం అరుణోదయాన ***" అమ్మ "*** జన్మించింది.

అష్టసిద్ధులను కైవసం చేసుకున్న **" కుర్తాళం శ్రీ మౌనానంద స్వామి "** వారు 1922 లో మన్నవ గ్రామంలో కొంత కాలం వున్నప్పుడు ఆ ఊరి **" రాజ్యలక్ష్మి దేవాలయం "** లోని అమ్మవారి విగ్రహం క్రింద ***" శ్రీ రాజరాజేశ్వరీ దేవి యంత్రాన్ని "*** స్థాపించారు. అమ్మవారి అంశ ఆ దేవాలయం ధర్మకర్త అయిన **వల్లూరు సీతాపతి, రంగమ్మ** దంపతుల ఇంట్లో త్వరలో అవతరించబోతోందని ప్రకటించారు.

ఆ మహనీయుని భవిష్యత్తువాణి నిజమై .. తల్లి గర్భంలో వున్నప్పుడు మరి పసిబిడ్డగా వున్నప్పుడు కూడా ***" అమ్మ "*** ఎన్నెన్నో అద్భుతాలను ప్రదర్శించేది. ఏడాదిన్నర వయస్సుకే ***" అమ్మ "*** ఆసనాలు వేస్తూ ముద్రలు పట్టటం చేస్తూండేది. వాటిని బంధువులు గమనించినా .. గుర్తించిన వారు తక్కువ. ***" చిన్నపిల్ల చేష్టలకు, మాటలకు ప్రత్యేకత ఏముంటుంది? "*** అనుకుంటారేతప్ప వాటి పరమార్థాన్ని గుర్తించేవారు కొద్దిమందే వుంటారు. జనన మరణాల గురించీ, పూజా విధుల గురించీ చిన్నప్పటి నుంచి ***" అమ్మ "*** అడిగే ప్రశ్నలకు పెద్దవాళ్ళెవ్వరూ సమాధానం చెప్పలేక పోయేవారు. అసలు వారికి తెలిస్తే కదా ఆ ఆత్మజ్ఞానికి సమాధానం చెప్పగలిగేది?!

❀ ❀ ❀

***" అమ్మ "*** కు మూడేళ్ళ వయస్సు ఉన్నప్పుడు తల్లి రంగమ్మకు జబ్బుచేసి బాధపడుతూ .. అమ్మను వాత్సల్యంగా దగ్గరికి తీసుకుని..

***" నేను పోతే ఎక్కడ ఉంటావమ్మా? "*** అని అడిగింది.

***" అంతటా .. అందరివద్దా ఉంటానమ్మా "*** చిన్నారి **అమ్మ** సమాధానం.

***" మరి వాళ్ళు నిన్ను సరిగ్గా చూడొద్దూ "*** .. పాపం కన్నతల్లి అనుమానంగా అడిగింది ..

***" వాళ్ళందరికీ అమ్మనై .. నేనే వాళ్ళను సరిగ్గా చూసుకుంటాగా "*** జగజ్జననిలాగా చిన్నారి ***" అమ్మ "*** .. ఊరడింపుతో కూడిన తన నిర్ణయాన్ని అప్పుడే తెలియజేసింది!

1927 లో **" కుర్తాళం మౌనస్వామి "** వారు చీరాలలో నూనె పానకాలు ఇంట్లో ఉన్నప్పుడు ఐదేళ్ళ **అనసూయమ్మ** తన తాతమ్మ **మరిడమ్మ** తో కలిసి చీరాలకు వెళ్ళి .. స్వామితో ఏకాంతంగా తత్వగోష్ఠి చేసింది. ఆ వయస్సునుంచే ఆమె తన దివ్యస్పర్శతో చనిపోయిన వాళ్ళను బ్రతికించడం, చెడు ఆలోచనలతో వచ్చే వాళ్ళ మనస్సులను శుద్ధి పరచి వారిని అతి పవిత్రులుగా చేయడం చేసేది. ఆమె మహిమలను చూసి ఆశ్చర్యపోతూ .. ***" మాకు గతి ఏమిటి? "*** అన్న వారి ప్రశ్నకు ***" అందరికీ సుగతే "*** అని సమాధానం చెప్పి .. ***" ధ్యాసే ధ్యానం "*** అని బోధించింది.

❀ ❀ ❀

మనుష్యులకే కాక పశుపక్ష్యాదులకు కూడా బాల్యం నుంచీ **" అమ్మ "** అన్నం పెట్టేది. ఎదుటివారి అవసరాలకు తన ఒంటిపై వున్న నగలను తీసి ఇవ్వటం **" అమ్మ "** కు చిన్నతనం నుంచే వచ్చిన అలవాటు.

**" అమ్మ "** కు మడీ, మైలా, కులం, మతం, జాతి భేదాలు ఏవీ లేవు. ఆమె జ్ఞాపకశక్తి ఎంత అమోఘంగా వుండేదంటే .. తన చిన్నప్పటి విషయాలే కాక తాను పుట్టకముందు ఆ యా వ్యక్తుల జీవితాలలోని విశేషాలను కూడా కళ్ళతో చూసినట్లుగా చెప్పేది. ఏ వ్యక్తి ఎప్పుడు, ఎక్కడ, ఎన్నిసార్లు తన వద్దకు వచ్చాడో చెప్పటం వంటివి ఊహకు కూడా అందనంత అద్భుతంగా చెప్పేది.

అమ్మకు 1936 మే 5వ తేదీన ***" బ్రహ్మాండం నాగేశ్వరరావు "*** గారితో వివాహం జరిగింది. ఆయన ***" జిల్లెళ్ళమూడి " గ్రామ కరణం***. వీరి సంతానం ఇద్దరు కొడుకులు సుబ్బారావు, రవి, ఒక కూతురు హైమ. 1968 ఏప్రిల్ 6వ తేదీన కూతురు హైమ తీవ్రమైన అనారోగ్యం సోకి మరణించడం జరిగింది. **" అమ్మ "** కూతురి మరణం పట్ల అప్పటికప్పుడు బాధపడినా జరుగవలసిన పద్ధతులన్నీ మామూలుగా ముగించి, దుఃఖఛాయలు ఏవీ లేకుండా ఒక ఒక **జెన్ మాస్టర్** లా మరునాటి నుంచి ఆశ్రమ కార్యక్రమాలన్నీ యధావిధిగా జరిపించింది!

❀ ❀ ❀

1981 ఫిబ్రవరి 16వ తేదీన ***" బ్రహ్మాండం నాగేశ్వరరావు "*** గారు గుండెపోటుతో మరణించారు. విధులన్నీ పద్ధతి ప్రకారం జరిపిన తరువాత **అమ్మ** మళ్ళీ యధావిధిగా తన ఆశ్రమ దినచర్యలలో పాల్గొనటం కూడా మరొక అద్భుతమైన విషయం. ***" భర్తను గురించిన***

***మంగళకరమైన సజీవ భావనే స్త్రీని సదా సుమంగళిగా ఉంచుతుంది "*** అని సందేశం ఇచ్చిన అమ్మ .. అందుకు నిదర్శనంగా .. తాను చనిపోయేంత వరకు కూడా పసుపు కుంకుమలతో కళకళాలాడుతూనే వుంది!

❀ ❀ ❀

తనను చూడవచ్చేవారికి 1958 మే 5వ తేదీ దాకా **అమ్మ** తానే స్వయంగా వండిపెట్టేది. జనం పెరిగేకొద్దీ ***" వేరే ఏర్పాటు ఏదైనా చేస్తే బాగుంటుంది "*** అన్న విషయమై అమ్మను ఒప్పించి 1958 ఆగస్టు 15వ తేదీన ఆశ్రమానికి వచ్చే వాళ్ళందరికీ **" అన్నపూర్ణాలయం "** ఏర్పాటు చేసారు భక్తులు. ఎవరు ఎప్పుడు కనబడినా **" అమ్మ "** మాట్లాడే మొదటిమాట ***" అన్నం తిన్నావా?"*** అన్నదే. అన్నపూర్ణాలయంలో జరిగే నిరతాన్నదాన కార్యక్రమాన్ని ఎవరైనా అమ్మ ముందు ప్రశంసిస్తే .. ***" ఎవడి అన్నం వాడే తింటున్నాడు. మనం పెట్టేదేమిటి? వాడిది ఇక్కడ లేకపోతే వాడు రాలేదు కదా?! "*** అంటూ **" అమ్మ "** సమాధానం ఇచ్చేది.

**" అమ్మ "** ఉనికితో ***" జిల్లెళ్ళమూడి "*** గ్రామం గొప్ప పుణ్యక్షేత్రం అయ్యింది! 1962 సంవత్సరంలో ఒకసారి **" అమ్మ "** వాడరేవు ***" లలితానందాశ్రమం "*** దర్శించింది. జీర్ణావస్థలో వున్న ఆ ఆశ్రమం **" అమ్మ "** సందర్శనం తరువాత మహావైభవాన్ని పుంజుకుంది.

అమ్మను దర్శించిన మహనీయులలో ***" కళ్యాణానంద భారతి", " చీరాల నరసింహయోగి ", " ముల్పూరు సుబ్రహ్మణ్య శాస్త్రి ", " లక్ష్మణ యతీంద్రులు ", " ఎక్కిరాల భరద్వాజ "*** .. మొదలుగా ఎందరో వున్నారు. కళ్యాణానంద భారతి గారిని కలిసి వారిచే మంత్ర దీక్షను పొందాలని అమ్మ బయలుదేరి వారి దగ్గరికి వెళ్ళినప్పుడు .. గొప్ప జ్ఞాని అయిన ***శ్రీ కళ్యాణానందభారతి*** అమ్మ చూపుల లోతులలోని అద్భుతమైన జ్ఞానసుధను అందుకుని కళ్ళనీళ్ళ పర్యంతం అయిపోయారు.

***(1970వ సంవత్సరంలో బ్రహ్మర్షి పత్రీజీ కూడా అమ్మను దర్శించుకున్నారు! అప్పటికి పత్రీజీకి ధ్యాన పరిచయం లేదు. ఇన్‌కమ్‌టాక్స్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగధర్మంలో తెనాలిలో వున్నప్పుడు జిల్లెళ్ళమూడి గ్రామాన్ని ప్రత్యేకంగా సందర్శించి ' అమ్మ ' సమక్షంలో గంటసేపు గడిపి వారు ఎంతో ఆత్మానుభూతిని పొందారు.)***

❀ ❀ ❀

**" అమ్మ "** ఒకేసారి ఎందరెందరో భక్తులకు వారి వారి ప్రదేశాల్లోనే దివ్యదర్శనాలను ఇస్తూ .. తన విశ్వవ్యాపకత్వాన్ని చాటుకుంది. ప్రముఖ ఆధ్యాత్మిక ఆచార్యులు ***మాస్టర్ ఇ.కె. భరద్వాజ*** గారు **అమ్మ** సన్నిధానంలో చాలా కాలం గడిపి ఆమె దివ్య దర్శనాలన్నింటికీ సాక్షిగా నిలిచారు.

***" నాకు ఎవ్వరూ శిష్యులు లేరు; ఉన్నవాళ్ళంతా నాకు శిశువులే "*** అంటూ తన మాటల్లో చూపుల్లో మరి హృదయంలో అనంతమైన మాతృత్వాన్ని నింపుకున్న ***" అమ్మ "*** .. చాలా వరకు

తన **" దర్శన మంటపం "** లో ఒక మామూలు కుర్చీలో కూర్చుని ధ్యానం చేసుకుంటూండేది. ఆవిడ తన దర్శనానికి వచ్చిన వాళ్ళతో చక్కటి తెలుగులో సరదాగా మాట్లాడుతూ .. వారికి ఆహ్లాదాన్ని పంచేది.

**అమ్మ**ను దర్శించుకున్న విదేశీ భక్తుడు **రిఛార్డ్ ఫిష్‌మన్** తన అద్భుత గ్రంథం ***" అమ్మ జీవితం "*** లో అమ్మ ***' అవతార విశిష్టత '*** గురించీ, ఆవిడ క్షణాల్లో సమాధి యోగంలోకి వెళ్ళే అద్భుతాన్ని గురించీ మరి దిగ్దిగంతాలలోకి చూసే ఆమె చల్లని వాత్సల్యపూరితమైన చూపు గురించీ .. ఎంతో హృద్యంగా వివరించాడు.

❊ ❊ ❊

**అమ్మ** సన్నిధిలో పెళ్ళిళ్ళు జరుపుకుందామని వచ్చిన జనానికి ఎడతెరపి లేని వర్షం ఒక పరీక్షగా మారేది. చిత్రంగా ముహూర్తం సమయానికి వర్షం ఆగడంతో .. **అమ్మ** చక్కగా కూర్చుని కళ్యాణం జరిపించేది. భోజనాలైన తరువాత మళ్ళీ కుంభవృష్టి మొదలై .. జరుగవలసిన పని గురించి **అమ్మ** వర్షాన్ని ఆపినట్లే కనిపించేది.

***' ఇమామ్ '*** అనే ముస్లిం యువకుడు ***అమ్మ సంకీర్తన నామం*** రూపొందించాడు. **అమ్మ** మాట్లాడే ప్రతి మాటా ఎంతో అర్థవంతంగా వుండేది. ***" నాకు ఎవరిని చూసినా నా బిడ్డే అనిపిస్తుంది; నా దృష్టిలో అందరూ మంచివాళ్ళే. నేను మీలో మాధవత్వం చూస్తాను. అంతా ఆత్మగా కనిపించటమే ఆత్మసాక్షాత్కారం; అంతా దివ్యంగా కనబడటమే దివ్యదృష్టి. "***

***" నాకు శాస్త్రపరిచయం లేదు కానీ .. నేను ఏది చెప్పినా నా అనుభవంలోనివే చెప్తాను "*** అంటూండేది ***" అమ్మ "***.

సంప్రదాయాలపై తిరుగుబాటును బోధించటమే కాక వాటిని తాను ఆచరిస్తూ అందరితో ఆచరింపజేసింది **అమ్మ.** కొడుకులు లేని ***శ్రీపాద గోపాలకృష్ణమూర్తి*** గారికి ***ఆయన పుత్రిక గాయత్రి*** చేతనే తన సన్నిధిలో కర్మకాండ జరిపించింది. పూజకు ఆటంకం కలిగిందని బాధపడే భక్తురాలితో ***" నాకు అంటు ముట్టు వంటివి లేవు "*** అంది. తనవారు మరణించినప్పుడు కూడా .. తనకోసం వచ్చిన వారికి ఇబ్బంది కలుగకుండా సంతోషంగా వారి కార్యక్రమాలను జరిపించింది.

***" అమ్మ జ్ఞానమే .. బ్రహ్మజ్ఞానం "*** గా నిర్వచించిన అమ్మ .. సంకల్పశక్తియే దైవమనీ .. ***" దుష్టసంహారం "*** అంటే ***" దుష్టత్వాన్ని సంహరించటం "*** అనీ .. ***" రూపరహితుడు "*** అంటే ***" అన్ని రూపాలు తానే అయినవాడు "*** అనీ బోధించేది. ***" మృత్యుంజయత్వం "*** అంటే ***" మృత్యువు గురించి భయం లేకపోవటం "*** అనీ .. సహించలేనిది ***" హింస "*** అనీ, ***" సర్వాన్నీ స్వాధీనం చేసుకున్నదే సాధ్వి "*** అనీ .. ***" గుర్తు చూపించేవాడు గురువు "*** అనీ, ***" తృప్తే ముక్తి "*** అనీ ..

సందర్భానుసారంగా శబ్దచమత్కారాలను ప్రయోగించే అమ్మ .. చేతనా చేతనాలకే కాదు శబ్దార్థాలకు కూడా **అమ్మే!**

❊ ❊ ❊

అవధూతలూ, యోగులూ మానవాళికి చేయవలసిన మేలు అంతా చేసి, బోధించవలసినవి అన్నీ బోధించి, అందించాల్సిన సందేశాలను ప్రచారం చేసి .. తాము వచ్చిన పని అయిపోగానే తమ అవతారాలను చాలిస్తూంటారు. అలా **అమ్మ** కూడా ***1985 జూన్ 12వ తేదీన*** మహా సమాధిలో తన భౌతిక ప్రయాణాన్ని చాలించింది.

ఆమె పార్థివ శరీరాన్ని అమ్మకోరిక మేరకే జిల్లెలమూడి లోని **అనసూయేశ్వరాలయం**లో ఖననం చేసారు. 1987 సంవత్సరంలో ***అమ్మ పాలరాతి విగ్రహాన్ని*** ప్రతిష్ఠించిన భక్తులు క్రమం తప్పకుండా అక్కడ భక్తిప్రపత్తులతో అమ్మకు పూజలు జరుపుతూంటారు.

## " అమ్మ .. ఉపదేశామృతం "

" కాలం ఒక్కటే .. అనుభవాలు వేరు. సాయంసంధ్య ఏర్పడేది ఒకే సారి. అది కాలబద్ధం. వివిధ గృహాలలో దీపాలు వెలిగేది మాత్రం భిన్న సమయాలలో. అవి కర్తవ్య, కారణ పరిధికి సంబంధించిన అంశం. అవన్నీ అనుభవాలకు పరిమితమైనవి."

❊ ❊ ❊

" ' దైవ సంకల్పం ' కాదు .. సంకల్పమే దైవం! సంకల్పం మనోధర్మం కాదు. చేతోమధనం నుంచి బయటపడేది సంకల్పం. చేతన ఆంతరంగికం. అనేక స్థితులను దాటి సంకల్ప రూపంలో వెలువడే శక్తి సంకల్పం. ఆ సంకల్పం నిస్వార్థమైనప్పుడు, జగత్తుకు మంగళదాయిని అవుతుంది. బలంగా, దృఢంగా, విస్తృతంగా, సర్వశ్రేయోదాయకంగా రూపుదాల్చి సార్వకాలికమౌతుంది. పదుగురికీ అక్కరకొచ్చిన సంకల్పమే .. దైవం."

❊ ❊ ❊

" దేనినీ విడిగా చూడనిదీ, అన్నీ తెలిసినా తెలుస్తున్నట్లు ఉండనిదీ, అన్నీ తానైనదీ, తానేమీ కానిదీ, ప్రత్యేకంగా లేనిదీ .. ఇదే జ్ఞానం. ఇది నాశనం అంటే తెలియనిది. దీని స్థితి అక్షరం.. అక్షయం. మార్పు చెందనిది, జరుగుతూన్న అన్ని మార్పులకూ సాక్షిగా వుండేది .. జ్ఞానం. అది, అంతం ఎరుగనిది. నిత్య, సత్య శాశ్వతమైనది. అదే సత్యం, జ్ఞానం, అదే అనంతం. అదే బ్రహ్మ."

❊ ❊ ❊

" అనగా అనగా మాటే మంత్రమౌతుంది. ఆ మంత్రం మనస్సును ఒకే స్థాయిలో నిలబెడుతుంది మరి ఆ స్థాయిలో మనస్సు అచలమౌతుంది. ఈ స్థితిలో మంత్రం అవసరం వుండదు. ఈ స్థితి ఏర్పడేవరకు అనేవాడు, వినేవాడు విడివిడిగా వుంటారు. ద్వంద్వంలో కలిగేవన్నీ, కనబడేవన్నీ అసంపూర్ణాలు, అర్ధసత్యాలు. అదంతా నివేదనే కానీ, ' వేదాంతం ' కాదు. వేదాంతం బోధించేదంతా వైరాగ్యమే. వైరాగ్యం అంటే నిజస్థితి. మనం వేరు, దైవం వేరు అనుకోవటం అపరిపక్వమే. భిన్నం కాదనుకోవటమే రాగరహిత స్థితి. చివరకు అదే వేదం. అంటే తెలుసుకోవలసింది."

❀ ❀ ❀

" ఒకే స్థితిలో వున్న ఇద్దరు కనిపిస్తున్న వైనం భిన్నం. సాధన, సాధకుడు, సాధ్యమం అవే కర్త, కర్మ, క్రియ అంటున్నాం. దైవం మూడింటిలోనూ వుండడం వల్ల అంతా కర్తే! విచిత్రమేమిటంటే కర్తృత్వం లేని దైవం అన్ని పనులకూ కారణభూతమౌతున్నాడు. కర్తవ్యమున్న జీవుడు, నిస్సహాయంగా చూస్తూ మిగిలిపోతున్నాడు."

❀ ❀ ❀

" శాస్త్రం అంటే ఆచారమా? సాంప్రదాయమా? అలవాటా? జ్ఞాపకమా? తనంతట తాను ఏర్పడినదా? ఎవరైనా వ్రాసినదా? శాస్త్రం స్థిరమా? జాతి, మత, కుల, వర్గ, వర్ణ అవసరాలన్నిటినీ శాస్త్రం నడిపించగలదా? మారుతూన్న సమాజ పోకడలకు, శాస్త్రాలకు పొంతన వున్నదా? బహూశా శాస్త్ర గత సంగతులు ఆ యా దేశకాల పరిస్థితులకు అన్వయించుకుంటే తప్ప, అనుభూతి పొందితే తప్ప,శాస్త్రాల పూర్ణత్వం, సమగ్రత్వం అర్థంకాదు. కాబట్టి శాస్త్రాలు వల్లె వెసుకోవటానికి కాక, సర్వజనులూ ఆచరించవలసిన విధివిధాన సంవిధాన సంప్రదాయాలన్న మాట. "

❀ ❀ ❀

" నీకు ఏ దేవుడు అంటే ఇష్టమని ప్రశ్నించటమే లోపభూయిష్టం. ఉన్నదంతా దైవమే అనటంలోనే సమన్వయం వుంది. " .. " చేసేది మాత్రమే కర్మకాదు. చేసేదీ, గీసేదీ, వ్రాసేదీ, అనుకునేదీ, అంటున్నదీ, వింటున్నదీ .. అంతా కర్మే! కదలికలు, మెదలికలు అన్నీ కర్మలే.

❀ ❀ ❀

" ప్రకృతిలో సంభవించే ప్రతి మార్పూ కర్మే! " .. " ఒకే అమృతం లోంచి వెలువడినవన్నీ పంచామృతాలే. కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు, పంచభూతాలు, తన్మాత్రలు, పంచకోశాలు .. ఇవన్నీ ఒకే మూలం నుంచి వచ్చినవి. ఆ మూలమే ఆత్మ! ఆత్మకు వాడు-వీడు, ఇదీ-అదీ, అక్కడా-ఇక్కడా అంటూ లేవు. అంతా తానై, అన్నీ తానై వుండటమే దాని స్థితి. పాలు, పెరుగు,

మీగడ, వెన్న, నెయ్యి అంటూ .. వీటన్నిటికీ మూలం పాలనీ, చరమం నెయ్యనీ అనుభవిస్తున్నాం. అంతా ఒకటే అయినా దాన్నే అనేకంగా భిన్న భిన్న రుచులలో చవిచూస్తున్నాం."

❀ ❀ ❀

" మనం ఏ పనిచేసినా లోకోత్తరంగా వుండాలి. మనల్ని ఎవరో మెచ్చుకోవటం కాదు. అందరూ మెచ్చే రీతిలో, అందరికీ నచ్చే రీతిలో మనం పనిచేయాలి. ప్రయత్నం అందించే ఫలితం అందరికీ చెందాలి. అందరూ ఆనందించాలి."

❀ ❀ ❀

" పాపం పండటం అంటే, ఇకపై చేయటానికి పాపం లేకపోవటమే. ఇకపై వుండబోతున్నది అంతా పుణ్యమే. మనస్సున్నంతసేపూ పాపం-పుణ్యం అంటూ వుంటాయి. హృదయం నడిపించటం ప్రారంభం కాగానే ఈ రెండూ వుండవు. వర్ణ భేదంలేని చైతన్యమే అన్నిటినీ నడిపిస్తుంది. ఇక స్పర్థ ఎక్కడుంది. ఉన్నదంతా ఆనందమే. కనిపిస్తున్నదంతా బ్రహ్మాండమే."

❀ ❀ ❀

" పుట్టారన్న సంతోషం, పురుడు రూపంలో పట్టుకుంటోంది; పోయారన్న దుఃఖం మైల రూపంలో పట్టుకుంటోంది. మనిషిని సుఖదుఃఖాలే పట్టుకుంటున్నాయి. అన్ని స్థితులలోనూ మనిషి తనను తాను పోగొట్టుకోకుండా నిలబెట్టుకోవాలి .. అది ప్రధానం."



# " గ్రాండ్ మాస్టర్ చింగ్ హాయ్ "

***వియత్నాం దేశం***లో జన్మించిన ***మాస్టర్ చింగ్ హాయ్*** .. రెడ్ క్రాస్ ***సొసైటీ***లో చేరి తమ సేవలను అందిస్తూ .. ***ఆధ్యాత్మిక సాధనా మార్గం*** లోకి ప్రవేశించారు. ఆ క్రమంలోనే భారతదేశానికి విచ్చేసి పవిత్ర హిమాలయ పర్వతాలలోని మహాయోగులతో, సాధువులతో కొన్ని యేళ్ళపాటు సహవాసం చేసారు. ఎన్నెన్నో ఆధ్యాత్మిక సత్యాలను ఆకళింపుచేసుకుని ***దివ్యజ్ఞానప్రకాశాన్ని పొంది*** తాము నేర్చుకున్న జ్ఞానాన్ని ప్రపంచదేశాల ప్రజలందరికీ బోధిస్తూ ముఖ్యంగా శాకాహార ప్రాశస్త్యాన్నీ .. మరి శాకాహారులుగా మారవలసిన అత్యవసరాన్నీ .. అద్భుతంగా ప్రచారం చేస్తున్నారు.



***" వియత్నాం "*** దేశంలోని Au Lac ***రాష్ట్రం***లో జన్మించిన ***" మాస్టర్ చింగ్ హాయ్ "*** తండ్రి .. గొప్ప పేరున్న నేచురోపతి వైద్యులు. వారు తమ అభిమాన మాస్టర్లు అయిన ***లావో ట్జు*** మరి ***చువాంగ్ ట్జు*** గ్రంధాలను విశేషంగా అధ్యయనం చేస్తూ ఉండడం వల్ల చిన్నారి ***" చింగ్ హాయ్ "*** కూడా చిన్న వయస్సు నుండే ఆ గ్రంధాలను చదువుతూండేది! తండ్రి సహాయంతో వాటిని ఆకళింపు చేసుకుంటూ, ***బుద్ధిజ్ఞానానికి*** సంబంధించిన ఇతర సిద్ధాంతాలను విస్తృతంగా అధ్యయనం చేసేది.

ఇంతా చేసి ఇదంతా పూర్తయ్యేసరికి చిన్నారి ***" చింగ్" ..*** ప్రాథమిక విద్యాభ్యాసం మొదలుపెట్టడానికి స్కూల్‌లో చేరే వయస్సే! స్కూల్లో ఉన్నప్పుడు కూడా ఇతర విద్యార్థులు హోమ్‌వర్కులు చేసుకుంటూనో లేక ఆడుకుంటూనో ఉన్నప్పుడు ***" చింగ్ "*** ఆధ్యాత్మిక సాహిత్యాన్ని చదువుకుంటూ .. విశ్లేషించుకుంటూ గడిపేది. ఆమెలో ఉన్న అసాధారణమైన మాస్టర్‌ను గుర్తించిన ***" చింగ్ "*** తండ్రి మాత్రం ఆమె ఆధ్యాత్మిక ఎదుగుదలకి చక్కటి ప్రోత్సాహం ఇచ్చేవారు.

***" చింగ్ "*** తల్లిదండ్రులు ***క్యాథలిక్ క్రిస్టియన్*** మతానికి చెందినవారైనా .. బౌద్ధమత సిద్ధాంతాలను కూడా వారు సమాదరించేవారు. ***చింగ్*** నాయనమ్మ ***" సుమ " .. బౌద్ధమతాన్ని*** స్వీకరించడంతో .. ***చింగ్*** ఉదయం తల్లిదండ్రుల వెంట క్యాథలిక్ చర్చికీ, మధ్యాహ్నం నాయనమ్మ వెంట బౌద్ధ దేవాలయానికీ మరి సాయంకాలాలు ఇంట్లో అందరితో కలిసి రకరకాల ఆధ్యాత్మిక చర్చలు జరుపుతూ .. సర్వమత సహనంతో పెరిగి పెద్దయ్యింది!

ఈ క్రమంలో ***" నేనెవరు ?"***.. ***" మరణం తర్వాత జీవితం వుందా?"*** .. ***" మనుషుల మధ్య వైవిధ్యం ఎందుకు ? "*** అన్న ఆత్మ పరిశోధనా సందేహాలు ఆమెకు కలుగుతూండేవి. ఆ వయస్సులోనే

Au Lac లోని ఆసుపత్రుల్లోని రోగులకు ***చింగ్*** చేసే సేవలకు గాను ఆమె స్నేహితులు ఆమెను స్నేహంగా ***" లివింగ్ బుద్ధ "*** అనీ ***" Funny Saint "*** అనీ పిలుచుకుంటూండేవారు!

చిన్నతనం నుంచీ ***చింగ్*** జంతువుల పట్ల అమితమైన ప్రేమను కనబరుస్తూ .. గాయపడిన జంతువులను ఇంటికి తీసుకుని వచ్చి సపర్యలు చేపట్టేది! ఎక్కడైనా జంతువధ జరుగుతూంటే వాటిని ఆపడానికి ప్రయత్నిస్తూ .. ఆ జంతువుల చావురోదనలకు తాను విపరీతమైన వేదనను అనుభవించేది! ఒకానొక జ్యోతిష్కుడు ఆమె జాతకాన్ని పరిశీలించి .. ***" ఆమె అవివాహితగా ఉండిపోతే గొప్ప సత్యజ్ఞాన ప్రకాశినిగా వెలుగొంది ప్రపంచానికి గొప్ప ఆధ్యాత్మిక గురువుగా రూపొందుతుంది .. లేక వివాహం చేసుకుంటే మాత్రం ఒక చక్కటి గృహిణిగా ప్రేమాస్పదుడైన భర్తతో కలిసి ఆనందకరమైన జీవితాన్ని గడుపగలదు "*** అని చెప్పాడు.

కొంతకాలానికి సమాజసేవ కోసం ***" ప్రపంచమంతా కూడా తన కుటుంబమే "*** అనుకున్న ***చింగ్*** .. ***' నన్ '*** గా మారి ఇల్లు వదిలి ***విశాల విశ్వం***లోకి అడుగుపెట్టింది!

ఈ పరిణామాన్ని జీర్ణించుకోలేకపోయిన ఆమె తల్లి ***" Quan Yin Temple "*** కు వెళ్ళి అక్కడి పూజారి ***" అవలోకితేశ్వర బోధిసత్వ "*** ను కలిసి బిడ్డపట్ల తన హృదయంలోని బాధను తెలియ జేసింది. వారు తమ దివ్యనేత్రం తో ***చింగ్*** భూతభవిష్యత్ వర్తమానాలను అవగతం చేసుకుని ***" మాస్టర్ చింగ్ హాయ్ చాలా అసాధారణమైన విద్వత్తు కలిగిన బిడ్డ! Quan Yin మిషన్‌లో భాగంగా ప్రపంచంలోని బాధిత, పీడిత జనులను కాపాడి .. వారిని దివ్యమార్గంలోకి నడిపించడానికి వచ్చిన అద్భుతమైన మాస్టర్! కోట్ల మందిలో ఏ ఒక్కరికో కానీ అలాంటి బిడ్డకు జన్మ ఇచ్చే అదృష్టం కలుగదు "*** అంటూ ఆ తల్లిని అభినందించాడు!

***' నన్ '*** గా మారి ***" రెడ్ క్రాస్ సంస్థ "*** కార్యకలాపాలలో భాగంగా ***జర్మనీ దేశం*** చేరిన ***చింగ్*** .. అక్కడి యుద్ధశరణార్ధుల శిబిరాలలోని వివిధ దేశాలకు చెందిన ప్రజలకు విస్తృతమైన సేవలను అందించింది. వారిని బాధావిముక్తులను చేయడానికి చేపట్టాల్సిన చర్యలను గురించి ఆవిడ పడిన తపనకు .. ***ఆధ్యాత్మిక మార్గం*** ఒక్కటే ఆమెకు దిక్సూచిలా కనిపించింది.

ఈ క్రమంలో ఆమె చిన్నప్పుడు తన నాయనమ్మతో కలిసి బౌద్ధ ఆలయాలకు వెళ్ళి నేర్చుకున్న **ధ్యాన ప్రకియ** ను విశేషంగా సాధన చేసేది. ఆమె తన సందేహాలన్నింటికీ కూడా **ధ్యానం** లోనే చక్కటి సమాధానాలనూ మరి జ్ఞానవంతమైన సందేశాలనూ వివరణాత్మకంగా పొందేది.

***" పరమత సహనం "*** అన్న దివ్యలక్షణం ఆమెలో చిన్నవయస్సు నుంచే విరాజిల్లుతూండేది కనుక .. ధ్యానంలో ***జీసస్, బుద్ధ, లావోట్జు*** వంటి గొప్ప గొప్ప మాస్టర్లు అందించే సందేశాలన్నింటిలో ఉన్న మూల సూత్రం అయిన **ఆత్మ సత్యాన్ని** ఆమె చక్కగా గ్రహించేది.

కొంతకాలానికి ఆమె ***జర్మనీ*** దేశస్థుడైన గొప్ప శాస్త్రవేత్తను ***వివాహం చేసుకుని*** కొంతకాలం ఆనందకరమైన వైవాహిక జీవితాన్ని గడిపింది. ప్రేమ, దయా గుణాలను పుష్కలంగా కలిగివున్న ***చింగ్ భర్త*** .. ఆమె చేసే సేవా కార్యక్రమాలకు తన చక్కటి సహకారాన్ని అందించేవాడు! అయితే ***" ఇలాంటి ప్రేమపూర్వకమైన బంధం కూడా తన ఆధ్యాత్మిక ప్రగతికి గొడ్డలిపెట్టు "*** అని గ్రహించిన మాస్టర్ చింగ్ హాయ్ .. సుహృద్భావపూర్వకమైన వాతావరణంలో భర్తతో పరస్పర అంగీకారమైన విడాకులు తీసుకుని .. సత్యజ్ఞాన ప్రకాశపు వెలుగులో తన ఆధ్యాత్మిక ప్రయాణాన్ని ముందుకు సాగించింది!!

శాక్యముని ***గౌతమబుద్ధుడు - " సురంగమ సూత్ర "*** లో తెలిపిన ***" Quan Yin "*** అనే అత్యున్నతమైన ఆధ్యాత్మిక మార్గం కోసం అన్వేషిస్తూ ఆమె అనేకానేక దేశాలలో పర్యటిస్తూ .. చివరి మజిలీగా ఆధ్యాత్మిక శక్తులకు, నిలయం అయిన ***పవిత్ర హిమాలయాలను*** చేరుకుంది!

అక్కడే ఆమె బౌద్ధ గురువుల ద్వారా ***" Quan Yin "*** సాధనామార్గాన్ని పొంది .. తన ఆధ్యాత్మిక సాధనను ముమ్మరం చేసింది. అక్కడి హిమాలయ సానువుల్లో ఆమె సాధన అద్భుతమైన రీతిలో సాగి .. తన ఆత్మపరిణామక్రమంలోని ఉన్నతమైన తలాలకు ఆమె చేరుకుంది. తన జ్ఞానాన్ని ప్రపంచ ప్రజలందరికీ పంచే సమయం ఆసన్నం అయ్యిందని గురువుల ద్వారా సందేశం అందుకుని .. అక్కడినుంచి బయలుదేరిన ***చింగ్*** .. ***" తైవాన్ దేశం "*** చేరుకుంది.

ఈ క్రమంలో ఒకానొకరోజు సాయంత్రం ***మాస్టర్ చింగ్ .. " తైవాన్ దేశం "*** లోని ఒకానొక ప్రదేశంలోని దేవాలయం వెనుక భాగంలో ఉన్న చిన్ని గదిలో ధ్యానం చేసుకుంటూ కూర్చుంది. ఆరోజు తుఫాన్ ప్రభావం వల్ల బాగా వర్షం పడుతూండటంతో ఆమె గదిలోపల గడియవేసుకుని గాఢ ధ్యానంలోకి వెళ్ళిపోయింది.

కాస్సేపటికి కొంతమంది భక్తులు వచ్చి గది తలుపులు బాధగా .. ధ్యాన స్థితినుంచి బయటికి వచ్చి తలుపు తెరిచింది ***చింగ్.*** వాళ్ళు ఎంతో భక్తితో ***" ఇన్నాళ్ళుగా మేం చేస్తోన్న ప్రార్థనలకు దయగల దేవుడైన ' <u>Quan Yin బోధిసత్వుడు</u> ' ప్రత్యక్షమై .. ఈ గదిలో వున్న మీ గురించి మాకు తెలియజేసి .. మిమ్మల్ని కలిసి .. బాధల నుంచి విముక్తి చెందే మోక్షమార్గాన్ని మీ నుంచి పొందమని చెప్పాడు "*** అంటూ ఆమె కాళ్ళపై పడ్డారు.

వారి అంకిత భావానికి ముగ్ధురాలైన మాస్టర్ ***చింగ్*** .. వారికి శాకాహారులుగా మారవలసిన అత్యవసరాన్ని తెలియజేసి పరిశుద్ధాత్మలుగా మారిన వారికి ***" Quan Yin "*** ఆధ్యాత్మిక మార్గాన్ని బోధించింది. క్రమక్రమంగా ఆమె ఖ్యాతి ***<u>తైవాన్</u>*** లోనే కాకుండా ఇతర దేశాలకు కూడా ప్రాకడంతో వేలాదిగా జనం ఆమె దగ్గరికి వచ్చేవారు. ***సత్యం*** మరి ***ధర్మం*** త్రికరణశుద్ధిగా బోధించేవారి కోసం ప్రజలు ఎంతగా ఎదురుచూస్తూన్నారో గ్రహించిన ***మాస్టర్ చింగ్ హాయ్*** క్షణం విరామం లేకుండా దేశ దేశాలు పర్యటనలు జరిపింది!

భారతదేశంతో పాటు ఆసియా ఖండం, అమెరికా, లాటిన్ అమెరికా మరి యూరోప్ దేశాల్లో ఆమె విస్తృతంగా చేపట్టిన ఆధ్యాత్మిక సేవలు అమూల్యం!

ఆధ్యాత్మికపరమైన లేదా ప్రాపంచికపరమైన బాధితులు మరి పీడితులు ఎవరయినా సరే వారికి తన ఆత్మజ్ఞానంతో, తన అసాధారణ శక్తితో లేదా తన అవధులులేని ప్రేమతో **చింగ్** తమ సేవలను అందించారు.

ప్రపంచవ్యాప్తంగా వీరు అందించిన ఆధ్యాత్మిక మరి ప్రాపంచిక సేవలను గుర్తించిన ప్రపంచ దేశాలు ***మాస్టర్ చింగ్ హాయ్‌***ని ***హానోలూలూ*** లో ***"World Peace Award"*** తోనూ మరి 1994, ఫిబ్రవరి, 22న ***చికాగో***లో జరిగిన ఉత్సవంలో ***"World Spiritual Leadership Award"*** తోనూ సత్కరించి గౌరవించారు.

***బుద్ధత్వంలోని దివ్యత్వాన్ని*** సంపూర్ణంగా అవగతం చేసుకుంటూ .. ***బుద్ధత్వపు స్వర్గాన్ని*** చేరుకునే సాధనా మార్గాన్ని విరామం లేకుండా ప్రపంచానికి అందిస్తోన్న ***మాస్టర్ చింగ్ హాయ్*** .. ఇంగ్లీష్, ఫ్రెంచ్, జర్మన్, చైనీస్ మరి వియత్నమీస్ భాషల్లో చక్కటి ప్రావీణ్యాన్ని కలిగిన బహుభాషాకోవిదురాలు!

పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీల ధ్యాన జ్ఞాన వాణి

**" ధ్యాన జగత్ "**

**నవ్యయుగ ధ్యానయోగ మాసపత్రిక**

**చందాదారులు కండి .. చదవండి .. చదివించండి ..**

**ఫోన్స్ : 70754 67755, 92463 37630**

**www.pssmovement.org , e-mail : dhyanajagat2020@gmail.com**



" మైత్రేయ బుద్ధ మెగా పిరమిడ్ " పిరమిడ్ వ్యాలీ, బెంగళూరు



" మహేశ్వర మహా పిరమిడ్ " కైలాసపురి, కడ్తాల్



# బ్రహ్మర్షి పితామహ పత్రీజీ

| | | |
|---|---|---|
| జననం | : | 1947, నవంబర్ 11వ తేదీ |
| తల్లితండ్రులు | : | శ్రీమతి సావిత్రీదేవి, శ్రీ రమణారావు |
| విద్య | : | M.Sc. (Agl.) |
| వివాహం | : | శ్రీమతి స్వర్ణమాల పత్రి గారితో .. 1974, మే 26వ తేదీ |
| సంతానం | : | శ్రీమతి పరిణిత, శ్రీమతి పరిమళ USA |
| సంగీత గురువులు | : | శ్రీ చంద్రశేఖరన్ గారు, వేణునాదం<br>డా॥ శ్రీపాద పినాకపాణి గారు, కర్నాటక గాత్రం |
| ఆధ్యాత్మిక గురువు | : | శ్రీ సద్గురు సదానంద యోగి గారు |
| ధ్యాన ప్రచారం | : | 1991లో కర్నూలు, బుద్ధా పిరమిడ్ మెడిటేషన్ సెంటర్ ప్రారంభం<br>1992లో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ స్థాపన ద్వారా ..<br>ప్రపంచ వ్యాప్తంగా ధ్యాన విద్యా ప్రచారం |
| పురస్కారాలు | : | మహాత్మాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్, వార్ధా, మహారాష్ట్ర ..<br>" లైఫ్ టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డ్ - 2006 "<br>ఇండియన్ బోర్డ్ ఆఫ్ ఆల్టర్నేటివ్ మెడిసిన్స్, కోల్‌కత్తా .. " ధ్యాన విశారద - 2013 "<br>స్పీకింగ్ ట్రీ .. " గుడ్ కర్మ అవార్డ్ - 2017 "<br>ఓజస్వినీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్, మధ్యప్రదేశ్ .. " అర్ధనారీశ్వర - 2018 "<br>ఇండియన్ ఎక్స్‌ప్రెస్ - " ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ - 2018 "<br>" వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ - 2018 "<br>మహాబోధి ఇంటర్నేషనల్ మెడిటేషన్ సెంటర్, లేహ్-లడఖ్ ..<br>" గ్లోబల్ పీస్ అవార్డ్ - 2019 " |


**PSSM Media Ltd.**

(CIN NO : U74994TG2017PLC121367)



# " ధ్యాన జగత్ "

" ధ్యాన జగత్ " విశేష అభివృద్ధి కోసం
మీ విరాళాలను క్రింది అకౌంట్‌లో జమచేయగలరు

# " Dhyana Jagat "

Google Pay | Phone Pe | Paytm | WhatsApp

Union Bank of India A/c No 244711100001194

IFSC CODE : UBIN0824470

GREEN HILLS COLONY BRANCH, HYDERABAD

No.: 70754 99799

వివరాలకు : D. కేశవరాజు - 70754 99799

మీ Payment Receipt, పూర్తి చిరునామా, పిన్‌కోడ్
మరి సెల్ నెంబర్‌తో సహా WhatsApp కు పంపగలరు

www.dhyanajagat.com | e-mail : dhyanajagat2020@gmail.com

**నవ్యయుగ ధ్యానయోగ మాసపత్రిక " ధ్యాన జగత్ " .. చందాదారులు కండి .. చదవండి .. చదివించండి!**

☐ సంవత్సర చందా రూ.500 /-
☐ రెండు సంవత్సరాల చందా రూ.1000 /-
☐ ప్యాట్రన్ రూ|| 10,000/-
☐ పోషకులు రూ|| 25,000/-

రిజిస్టర్డ్ పోస్ట్ :
☐ 1 సంవత్సరం రూ.700 /-
☐ 2 సంవత్సరాలు రూ.1400 /-
☐ ప్యాట్రన్ రూ||15,000/-
☐ పోషకులు రూ||30,000/-

# " నెట్టింట్లో ధ్యాన జగత్ " For e-copy/digital copy

year Subscription - Rs.450/- | 2 years Subscription - Rs.900/-

భారతదేశంలో ఉన్నవారికోసం : **www.dhyanajagat.com**

విదేశాలలో ఉన్నవారికోసం : **global.dhyanajagat.com**

**e-copy/ digital copy** ని
వెబ్‌సైట్ ద్వారా గత సంచికలతో పాటు సరిక్రొత్త సంచికను కూడా
మీ సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ మరి డెస్క్‌టాప్‌లో చదువుకోవచ్చు!

ఈ అవకాశాన్ని ప్రతి తెలుగువారు సద్వినియోగం చేసుకోగలరు!

గత సంచికలు ఉచితం ..

వివరాలకు : ధ్యానరత్న కేశవరాజు : 70754 99799